సమావేశము - IV
వాల్యూము - I
నెం. 4

వెల : రూ. 19-00
16 మార్చి, 2016
బుధవారము,
(శక సం. 1937,
ఫాల్గుణం - 26)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


1. ప్రశ్నోత్తరాలు ... 1

2. సభా కార్యక్రమం : ... 27

(అ) ప్రత్యేక ప్రస్తావన

(ఆ) వాయిదా తీర్మాన తిరస్కరణ గురించి

3. 2016-17 సంవత్సరానికి వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్)పై మొదటి రోజు సాధారణ చర్చ ... 28


J. 78

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటి ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎన్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (నాల్గవ సమావేశము - నాల్గవ రోజు)

## బుధవారం, మార్చి 16, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ ఛైర్మన్ : ముఖ్యంగా సభ్యులందరికీ ప్రత్యేకంగా మనవి చేస్తున్నాను. ప్రశ్నోత్తరాల సమయంలో వచ్చే ప్రశ్నలను దయచేసి సభ్యులు ప్రశ్నలను, ప్రశ్నలలాగానే అడగాలి గానీ వాటిని స్పీచ్‌లుగా కొనసాగించవద్దు. అదేవిధంగా గౌరవ మంత్రులకి కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. జవాబులను జవాబుల లాగానే చెప్పండి. దయచేసి వాటిని ఎక్కువగా పొడగించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. అందరికీ సంబంధించిన ప్రశ్నలన్నింటికీ జవాబులు వచ్చే విధంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

### 1. ప్రశ్నోత్తరాలు

### స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు

ప్రశ్న నెం.1308(21)

శ్రీ ఉల్లోల్ల గంగాధర్ గౌడ్, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు 14వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసిన విషయం వాస్తవమేనా ;

ఆ) అయితే, ఇప్పటివరకు నిధులు విడుదల అయిన రాష్ట్రంలోని స్థానిక సంస్థల వివరాలేమిటి ;

ఇ) లేనట్లయితే, అందుకు గల కారణాలేమిటి?

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి (శ్రీ కె.తారక రామారావు):- అ) అవునండీ.

ఆ) గ్రామ పంచాయతీలన్నింటికి నిధులు విడుదల చేయడమయింది.

ఇ) ఆ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ ఉల్లోల్ల గంగాధర్ గౌడ్ (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, గతంలో కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకి బిఆర్‌జిఎఫ్ నిధులు వచ్చేవి. అదేవిధంగా మండల, జిల్లా పరిషత్తులకు వచ్చే నిధులు గానీ ఇతర అనేక నిధులన్నీ కూడా కేంద్ర ప్రభుత్వం విత్‌డ్రా చేసుకోవడం జరిగింది. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థలను పటిష్టపరచడానికి గ్రామ, మండల మరియు జిల్లా పరిషత్తులకు ప్రభుత్వం ఏమైనా నిధులను కేటాయించడానికి ఆలోచన చేస్తున్నదా అని మీ ద్వారా గౌరవ మంత్రివర్యులను అడుగుతున్నాను.

శ్రీ కె.తారక రామారావు : అధ్యక్షా, రాబోయే ఐదేళ్ల కాలంలో గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థిక కమీషన్ ద్వారా దాదాపుగా రూ.5,375.02కోట్లు రాబోతున్నాయి. అందులో 2015-16వ సంవత్సరానికి గాను రూ.580.కోట్లు, 2016-17వ సంవత్సరానికి గాను రూ.980.కోట్లు, 2017-18వ సంవత్సరానికి గాను రూ.1047కోట్లు, 2018-19సంవత్సరానికి గాను రూ.1209కోట్లు, 2019-20వ సంవత్సరానికి గాను రూ.1628కోట్లు ఈరకంగా పెద్ద మొత్తంలో గ్రామ పంచాయతీలకు నిధులు రాబోతున్నాయి. గౌరవ సభ్యులు 14వ ఆర్థిక సంఘం గురించి మరియు గ్రామ పంచాయతీల నిధుల గురించి

విషయం అందరికీ తెలిసిందే. వారు చెప్పినట్లుగా గతంలో బి.ఆర్.జి.ఎఫ్. నిధులు వచ్చేవి. గతంలో 13వ ఆర్థిక సంఘం నిధుల ప్రకారం 70:20:10 లో ఆనాడు మండల, జిల్లా పరిషత్తులకు నిధులు వచ్చేవి. కానీ, ప్రస్తుతం 14వ ఆర్థిక సంఘం ప్రకారం నేరుగా 100 శాతం నిధులను గ్రామ పంచాయతీలకు ఇవ్వబోతున్నాము. బిఆర్‌జిఎఫ్ నిధులను తొలగించాలనే నిర్ణయం గానీ, నిష్పత్తిని మార్చి సంపూర్ణంగా గ్రామ పంచాయతీలకే నిధులను కేటాయించడమే నిర్ణయం గానీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నిర్ణయం. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులైన శ్రీ చౌదరి బీరేంద్ర సింగ్ గారిని పలుమార్లు కలవడం కూడా జరిగింది.

వారిని కలిసినప్పుడు తెలంగాణలో మండల, జిల్లా పరిషత్తులు నిర్వీర్యం అయిపోయే పరిస్థితి ఉన్నదని, దానివల్ల మండల, జిల్లా ప్రాదేశిక సభ్యులు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిర్వీర్యం అయిపోయి వారు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయే పరిస్థితి ఉన్నదని వారి దృష్టికి తీసుకురావడం జరిగింది. దాంతో వారు మిగతా రాష్ట్రాల పంచాయతీరాజ్ మంత్రులతో కలిపి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని మీ సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించండని మాకు తెలియజేయడం జరిగింది. దానిని తప్పకుండా పరిశీలిస్తామని ఒక మాట ఇచ్చారు.

ఈ పరిస్థితి నుండి మండల, జిల్లా పరిషత్తులను గట్టెక్కించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న నిర్ణయం ఏమంటే, రాష్ట్ర ఆర్థిక సంఘం నుండి మనకు వచ్చే నిధులలో ఈసారి పర్సంటేజీలను మార్చాలనే ఆలోచనలో ఉన్నాము. ప్రతిసారీ మనం జిల్లా పరిషత్తులకు 20శాతం, మండలాలకు 12.5శాతం మరియు గ్రామ పంచాయతీలకు 67.5శాతం రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులిస్తున్నాము. ఇప్పుడు దీనిని సవరించి జిల్లా పరిషత్తులకు 40శాతం, మండలాలకు 50శాతం మరియు గ్రామ పంచాయతీలకు 10శాతం ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నాము. తద్వారా స్థానిక సంస్థలను కాపాడుకోవాలనే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఎంత చేసినా, 14వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి రాబోయే ఐదేండ్లలోనే రూ.5,375కోట్లు రాబోతున్నాయి. కాబట్టి, మండల, జిల్లా పరిషత్తులను కాపాడుకోవాలంటే అందరం కూడా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటే తప్ప, పూర్తిస్థాయి న్యాయం చేసే అవకాశం ఉండదు. అందుకే కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు నివేదించాము. ఇదే ధోరణితో కలిసివచ్చే దేశంలోని ఇతర రాష్ట్రాల మంత్రులు ఇద్దరు, ముగ్గురు ఇప్పటికే మాకు లేఖలు వ్రాయడం జరిగింది. కాబట్టి, తప్పకుండా వారందరితో కలిసి శాసనసభ సమావేశాలు ముగిసిన తరువాత ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏప్రిల్ మాసంలో కేంద్ర మంత్రి గారిని కలవాలనే ఆలోచన ఉంది. తప్పకుండా ఆ పని చేస్తామని గౌరవ సభ్యులకి మనవి చేస్తున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీనారాయణ (స్థానిక సంస్థలు - ఖమ్మం): అధ్యక్షా, ముఖ్యంగా మండలాల్లో జిల్లా పరిషత్తుల నుండి కనీసం మంచినీళ్ల బోర్లు వేసేటువంటి పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వం నుండి ఈమధ్య జిల్లా కలెక్టర్లకు కొన్ని అధికారాలిచ్చారు. లోకల్ అథారిటీలను బలోపేతం చేయడానికి కొన్ని నిధులు ప్రభుత్వం నుండి ఇస్తూ, గతంలో కేంద్ర ప్రభుత్వం నుండి బి.ఆర్.జి.ఎఫ్. నిధులు ఎలాగైతే వచ్చేవో, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని చెప్పి శాసనసభ మరియు శాసనపరిషత్తుల నుండి ఒక యునానిమస్ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే బాగుంటుందని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ పట్నం నరేందర్ రెడ్డి (స్థానిక సంస్థలు-రంగారెడ్డి): అధ్యక్షా, గతంలో కేంద్ర ప్రభుతం రాష్ట్రాల్లోని జిల్లా పరిషత్తులకు-20 శాతం, మండల పరిషత్తులకు-30 శాతం, గ్రామ పంచాయతీలకు - 50 శాతం జి.ఆర్.బి.ఎఫ్. నిధులిచ్చేవారు. అదేవిధంగా 13వ ఆర్థిక సంఘం నుండి జిల్లా పరిషత్తులకు-20 శాతం, మండల పరిషత్తులకు-20 శాతం, గ్రామ పంచాయతీలకు- 60 శాతం నిధులిచ్చేవారు. కానీ, 14వ ఆర్థిక సంఘంలో అవి రద్దు చేయడం జరిగింది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం బిఆర్‌జిఎఫ్ నిధులు కూడా రద్దు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈరోజు మండల, జిల్లా పరిషత్తులు నిర్వీర్యం అవుతున్నాయి.

కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు బడ్జెట్‌లో కేటాయించిన రూ.10కోట్ల నుండి నేరుగా మండల, జిల్లా పరిషత్తులకు నిధులివ్వాలని మీద్వారా గౌరవ మంత్రి వర్యులను కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మన రాష్ట్రంలోని గ్రామాల్లో అసలు ఇన్‌కమ్ అనేది లేదు. టాక్స్ రూపంలో వచ్చేది, శానిటేషన్‌కి కూడా సరిపోదు. అలాంటి సమయంలో గ్రామ పంచాయతీలకు వచ్చిన 13వ ఆర్థిక సంఘం నిధుల్లో దాదాపు 60, 70 అలాగే కొన్ని గ్రామాల్లో 80శాతం నిధులను గ్రామాల్లోని వీధి దీపాల విద్యుత్తు బకాయిల రూపంలో విద్యుత్ శాఖ వారే తీసుకోవడం జరిగింది. కాబట్టి ఈ రెండు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధుల ద్వారా గ్రామ పంచాయతీలు ఏమీ అభివృద్ధి చెందలేదు.

ముఖ్యంగా విద్యుత్ బకాయిలు ఉన్నమాట వాస్తవం. కానీ, గ్రామ పంచాయతీల అభివృద్ధికి వచ్చిన నిధుల నుండి విద్యుత్ బకాయిలు చెల్లించడం వల్ల గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడిపోయింది. దానిమీద రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతో ఒక్క రూపాయి కూడా వేరే దానికి ఖర్చు చేయకుండా గ్రామ పంచాయతీలకు ఏమి అభివృద్ధి చేయాలో అది చేస్తూ, ఈ విద్యుత్ బిల్లుల విషయంలో ఖచ్చితంగా ఒక పాలసీ పెట్టి ఏదో రకంగా గ్రామ పంచాయతీలకు income generation చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం కొన్నిచోట్ల 100శాతం టాక్స్‌లు కట్టించారు. కానీ, అది అన్నిచోట్ల సాధ్యం కాదు. ఎందుకంటే కొన్నిచోట్ల తాండాలుంటాయి, కొన్నిచోట్ల దళిత వాడలుంటాయి. ఒకవేళ టాక్స్‌ల రూపంలో ఏమైనా వచ్చినా కూడా అది చాలా చిన్న అమౌంటు ఉంటుంది. కాబట్టి గ్రామ పంచాయతీలలోని విద్యుత్ బిల్లుల విషయంలో గౌరవ మంత్రివర్యులు స్పష్టమైన సమాధానమిస్తారని ఆశిస్తున్నాను.

శ్రీ వి.భూపాల్‌రెడ్డి (స్థానిక సంస్థలు - మెదక్): అధ్యక్షా, మండల ప్రాదేశిక సభ్యులు, జిల్లా ప్రాదేశిక సభ్యులకు ఉన్న ఇబ్బందులు తెలియజేయడం జరిగింది. లోకల్ బాడీల్లో ఎన్నికైన మామీదవారి ఒత్తిడి ఎక్కువైంది. నా నియోజకవర్గం క్రింద యాభై మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. దానివల్ల ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క లక్ష రూపాయలు కూడా ఇవ్వలేకపోతున్నాము. కనుక, మాకు ఇచ్చేటువంటి నిధులు పెంచినట్లయితే లోకల్ బాడీ వారికి పనికివస్తాయి. వారి ఇబ్బందులను దూరం చేసిన వారమవుతాం. అలాగే గ్రామ పంచాయతీలలో కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులు ఎవరైతే పనిచేస్తున్నారో వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నాను. గతంలో కొన్ని శాఖల్లో రెగ్యులరైజ్ చేయడం జరిగింది. అదేవిధంగా కొంతమంది గ్రామ కార్యదర్శులకు ఒక్కొక్కరికి నాలుగైదు గ్రామపంచాయతీలున్నాయి. దానివల్ల గ్రామాలలో కొన్ని తప్పులు, ఇబ్బందులు కూడా జరుగుతున్నాయి. కాబట్టి, ఒక్కొక్క గ్రామ పంచాయతీకి ఒక్కొక్క కార్యదర్శిని నియమించాలని కోరుతూ, వీటిపై గౌరవ మంత్రివర్యులను సమాధానమివ్వాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ టి. భానుప్రసాద రావు (స్థానిక సంస్థలు - కరీంనగర్): అధ్యక్షా, స్థానిక సంస్థలకు సంబంధించి నిధుల సమస్య ఒకటైతే, ఆ నిధులు కేంద్ర ప్రభుత్వ అంశమని మంత్రిగారు తెలియజేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వారికి వచ్చేటువంటి పర్సంటేజీలు మార్చినప్పటికీ కూడా ఒకటి నిధులైతే, మరొకటి విధులకు సంబంధించిన అంశం ఉంది. నిధులతోపాటు, విధులను కూడా కల్పించాలని మండల ప్రాదేశిక సభ్యులు, జిల్లా ప్రాదేశిక సభ్యులు పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా వారు రెండు, మూడు అంశాలు డిమాండు చేస్తున్నారు. మాలాంటి వారిమి ఏమైనా నిధులిచ్చినా కూడా గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా వారు పనులు చేయలేని పరిస్థితి ఉంది. కాబట్టి, ఆ తీర్మానం అవసరం లేకుండా మేము ఇచ్చేటువంటి నిధులను ఖర్చుపెట్టేవిధంగా చేయాలని కోరుతున్నాను.

అదేవిధంగా గ్రామాల్లో వేస్తున్నటువంటి కమిటీల్లో ఒక కమిటీకి మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుడిని గానీ, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడిని గానీ కన్వీనర్‌గా వేసేటువంటి సదుపాయాన్ని కల్పించవలసిందిగా మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను. వారికి నిధులెంత ముఖ్యమో, విధులు కూడా అంతే ముఖ్యమని వారు

కోరుతున్నారు. కాబట్టి ఆ విషయంలో కూడా ఆలోచించాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (శాసనసభ నియోజక వర్గం) : అధ్యక్షా, గ్రామాల్లో త్రాగునీటి సమస్య చాలా ఉంది. కాబట్టి గౌరవ మంత్రివర్యులు కంటిన్యూగా మానీటర్ చేసి ప్రతి గ్రామ పంచాయతీ పరిస్థితులు ఏమిటనేది ఆలోచించి బడ్జెట్‌లో రూ.300కోట్లు కేటాయించినప్పటికీ ఇంకా ఏదైనా అదనంగా ప్రత్యేక నిధిని త్రాగునీటికి కేటాయించాలని కోరుతున్నాను.

గ్రామ సచివాలయాలు కేరళ రాష్ట్రంలో ఎలా పనిచేస్తున్నాయనేది తెలుసుకోవడానికై ఇటీవలే గౌరవ మంత్రి గారు కేరళ రాష్ట్రాన్ని పర్యటించడం జరిగింది. అక్కడి విధానాలు ఎలా ఉన్నాయనేది ఆలోచించి మన రాష్ట్రంలో కూడా ఆ విధానాల్ని తీసుకువస్తే బాగుంటుందని కోరుతున్నాను. ముఖ్యంగా ఆనాడు శ్రీ రాజీవ్ గాంధీ గారు గ్రామ పంచాయతీలకు 29 అధికారాల బదలాయింపు చట్టాన్ని చేయడం జరిగింది. ఆ బదలాయింపులో ఇంకేమైన మిగిలి ఉంటే అవి ఎప్పటిలోపు అవుతుందనేది చూడాలి. 14వ ఆర్థిక సంఘంలో కూడా చాలా aspects వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం కూడా చాలా పెద్ద component పెట్టింది. కాబట్టి, త్రాగునీరు, గ్రామ సచివాలయాలు మరియు గ్రామ పంచాయతీల అధికారాల విషయంలో గౌరవ మంత్రి గారు వివరిస్తారని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజక వర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) : అధ్యక్షా, స్థానిక సంస్థలంటే పట్టణ ప్రాంతం గానీ, గ్రామీణ ప్రాంతం గానీ. ఆ ప్రాంతాలలో ఉండేటువంటి పాఠశాలల నిర్వహణ బాధ్యత, స్వీపర్, శానిటేషన్ విషయాలల్లో గ్రామ పంచాయతీలు గానీ, మున్సిపాలిటీలు గానీ తీసుకునే అవకాశం ఉన్నదా? గ్రామ పంచాయతీలల్లో కొన్ని 1959, 1970వ సంవత్సరాల్లో నిర్మించినటువంటి భవనాలున్నాయి. అవి పూర్తిగా కూలిపోయే దశకు వచ్చాయి. కాబట్టి ఆ ప్రాతిపదిక మీద ఏవైతే శిథిలావస్థలో ఉన్నటువంటి భవనాలున్నాయో, వాటికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ వాటిని పునర్‌నిర్మాణం చేసేటువంటి ప్రతిపాదన ఏమైనా ఉన్నదా? అనే విషయాలు తెలియజేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు : అధ్యక్షా, దాదాపుగా ఒక ఉప చర్చ మాదిరిగానే గౌరవ సభ్యులు ఇన్ని ప్రశ్నలడిగారు. సమయం కూడా ఇవ్వండి. తప్పకుండా సమాధానం చెబుతాను. ఒకటి నిధుల విషయాల్లోనే ఇందాక నేను స్పష్టతనిచ్చాను. గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం ద్వారా పెద్ద మొత్తంలో రాబోయే ఐదేళ్లలో రూ.5,375కోట్లు నేరుగా గ్రామ పంచాయతీలకు రాబోతున్నాయి. అందులో90శాతం నేరుగా వస్తాయి. ఇంకొక 10శాతం గ్రామజ్యోతిలో ఏ కండీషన్స్ అయితే పెట్టుకున్నామో, performance grant అంటే, మీరు ఎంచుకున్న ప్రాతిపదిక మేరకు హరితహారం విషయంలో గానీ, మరుగుదొడ్ల విషయంలో గానీ, immunization విషయంలో గానీ వీటన్నింటిలో గ్రామాలు గనుక ఎంచుకున్న లక్ష్యాలు చేరుకున్నట్లయితే వారికి అదనంగా 10శాతం ఇవ్వడానికి ప్రోత్సాహక గ్రాంటులాగా performance grant అని పెట్టుకున్నాము. ఆ రకంగా గ్రామాలకు పెద్దమొత్తంలో నిధులు ఇవ్వబోతున్నాము. స్థానిక సంస్థల ద్వారా ఎన్నికైన గౌరవ శాసనపరిషత్తు సభ్యులు వ్యక్తం చేసిన ఆవేదనతో నేను ఏకీభవిస్తున్నాను. వారి వాదనేమంటే, ఖచ్చితంగా ఈరోజు మండల, జిల్లా పరిషత్తులు నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయే పరిస్థితి ఉందో, అదేవిధంగా వారి నిధుల విషయంలో కూడా స్పష్టత లేకుండా ఉన్నదో ఆ విషయంలో కూడా వారి ఆవేదనతో ఏకీభవిస్తున్నాను.

అందుకే ఇందాక నేను చెప్పినట్లుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నుండి ఇచ్చే నిధులను మనం పునర్ వ్యవస్థీకరిస్తున్నాము. గతంలో జిల్లా పరిషత్తులకు 20శాతం, మండల పరిషత్తులకు 12.5శాతం మాత్రమే ఇచ్చేవారిమి. ఇప్పుడు దానిని మార్చి 90శాతం నిధులను నేరుగా మండల, జిల్లా పరిషత్తులకు ఇవ్వాలనే మంచి నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నది. దానికి గౌరవ సభ్యులు తప్పకుండా సంతోషిస్తారని నేను భావిస్తున్నాను.

దానితోపాటు గౌరవ సభ్యులు శ్రీ టి.భానుప్రసాద్ రావు గారు మాట్లాడినట్లుగా గౌరవ మండల, జిల్లా ప్రాదేశికసభ్యులు నిధుల విషయమే కాకుండా విధుల విషయం కూడా కోరుకుంటున్నారని అన్నారు. చాలామంది మండల, జిల్లా ప్రాదేశికసభ్యులకి ఒక్క విషయంలో స్పష్టత లేదు. అదేమంటే గ్రామ పంచాయతీ భవనంలో కూర్చోడానికి మాకు ఒక కార్యాలయం కావాలని మండల ప్రాదేశిక సభ్యులు అడుగుతుంటారు. ఖమ్మం మరియు ఇతర కొన్ని జిల్లాల్లో మండల పరిషత్ కార్యాలయాల్లో కొంతమంది జిల్లా ప్రాదేశిక సభ్యులకి కార్యాలయాలు ఇవ్వడం జరిగింది. నిజానికి ఐదంచెల వ్యవస్థలో మనం ఎంచుకున్న పద్ధతిలో వాస్తవ సూత్రం ఏమిటంటే ఎంపిటిసి అనే వ్యక్తి మండలానికి-గ్రామానికి అనుసంధానకర్తగా ఉంటారు. మండల పరిషత్తు నుండి గ్రామాలకి రావాల్సిన నిధులను సకాలంలో తీసుకువచ్చి ఆ గ్రామాభివృద్ధికి తోడ్పడడం అనేది ఎంపిటిసి గారి బాధ్యత. అంతేగానీ వారు కూడా సర్పంచ్‌గారితోపాటు గ్రామ పంచాయతీలో కూర్చుంటే మళ్లీ అక్కడ ఒక turf war అనేది మొదలవుతుంది.

అదేరకంగా జిల్లా పరిషత్తు నుండి మండలానికి సకాలంలో, సరైన పద్ధతిలో నిధులను తీసుకురావడం జెడ్‌పిటిసి గారి బాధ్యత. అంతేగానీ, ఎంపిటిసి గారు నేను గ్రామాల్లో కూర్చుంటాను. జెడ్‌పిటిసి గారు నేను మండలంలో కూర్చుంటానంటే ఎంచుకున్న, మనం పెట్టుకున్న ఈ పద్ధతికి ఆ వ్యవస్థ యొక్క స్ఫూర్తి కూడా కొద్దిగా దెబ్బతినే పరిస్థితి ఉంటుంది. అయినప్పటికీ ఇప్పటికీ కూడా కొన్ని జిల్లాల్లో మండల పరిషత్తు కార్యాలయాల్లో జిల్లా ప్రాదేశిక సభ్యులకు కార్యాలయాలను కల్పించడం జరిగింది. మిగతా జిల్లాల్లో కూడా కల్పించడానికి ప్రభుత్వానికి అభ్యంతరం ఏమీ లేదు. ఆ దిశగా కుడా ఆలోచిస్తాము.

అయితే నిధుల విషయంలో అన్ని రాష్ట్రాల మంత్రులతో కలిపి కొంత ఒత్తిడి తీసుకురావాలి. తద్వారా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనని సవరించుకొని ఈ వ్యవస్థను కాపాడే ప్రయత్నం చేయాలని కూడా మేము అనుకుంటున్నాము.

అదేవిధంగా పెద్దలు ప్రతిపక్ష నాయకులు సిసి చార్జీలతోపాటు టాక్స్ విషయాలు కూడా ప్రస్తావించడం జరిగింది. సిసి చార్జీల సమస్య ఒక్క రోజుతో వచ్చిన సమస్య కాదు. రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు కలిపి దాదాపు రూ.1200కోట్ల సిసి చార్జీల బకాయిలను డిస్కంకి చెల్లించవలసి ఉంది. ఇది దాదాపుగా గత పది, పదిహేను సంవత్సరాలుగా ఎవరు కూడా ఆయా గ్రామ పంచాయతీలకు స్పష్టమైన డైరెక్షన్స్ ఇవ్వకపోవడం. మీరు ఎప్పటికప్పుడు డబ్బులు కట్టుకుంటే ఈ సమస్య పేరుకుపోదని చెప్పకపోవడం వల్ల వచ్చిన సమస్య తప్ప, ఇదేదో తెలంగాణ వచ్చిన తరువాత వచ్చిన సమస్య కాదు. రూ.1200కోట్లు బకాయిలు ultimate గా ఇవి డిస్కంలకు కట్టకపోతే వారు ఊరుకోరు. అదేవిధంగా కొన్ని గ్రామ పంచాయతీలకు మేము ఇచ్చిన ఆలోచన ఏమంటే, మీ ఆదాయం పెంచుకోండి at the same time పెద్ద మొత్తంలో వస్తున్న నిధులను కూడా ఎంతో కొంత మొత్తం దీనికి వినియోగించుకోండని కూడా సూచన ఇవ్వడం జరిగింది.

10.20 ఉ. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ విభాగంలో మేము తీసుకొచ్చిన ఒక ముఖ్యమైన మార్పును తమరి ద్వారా నేను సభ దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాను. మేము జూన్ 2, 2014న అధికారం చేపట్టిన సమయానికి మన రాష్ట్ర పంచాయితీల్లో పన్నుల వసూలు కేవలం 36 శాతం మాత్రమే ఉండేది. ఆ విధంగా పంచాయితీలు, మున్సిపాలిటీలు పన్నులు కట్టనప్పుడు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. కాబట్టి మేము దీనిని ఒక సవాలుగా తీసుకున్నాము.

నేను ఇతరులకు చెప్పేముందు, నా నియోజక వర్గంలో ఆదర్శప్రాయంగా ఉండాలనే ఉద్దేశ్యంతో, గత సంవత్సరం సిరిసిల్ల నియోజకవర్గం నుండి పన్నుల వసూలు ప్రారంభించి మొత్తం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కూడా పెద్ద ఎత్తున Property Tax వసూళ్ల కార్యక్రమం చేపట్టాము. సిరిసిల్లలో దాదాపు 100 శాతం చేరుకున్న తరువాత, మిగతా నియోజకవర్గాల్లో కూడా ప్రారంభించాము. మంచి ఫలితాలు కూడా సాధించామని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. 2014లో 36శాతం పన్ను వసూలు ఉండగా, 2015 నాటికి

67 శాతానికి తీసుకురాగలిగాము. దాంతో రాష్ట్రానికి రూ294కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నాము.

ఒక్క మెదక్ జిల్లాలోనే అక్కడున్నటువంటి డిపిఓ మరియు ప్రజా నాయకులందరూ కలిసి సమిష్టిగా పనిచేయడం వల్ల వంద శాతం పన్నులు వసూలు చేసుకోగలిగాము. అదే రకంగా ఈ సంవత్సరంలో కూడా పెద్ద మొత్తంలో చేస్తున్నాము. గత సంవత్సరంలో పెట్టుకున్న టార్గెట్ కంటే ఈ సంవత్సరం ఎక్కువ వసూళ్లు చేయగలమనే విశ్వాసం నాకు ఉంది. ప్రజలు పన్నులు కట్టాలనే ఒక disciplineలోకి రాకపోతే ఈ ఫలితం సాధించలేకపోయే వాళ్లం. ఎందుకంటే పన్నులు కడితేనే మనకు పనులు జరుగుతాయనే విధంగా ప్రజలకు విశ్వాసం కలిగించాలి.

పంచాయతీరాజ్ మరియు రోడ్లు, భవనాల శాఖ ద్వారా, జరుగుతున్న ప్రతి పని దగ్గర బోర్డులు కూడా పెట్టించడం జరిగింది. "ప్రజల పన్నులతోనే ప్రజా పనులు" అనే ఒక స్ఫూర్తితో ముందుకు వెళుతున్నాము. అమెరికా వంటి దేశాల్లో ఈ విధానం పాటిస్తున్నారు. మీ ద్వారా అభివృద్ధి జరుగుతున్నది, ఇందులో మీరు భాగస్వాములు అనే ఒక స్ఫూర్తిని ప్రజలకు కలిగించే ప్రయత్నం చేస్తున్నాము.

గౌరవ ఎల్ఓపి గారికి నాదో విజ్ఞప్తి. 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులు కానీ, ఇతరత్రా పంచాయితీలు సమకూర్చుకునే నిధులు కానీ, ఇవన్నీ మళ్లీ వాటికే బదలాయింపు జరుగుతుంది. తద్వారా అల్టిమేట్‌గా వారు కట్టకపోతే, ఎప్పటికైనా మనం ఈ సమస్యను పరిష్కరించుకోలేము. కాబట్టి, సి.సి. చార్జెస్ విషయంలో గానీ, వాయిదా పద్ధతులలో గానీ విద్యుత్ శాఖతో చర్చించడం జరిగింది. ఈ మార్చి 31లోపల చెల్లించినట్లయితే, సర్ చార్జీ రద్దు చేస్తారు. ఆ సర్‌చార్జీ తొలగించే విధంగా, వారికి వాయిదా పద్ధతుల్లో చెల్లించే విధంగా ఏర్పాటు చేసాము. ఈ డిసిప్లిన్ ఎక్కడో ఒకచోట రాకపోతే, భవిష్యత్తులో ఎప్పటికైనా ఒక సమస్యగా ఉంటుంది. దాంతో గ్రామ పంచాయతీలకు పెద్ద మొత్తంలో నిధులు వస్తున్నాయి. కాబట్టి, ఈ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తమరి ద్వారా ఈ సభకు తెలియజేస్తున్నాను.

పాఠశాలల పారిశుధ్యాన్ని గ్రామపంచాయితీల సిబ్బంది చేస్తే బాగుంటుందని కొందరు సభ్యులు చెప్పడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రిగారు ఇప్పటికే మాకు ఆ విషయంలో ఆదేశాలివ్వడం జరిగింది. గ్రామ పంచాయతీల పరిధిలో ఉండే పాఠశాలలన్నిటిలో కూడా గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారానే పారిశుధ్యాన్ని నిర్వహించాలని చెప్పారు. అటెండర్లు లేని పాఠశాలలు చాలా ఉన్నందువల్ల, ఆ దిశగా ఆలోచించాలని గౌరవ ముఖ్యమంత్రిగారు ఆదేశించారు. శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెబుతున్నాను. పంచాయతీలకు అధికారాల బదలాయింపులో విద్యా వ్యవస్థకు సంబంధించినది కూడా ఉంది. ఇప్పటికే విద్యా కమిటీలు పాఠశాలల పారిశుధ్యాన్ని నిర్వహిస్తున్నాయి.

గౌరవ సభ్యులు వి. భూపాల్‌రెడ్డి గారు మంచినీటి ఎద్దడి గురించి అడిగారు. ఈ రోజు దానికి సంబంధించిన ప్రశ్న ఉంది. కాబట్టి, ఆ సమయంలో సవివరంగా సమాధానం చెప్పడం జరుగుతుంది. మండల వ్యవస్థకు, జిల్లా పరిషత్ వ్యవస్థకు సంబంధించి ఒక తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని బలసాని లక్ష్మీనారాయణ గారు సూచించారు. తమరు అనుమతిస్తే ఈ సమావేశాల్లోనే ఆ తీర్మానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదు.

గతంలో కూడా ఉపాధి హామీ గురించి కూడా మనం తీర్మానం చేసాము. కేంద్ర ప్రభుత్వం కూడా ఈసారి పెద్ద మొత్తంలో ఉపాధి హామీకి నిధులు కేటాయించింది. కాబట్టి మనం తీర్మానం చేసినట్లయితే ఒక మంచి సందేశాన్ని గౌరవ ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలకు ఇచ్చినవాళ్లమవుతాము. అందువల్ల ఆ దిశగా తీర్మానం చేయడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు. మీరు అనుమతిస్తే ఈ సమావేశాల్లో ఆ తీర్మానాన్ని ప్రవేశపెడతామని తెలియజేస్తున్నాను.

### కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచిత చికిత్స

ప్రశ్న నెం. 1167(22)

శ్రీ ఫారూక్ హుస్సేన్, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

ఎ) ప్రయివేటు, కార్పొరేటు ఆసుపత్రులు సాధారణ, అమాయక రోగుల నుంచి అత్యధిక మొత్తాలను వసూలు చేస్తున్న విషయం వాస్తవమేనా;

బి) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి;

సి) బిపిఎల్ కుటుంబాలలోని 30 శాతం రోగులకు కార్పొరేటు/సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉచిత చికిత్సను అందించాలనే నియమం ఏదైనా ఉన్నదా;

డి) అయితే ఆ వివరాలేమిటి ;

ఇ) ఈ విషయంలో జారీ చేసిన మార్గదర్శకాల అమలును పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడాన్ని పరిశీలించడమవుతుందా?

గౌరవ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా. సి. లక్ష్మారెడ్డి):- ఎ) లేదండీ. అంటే మన దేశంలోగాని, రాష్ట్రంలోగాని ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులలో వసూలుచేసే ఫీజులపై ఎటువంటి నియంత్రణ లేదు. కేంద్ర ప్రభుత్వం CGHS క్రింద కొన్ని చికిత్సలకు రేట్లు నిర్ణయించడం జరిగింది. మన రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా అమలవుతున్న చికిత్సలకు ప్యాకేజీ రేట్లు నిర్ణయించడం జరిగింది. అంతే తప్ప, ఒక నియంత్రణ అంటూ లేదు. ప్రైవేటు ఆసుపత్రులలో రేట్లు నిర్ణయించడానికి రాష్ట్రంలోగాని, దేశంలోగాని చట్టం లేదు.

బి) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

సి) లేదండీ. ప్రైవేటు ఆసుపత్రులలో 30 శాతం ఉచితంగా బీద రోగులకు సేవలు అందించాలనే నిబంధన ఏదీ లేదు. కాకపోతే 2005వ సంవత్సరంలో ఒక చట్టాన్ని తీసుకురావడం జరిగింది. దాని ద్వారా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌గాని లేదా CGHS ద్వారా చేసే empanelled hospitals ద్వారా 5 శాతం పడకలు ఉచితంగా కేటాయించి, సేవ చేయాలనే ఒక నిబంధన ఉంది. అది కూడా చాలామటుకు అవడం కావడం లేదు. దానిని పరిశీలించి, అన్ని రకాలుగా అమలు కావడానికి చర్యలు చేపట్టడం జరుగుతుంది.

డి) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) లేదండీ.

శ్రీ ఎం. రంగారెడ్డి (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఒక సమస్యను మీ దృష్టికి తీసుకురాదలచాను. ఈ మధ్య కాలంలో మా ఆవిడ అనారోగ్యంగా ఉండింది. ప్రభుత్వ ఆసుపత్రులలో ఒక విధానం ఉంటుంది. కొన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. నేను ప్రైవేటు ఆసుపత్రివారిని అడిగాను మాకు కొన్ని ప్రివిలేజెస్ ఉంటాయి. పేషెంట్‌ను అడ్మిట్ చేసుకుని, మీరు తరువాత ప్రభుత్వం నుండి డబ్బులు క్లెయిమ్ చేసుకోవచ్చు అనే విధానం ఉంది. ఈ విధానంలో ఉన్న దోపిడీ మరే వ్యవస్థలోను లేదని నాకు అనిపించింది. నా స్వానుభవం కాబట్టే చెబుతున్నాను. పది రూపాయలు ఖర్చు అయ్యే చోట వారు వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. ఎవరి సొమ్ము ఎవరు తింటున్నారు? ఆరోగ్య శ్రీ రేట్ల ప్రకారం చేయడానికి మాకు వీలు పడదు అంటున్నారు. నేను వెళ్లి శ్రీ కె.జానారెడ్డిగారికి విషయం చెప్పాను. నా బాధ చూడలేక వారు ఆసుపత్రికి ఫోన్ చేసారు. అయినా వారు వినలేదు. అప్పుడు ఎల్ఓపి మహమ్మద్ ఆలీ షబ్బీర్ గారి దగ్గరకు వెళ్లాను.

میں شبیر بھائی کے پاس گیا، شبیر بھائی بولے: ہونا بولے تو میں بھر لیتا ہوں۔ میں بولا: شبیر بھائی! آپ کیوں بھرتے؟

పెద్దల ఆశీర్వాదం వల్ల నాకు అటువంటి రెండు ఆసుపత్రులను కొనే శక్తి ఉంది. కానీ, లాజికల్‌గా రూల్ ఏమిటి? గౌరవ ఆరోగ్య శాఖ మంత్రి గారిని నాలుగు ఆసుపత్రులను సందర్శించమనండి. అక్కడంతా దోపిడే. మరొకటి ఏమిటంటే ఆపరేషన్లు జరిగిన తరువాత ఆ పరికరాలను ఒక మూడు గంటల వరకు వాడకుండా చూడాలి. ఎందుకంటే దానివల్ల ఇతరులకు ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. అటువంటి అనుభవం ఎవరికో కాదు, నాకే జరిగింది. కాబట్టి ప్రైవేటు ఆసుపత్రుల మీద ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. ఒక కమిటీ వేసి ఈ విషయాలన్నీ పర్యవేక్షించాలి. అపోలో ఆసుపత్రికి ముప్పై ఆరు ఎకరాల భూమిని ఇచ్చాము. కాబట్టి చట్టాలను సవరించి, ప్రైవేటు ఆసుపత్రుల విషయంలో తప్పకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. వాటిమీద తప్పకుండా ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి.

శ్రీ యం.ఎస్. ప్రభాకర రావు (స్థానిక సంస్థలు - హైదరాబాద్) : ప్రైవేటు ఆసుపత్రులలో పరిస్థితి ఏమీ బాగోలేదు. ప్రజలను బాగా దోచుకుంటున్నారు. ఒక రోగి హాస్పిటల్‌కి వెళితే unnecessary investigationsతో అతని జేబులు ఖాళీ చేస్తున్నారు, which amounts to thousands of rupees. వారు చేసే ఇన్వెస్టిగేషన్‌కు, పేషెంట్ జబ్బుకు సంబంధమే ఉండదు. ఈ విధంగా దోపిడి జరుగుతున్నది. కాబట్టి దీనిగురించి ప్రభుత్వం ఆలోచించాలి. ఎందుకంటే ఈ ప్రైవేట్ ఆసుపత్రుల వారు ప్రభుత్వం దగ్గరనుండి అన్ని రకాల ప్రోత్సహకాలు పొందుతున్నారు. అన్ని రకాల రాయితీలు తీసుకుంటున్నారు. మనం వారికి ఈ విధంగా అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నప్పుడు, ఆ ప్రైవేటు ఆసుపత్రుల వారు ప్రజల గురించి కొంత ఆలోచన చేయాలి. కొంత పర్సెంట్ బీద ప్రజలకు వైద్యం చేయాలని ఒక అగ్రిమెంటు మనం వారితో చేసుకుని ఉంటాము. కానీ, ఏ ప్రైవేటు ఆసుపత్రి కూడా దానిని అమలు చేయడం లేదు.

28.08.1996లో ఒక హౌస్ కమిటీ వేయడం కూడా జరిగింది. ఆ కమిటీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. అందులో ఏమి ఉందంటే 10 శాతం బీద ప్రజలకు ఇన్ పేషెంట్‌గా, 40 శాతం ఔట్‌పేషెంట్‌గా ట్రీట్‌మెంటు ఇవ్వాలని చెప్పారు. ఆ విధంగా ప్రభుత్వం నుండి ప్రైవేటు ఆసుపత్రులకు ఆదేశాలు వెళ్లడం కూడా జరిగింది. ఆరు నెలల వరకు అవి అమలు జరిగినాయి. తరువాత వాటిని పాటించలేదు. ఇప్పుడు ఇటువంటి ప్రతిపాదనలు ప్రభుత్వం దగ్గర ఏమైనా ఉన్నాయా? ప్రభుత్వ పరంగా exclusive diagnostic centers ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వం దగ్గర ఉందా?

శ్రీ సభావత్ రాములు నాయక్ (నామినేటెడ్) : అధ్యక్షా, ప్రైవేటు ఆసుపత్రులలో చాలా దోపిడీ జరుగుతున్నది. ప్రభుత్వం వారికి భూమి కేటాయించడం, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నది. ఆ విధంగా వారు ప్రభుత్వం నుండి లబ్ధి పొందుతున్నారు. మనం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినట్లయితే వైద్యం చాలా ఖరీదుగా మారిపోయింది. ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళలకు 99శాతం నార్మల్ డెలివరీలు జరుగుతుండగా, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లగానే ఆపరేషన్ అంటారు. వారు కనీసం ఒక 50శాతం అయినా, నార్మల్ డెలివరీలు చెయ్యాలి. మొన్న నాకు తెలిసిన ఒక మహిళకు డెలివరీ చేసి, రెండు రోజులు ఆసుపత్రిలో ఉంచుకొని రూ.1.80లక్షల బిల్లు వేశారు. సమైక్య రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం పేరుతో చాలా దోపిడీ జరిగింది. ఈ విషయం గురించి ప్రభుత్వం ఎంక్వైరీ చేస్తే బాగుంటుంది.

శ్రీ పూల రవీందర్ (ఉపాధ్యాయ నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం, నల్గొండ) : అధ్యక్షా, కార్పొరేట్ వైద్యం ఈ రోజున చావు–బ్రతుకుల మధ్యన ఉన్నవాడికి అందించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. అయితే వారి దోపిడీని మాత్రం నియంత్రించాల్సిన అవసరం కూడా ఉంది. అందు గురించి ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయడం సబబుగా ఉంటుందని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఉద్యోగులకు ఇచ్చే హెల్త్ కార్డ్స్ విషయంలో కార్పొరేట్ ఆసుపత్రుల నుండి వారికి వైద్య సేవలు అందించే విధానం ఇంకా అమలులోకి రాలేదు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల దగ్గర నుండి నెలకు ఒక రూ.300/– చొప్పున Monthly Premium వసూలు చేసినా పరవాలేదు. ఆ విధంగా చేసి, అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో మంచి వైద్యం ఇప్పించేట్లుగా ప్రయత్నం చేయాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ఈ విషయంలో గౌరవ సభ్యులందరిదీ ఒకటే అభిప్రాయం. ప్రైవేటు ఆసుపత్రుల నియంత్రణ చట్టం తీసుకురావలసిన అవసరం ఉంది. వారికి పన్నెండు ఫ్లోర్లు నిర్మించుకోవడానికి అనుమతిస్తారు. వారు ప్రభుత్వం దగ్గర నుండి అన్ని రకాలుగా లబ్ధి పొందుతారు. కానీ, పేషెంట్లను విపరీతంగా దోచుకుంటున్నారు. కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో ఒక రెగ్యులేషన్ యాక్ట్ తీసుకురావలసిన అవసరం ఉంది. It is the need of the hour. కాబట్టి దయచేసి ఈ దోపిడీని అడ్డుకోవలసిన అవసరం ఉంది. ఎందుకంటే వారు శవాల పట్ల కూడా చాలా అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. ఈ విషయమై చాలా ఆసుపత్రుల ముందు పేషెంట్ల తాలూకు బంధువులు ధర్నాలు కూడా చేయడం జరిగింది.

సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య శ్రీ పథకం క్రింద కూడా match fixing జరుగుతుంది. దయచేసి దీనిని నియంత్రించవలసి ఉంది. ఒక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయండి. హౌస్ కమిటీ కంటే కూడా నియంత్రణ చట్టం అవసరం. దయచేసి ఆ దిశలో పరిశీలించండి.

శ్రీ నారదాసు లక్ష్మణరావు (స్థానిక సంస్థలు - కరీంనగర్) : అధ్యక్షా, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు సామాన్య ప్రజల నుండి అత్యధిక మొత్తాన్ని వసూలు చేస్తున్న విషయం వాస్తవమేనా? అన్న ప్రశ్నకు మంత్రిగారు లేదండీ అన్నారు. అది పూర్తిగా అవాస్తవమేనండి. వారు కొంత వరకు నిజమే అంటే బాగుండేదేమో. లేదు అని మొత్తంగా కొట్టిపేయడం సరికాదు. ప్రైవేటు ఆసుపత్రులలో ఈ రోజు జరుగుతున్నది ఏమిటో, అక్కడ వారు కల్పిస్తున్న సౌకర్యాలు ఏమిటో మనందరికీ తెలుసు. ప్రైవేటు ఆసుపత్రులు ఈ రోజు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎలాంటి వైద్య పరిజ్ఞానం లేనివారు, మెడికల్ విద్యతో సంబంధం లేని వారు, జీవనోపాధి కొరకు ఈ ప్రైవేటు ఆసుపత్రులను నెలకొల్పుతున్నారు. అక్కడ కనీస వసతులు గానీ, పరికరాలు గానీ, విద్యా ప్రమాణాలు లేకుండా వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి వాటిమీద ప్రభుత్వ నియంత్రణ ఏ విధంగా ఉంటుంది? వారికి అనుమతులు ఇచ్చే విషయంలో ప్రభుత్వం పాటిస్తున్న ప్రామాణికాలు ఏమిటి?

ప్రజలు అప్పులపాలు కావడానికి వారు వైద్యం మీద పెట్టే ఖర్చు కూడా ఒక కారణం. కాబట్టి అక్కడ వసూలు చేసే అధిక ఫీజుల విషయంలో గానీ, వారికి అనుమతులు ఇచ్చే విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటో తెలియజేయవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (స్థానిక సంస్థలు - నల్గొండ): అధ్యక్షా, నా కంటే ముందు మాట్లాడిన సభ్యులు కార్పొరేట్ చికిత్స గురించి, పేద ప్రజల కష్టాల గురించి చెప్పారు. మీ ద్వారా ప్రభుత్వానికి నా విజ్ఞప్తి ఏమిటంటే ఎమర్జెన్సీ పరిస్థితులలో జిల్లాల నుండి కార్పొరేట్ ఆసుపత్రికి వెళితే అక్కడ ముందు డబ్బు డిపాజిట్ చేస్తేనే, చికిత్స ప్రారంభిస్తారు. మీకొక ఉదాహరణ చెబుతాను. మలక్‌పేట యశోదా ఆసుపత్రిలో ఒక వ్యక్తికి డబ్బు కడితేగాని చికిత్స చేయమని చెప్పారు. వారి బంధువులు నాకు రాత్రి పదకొండు గంటలకు ఫోన్ చేసారు. రోగి చావు-బ్రతుకుల మధ్యన ఉన్నాడు. అతను తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన యువకుడు. నేను ఆసుపత్రి వారికి ఫోన్ చేసి చెప్పినా, వారు అడ్మిట్ చేసుకోలేదు. అతను బ్రతకడని చెప్పి, తిరిగి పంపించారు.

**10.40 ఉ.** ఆ పేషెంట్‌ని గ్లోబల్ హాస్పిటల్‌కు తీసుకురావడం జరిగింది. వారు అడిగిన డబ్బు చెల్లించి, అడ్మిట్ చేయించి, ఆపరేషన్ జరిపించాము. ఆ రోగి బ్రతికాడు. ఆ రోజు అతనికి సరైన సమయంలో డబ్బు సమకూరి, చికిత్స అందించగలిగాము కాబట్టి, ఆ యువకుడి ప్రాణాలు నిలబెట్టగలిగాము. ఈ విధంగా ప్రైవేటు ఆసుపత్రులలో అనేక సంఘటనలు జరుగుతున్నాయి. వాళ్లకు అవకాశం ఉండి, అన్ని సౌకర్యాలు ఉండి కూడా, కేవలం డబ్బుతో ముడి పెట్టి, అడ్వాన్సుగా డబ్బు కడితేనే చికిత్స జరిగి, రోగి బ్రతుకుతాడు. లేకపోతే రోగి చనిపోవలసిందే అనే విధంగా పరిస్థితులు ఉన్నాయి. అందువల్లంగా ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ విషయంలో నేను ప్రభుత్వాన్ని కోరేది ఏమిటంటే గౌరవ ముఖ్యమంత్రిగారు నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నగరంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు కాబట్టి, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి తీసుకువచ్చిన రోగికి, ఫైనాన్షియల్ లింక్ పెట్టకుండా, ప్రభుత్వం తరఫున వెంటనే చికిత్స అందించి, ప్రాణాలు కాపాడే విధంగా ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, పేదప్రజలకు అండగా ఉండాలని నేను కోరుతున్నాను.

శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజకవర్గం– మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్): అధ్యక్షా, ఈ కార్పొరేట్ ఆసుపత్రులకు పర్మిషన్ ఇచ్చేటప్పుడు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇంత పర్సెంట్ చొప్పున వైద్యం అందించాలనే నిబంధన ప్రస్తుతం ఏదన్నా ఉన్నదా? ఉన్నట్లయితే దానిని ఎంతవరకు పాటిస్తున్నారు? నేను సమావేశానికి రాబోతుంటే నాకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది.

ఉద్యోగస్తులకు మనం ఇచ్చిన హెల్త్ కార్డులను సగం ఆసుపత్రులు అంగీకరించడం లేదు. కొన్నిచోట్ల ఆరోగ్యశ్రీ అనుమతి వచ్చిన తరువాతనే చికిత్స అందించడం జరుగుతున్నది. హార్ట్‌ఎటాక్ లాంటి ఎమర్జెన్సీ జబ్బులకు ఆరోగ్యశ్రీతో ముడిపెట్టకుండా, వెంటనే చికిత్స అందించే విధంగా ఏదైనా చర్య తీసుకునే అవకాశం ఉందా? అలాంటి కేసులను పోస్ట్ అప్రూవల్‌కి పంపి, తరువాత అనుమతి తీసుకునే విధంగా నిబంధనలో మార్పు తీసుకురావలసిన అవసరం ఉంది అధ్యక్షా. ఎందుకంటే బాలయ్య అనే ఒక రిటైర్డ్ టీచర్ గుండెనొప్పితో ఆసుపత్రిలో అడ్మిట్ కావడం జరిగింది. అతనికి రాత్రి కూడా మరొకసారి స్ట్రోక్ వచ్చిందని అతని కుటుంబ సభ్యులు నాకు ఫోన్ చేసి చెప్పారు. ఇటువంటి అత్యవసర కేసుల విషయంలో సులభతరంగా చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

డా. ఆర్. భూపతి రెడ్డి (స్థానిక సంస్థలు - నిజామాబాద్): అధ్యక్షా, నేను స్వయాన ఒక డాక్టర్‌ని. ఒక ప్రైవేట్ హాస్పిటల్‌ను ఇరవై సంవత్సరాలు నడిపించిన అనుభవం కూడా ఉంది. గౌరవ సభ్యులందరికీ ప్రైవేట్ ఆసుపత్రుల మీద మంచి అభిప్రాయం ఉన్నట్లు కనిపించడం లేదు. అది కొంత వరకు వాస్తవం కూడా. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో రేట్లు విపరీతంగా ఉన్నాయంటున్నారు. మీ ద్వారా నేను గౌరవ మంత్రిగారిని కోరేది ఏమిటంటే ఆసుపత్రులలో ఉన్న సౌకర్యాలు, వసతులను బట్టి, వాటిని A,B,C,D గ్రేడులుగా విభజించి, రేట్లు నిర్ణయించే ఆలోచనా ఏదెనా ఉన్నదా తెలుపవలసిందిగా కోరుతున్నాను. ఆ రేట్లను కూడా బయట బోర్డుల మీద డిస్‌ప్లే చేసినట్లయితే, రోగులు వారివారి ఆర్థిక పరిస్థితిని బట్టి, నిర్ణయించుకునే అవకాశముంటుంది.

శ్రీ ఎన్. రామచంద్రరావు (పట్టభద్రుల నియోజకవర్గం–మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్): అధ్యక్షా, ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి వివాదం ఏదైతే ఉందో, ప్రతి సామాన్యుడు కార్పొరేట్ ఆసుపత్రికి వెళితే మాకు బిల్లు పెద్ద వాత పడుతుంది అని భయపడుతుంటాడు. దీనిని నివారించడానికి ప్రభుత్వం తరఫున ఒక మానీటరింగ్ విజిలెన్సు కమిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నాను. అదే విధంగా దీని గురించి ఒక House Committee వేసి, ఈ ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ, వారు వసూలు చేస్తున్న ఫీజుల తీరుతెన్నుల పట్ల ఒక నియంత్రణ లాంటిది పెడితే బాగుంటుందని నేను అభిప్రాయపడుతున్నాను. అలాగే ఈ కార్పొరేట్ ఆసుపత్రులలో బీద విద్యార్థులుగాని, దళిత కుటుంబాల వారుగాని, లేదా ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, లెక్చరర్లు, అడ్మిట్ అయినప్పుడు వారికి cashless treatment ఏర్పాటు చేస్తే బాగుంటుందని నా యొక్క సలహా.

SRI SYED ALTAF HYDER RAZVI (ASSEMBLY CONSTITUENCY): Chairman Sir, this issue has actually been going for a very long time. The Corporate Hospitals in our State are getting various kinds of exemptions from the Government and at the same time, when these Hospitals are being given exemption, as far as I know, Apollo Hospital in Jubilee Hills, Hyderabad was allotted land with an Agreement that 25% of the beds would be left vacant for the BPL families, to be treated free of cost. All these things, violation have been going on for years together. Every time the subject comes in, we talk and discuss little bit on that and then goes off. There needs to be something very concrete done on the subject. How many hospitals in the State are getting such exemptions, where in turn, they have to give various facilities to the BPL families such as free treatment and reservation of those beds. Whenever a poor fellow goes to Hospital, he is told that there is no bed space. These kinds of things are happening for years together now. So, what needs to be done if we take subject seriously what is the monetary mechanism, whether they are happening on ground or not there is nothing absolutely. From my party side, I would really suggest and when the Hon'ble Health Minister speaks about this, I want these things to be addressed in a way where mechanism should be there to monitor as to whether the Corporate Hospitals are facilitating to those BPL families for which they promised and got those exemptions.

The main problem is, if we are not doing that, this loot will keep on continuing. If we do not address these problems, Government sitting here and if they do not act on it, then this will go on Sir. My sincere suggestion to the Government is, they should come with some concrete plans to fix the responsibilities, if they are not doing. They should penalize such Corporate Hospitals, if they are not following all these instructions. Thank you Sir.

డా. సి. లక్ష్మారెడ్డి: అధ్యక్షా, సభలోని దాదాపు అందరు గౌరవ సభ్యులు ఈ అంశం గురించి మాట్లాడినందుకు చాలా సంతోషం. దానిని దృష్టిలో పెట్టుకుని, ఈ సబ్జెక్టుకి ఉన్న ప్రాముఖ్యతను బట్టి, బీద ప్రజలందరికీ మంచి వైద్యం అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. మొన్న ప్రవేశ పెట్టిన బడ్జెటులో కూడా గతంలో ఎన్నడూ లేనంతగా, పెద్ద మొత్తాన్ని వైద్య శాఖకు కేటాయించడమే అందుకు నిదర్శనం. ప్రభుత్వం ఆసుపత్రులను బలోపేతం చేసి, బీద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా చేయడమే ఈ ప్రభుత్వ ఉద్దేశ్యం. దురదృష్టం ఏమిటంటే గతంలో ఈ వైద్య శాఖ కొంత నిర్లక్ష్యానికి గురైంది. ప్రభుత్వ ఆసుపత్రులలో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఉన్నమాట కూడా యదార్థమే. అందువల్ల ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రులలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లేని పరిస్థితి ఇప్పుడు నెలకొని ఉంది. దానిని దృష్టిలో పెట్టుకుని అన్ని జిల్లా ఆసుపత్రులలో ICU ఏర్పాటుచేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మహబూబ్ నగర్‌లో ఆ విధంగా ICU ప్రారంభించడం జరిగింది. కరీంనగర్ మరియు సిద్దిపేటలో రేపు మొదలు కాబోతున్నాయి. అలాగే అన్ని ఆసుపత్రులలో Diagnostic Services పెంచి, బీద ప్రజలు బయటకు వెళ్లవలసిన అవసరం లేకుండా, అన్ని రకాల పరీక్షలు చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నాము. CT Scan, MRI Scan వంటి అన్ని వసతులు జిల్లా మరియు ఏరియా ఆసుపత్రులలో ఏర్పాటు చేయడం జరుగుతుంది.

ఈ రకంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసౌకర్యం అందజేసే ఏర్పాటు చేస్తున్నాము. కార్పొరేట్ ఆసుపత్రుల మీద నియంత్రణ అనేది గతంలో లేదు. అవసరమనుకుంటే ఒక కమిటీ వేసి, పరిశీలిస్తాము. వైద్య రంగాన్ని ప్రక్షాళన చేయడానికి ఇప్పటికే క్యాబినెట్ కమిటీ వేయడం జరిగింది. అవసరమైతే నిపుణులతో ఒక కమిటీ వేసి, కార్పొరేట్ ఆసుపత్రుల మీద నియంత్రణ విషయం పరిశీలించడం జరుగుతుంది.

అలాగే ఉద్యోగుల హెల్త్ కార్డుల విషయంలో ఇప్పటికే చాలా చర్యలు చేపట్టడం జరిగింది. కొన్ని పరిమితమైన ఆసుపత్రులు తప్ప, అన్ని చోట్ల ఈ హెల్త్ కార్డుల సౌకర్యం అమలులో ఉంది. ఆ సౌకర్యం లేని ఆసుపత్రులలో కూడా అమలయ్యే విధంగా, ఉద్యోగ సంఘాలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, సాధకబాధకాలు పరిష్కరించి, త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని సభకు మనవి చేస్తున్నాను.

గౌరవ సభ్యులందరి సహకారంతో, రాష్ట్రంలో గొప్ప వైద్య విధానాన్ని, భారతదేశంలో ఎక్కడా లేని విధంగా, అభివృద్ధి చేస్తామని తెలియజేస్తున్నాను.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్: ఈ విషయమై మరొక సందర్భంలో మనం మాట్లాడుకుందాం. ప్రశ్నోత్తరాల సమయం అయిపోతున్నది. ఇప్పటికే నలభై ఐదు నిముషాలు అయింది.

(అంతరాయం)

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు: అధ్యక్షా, రంగారెడ్డిగారు చాలా బాధపడుతున్నారు. నిర్లక్ష్యం జరిగిన మాట వాస్తవం. ప్రభుత్వ ఆసుపత్రులలో కండిషన్స్ బాగాలేవన్న మాట వాస్తవం. దాని మీదనే ముఖ్యమంత్రిగారు, ప్రభుత్వం స్పందించి, ఒక సబ్ కమిటీని వేయడం జరిగింది. అవసరమైతే శాసన మండలి సభ్యుల నుండి కూడా సలహాలు తీసుకుని, రిపోర్టు ఇస్తాము. మీరు చెప్పిన దాంట్లో వాస్తవం ఉందని ఒప్పుకుంటున్నాము. గతంలో జరిగిన దాన్ని సరిదిద్దడానికి ప్రభుత్వం పనిచేస్తున్నది.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : అధ్యక్షా, గౌరవ సభ్యులు అందరూ, ఆ పార్టీ, ఈ పార్టీ అని లేకుండా, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న విషయాల గురించి మంచి సలహాలు ఇచ్చినారు. కాబట్టి మీ ద్వారా మంత్రివర్యులను నేను కోరేది ఏమంటే ఇక్కడ యునానిమస్ ఒపీనియన్ ఉంది కాబట్టి, ఒక House Committee వేసి, ఆ House Committee ఇచ్చిన రిపోర్టును సబ్ కమిటీలో పెట్టి, ఆ సలహాలు, ఈ సలహాలు తీసుకుని మీరొక చట్టం తీసుకువస్తే బాగుంటుంది. ఎందుకంటే ఇప్పుడే సభ్యులు చెప్పినారు. ప్రతి సంవత్సరం ఈ ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. ప్రతి సంవత్సరం మనం

మాట్లాడుతూనే ఉంటాము. గత ఉమ్మడి రాష్ట్రంలోగాని, తెలంగాణ రాష్ట్రంలోగాని, ఇది కంటిన్యుయస్‌గా జరుగుతూనే ఉంది కాబట్టి ఎక్కడనో ఒక చోట ఫుల్‌స్టాప్ పెట్టాలంటే దయచేసి ఒక House Committee వేయమని మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అప్పుడు నిజానిజాలు బయటకు రావడమే కాదు, ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు కూడా వస్తాయి.

డా. సి. లక్ష్మారెడ్డి: అధ్యక్షా, నాతో పాటు శ్రీ తుమ్మల నాగేశ్వర రావుగారు, శ్రీ కె.తారక రామారావుగారు సభ్యులుగా ఆల్‌రెడీ క్యాబినెట్ సబ్ కమిటీ ఉంది. చాలా డిటెయిల్డ్‌గా స్టడీ చేస్తున్నాము. మీ అందరి అభిప్రాయాలు తీసుకుని, తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుంది.

## రాష్ట్రంలో విష వ్యాధులు

ప్రశ్న నెం. 1092(23)

సర్వశ్రీ ఎం. రంగారెడ్డి, ఎం.ఎస్. ప్రభాకర్ రావు, మహమ్మద్ ఆలీ షబ్బీర్, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) రాష్ట్రంలో గత ఒకటిన్నర సంవత్సరాలుగా స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ మున్నగు వైరల్ వ్యాధుల వల్ల వందలాది మంది పిల్లలు, ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్న విషయం వాస్తవమేనా;

ఆ) ఆ వ్యాధులు నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైన విషయం కూడా వాస్తవమేనా;

ఇ) అయితే, దానికి గల కారణాలేమిటి?

గౌరవ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా.సి. లక్ష్మారెడ్డి ): అ) లేదండీ. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనుండి స్వైన్‌ఫ్లూ కేసులు నివేదించబడినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సమర్థవంతమైన నియంత్రణా చర్యల వల్ల, స్వైన్‌ఫ్లూ వ్యాప్తి తగ్గుముఖం పట్టింది.

రాష్ట్రంలో ఏబోలా కేసులు నివేదించబడలేదు.

తెలంగాణలో దోమల వల్ల వచ్చే వైరల్ వ్యాధులు నివేదించబడ్డాయి.

| వ్యాధి | 2015 | | 2016(9-3-2016 వరకు) | |
|---|---|---|---|---|
| | కేసులు | మరణాలు | కేసులు | మరణాలు |
| స్వైన్ ఫ్లూ | 2956 | 101 | 44 | 4 |
| డెంగ్యూ | 1831 | 2 | 21 | 0 |
| చికెన్‌గున్యా | 149 | 0 | 2 | 0 |
| జపనీస్ మెదడు వాపు వ్యాధి | 0 | 0 | 0 | 0 |

శ్రీ ఎం. రంగారెడ్డి: అధ్యక్షా, వాస్తవం చెప్పాలంటే స్వైన్ ఫ్లూ గురించి ప్రజల్లో కొంత భయం తగ్గింది. కాని ఈ సంవత్సరమే 101మంది చనిపోయినట్లుగా చెప్పారు. చాలా మందికి ఏ జ్వరానికి ఎక్కడికి పోయి, మందు తీసుకోవాలో తెలియకుండా ఉంది. ప్రజల్లో కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే మనకు తగ్గుతుందనే భావన ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల వాళ్లు తాము చికిత్స అందించిన వ్యాధుల గురించి, రోగుల గురించి ఎక్కడా చెప్పరు. ఈ స్వైన్ ఫ్లూ కూడా ఎక్కువ మందికి ప్రైవేటు ఆసుపత్రులలోనే ట్రీట్‌మెంటు జరుగుతున్నది. కాబట్టి ప్రైవేట్ ఆసుపత్రుల మీద తీసుకునే చర్యలు కఠినంగా ఉంటేనే అన్ని రకాల సమాచారం బయటకు వస్తుంది. ఈ రోజు గ్రామాలలో నూటికి 99% SC,ST,BC వంటి పేద ప్రజలు జీవిస్తున్నారు. అనేక రోగాల బారినపడి వారు చనిపోతున్నారు. అప్పులు చేసి, సిటీలో ట్రీట్‌మెంటు తీసుకున్నవారు మాత్రం బ్రతుకగలుగుతున్నారు. జూబ్లీహిల్స్, బంజారా హిల్స్‌లో మాత్రం పరిస్థితులు బాగున్నాయి. గ్రామాల్లో దోమలకు మందు కొట్టడమే బందయింది.

**11.00 ఉ.**

దోమలను చంపే మందుల యొక్క మౌలిక సదుపాయాలు బంద్ అయ్యాయి. ఏమన్నా అంటే తరాల నుండి జరుగుతుంది అని అంటారు, ఆ తరాలకు వ్యతిరేకంగానే ఈ పోరాటాలు వచ్చాయి. ఈ పోరాటల ఫలితమే మనకు వ్యవస్థ వచ్చింది. ఇప్పటికైనా అన్ని గ్రామాల రికార్డులను తెప్పించుకొని చూసుకోగలరు, లేకపోతే నా దృష్టికి వచ్చింది చెబుతాను.

శ్రీ యమ్.యస్. ప్రభాకర్ రావు: అధ్యక్షా, 2015-16 సంవత్సరం పరిశీలించిన తరువాత జ్వరానికి సంబంధించిన కేసులు చాలా తక్కువగా నమోదు అయ్యాయి అన్నారు,

దానికి అభినందనలు తెలుపుతున్నాను. వాస్తవానికి ఈవిషయం ఆరోగ్యానికి సంబంధించింది. కాబట్టి మేము, ఎన్నో రెవ్యూలు, మీటింగ్స్ పెట్టి పరిశీలించి స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువగా గవర్న మెంటు హాస్పటల్స్‌కి సంబంధించిన కేసులు అని నిర్ధారించాము. ప్రైవేటు హాస్పటల్స్ దగ్గరకు వచ్చిన కేసులు గవర్న మెంటు హాస్పటల్స్ దగ్గరకు రావు. వీళ్లదగ్గర ఎలాంటి యంత్రాంగం లేదు. ఎన్ని డెంగ్యూ ఫీవర్స్, ఎన్ని స్వైన్‌ఫ్లూ, జపనీస్ ఎన్‌సెఫాలిటిస్ వ్యాధులకు సంబంధించి మొదలైన లెక్కలు వీళ్ల దగ్గర లేవు కాబట్టి వాటిని కూడా తీసుకుంటే సరిపోతుంది.

స్వైన్‌ఫ్లూ ఎందుకు వస్తుంది? ఎక్కువగా పందుల వల్ల వస్తుంది. ఈ పందులన్ని నగరంలో ఈ రోజు నేను ఉన్న దగ్గరే పెద్ద, పెద్ద గుంపులుగా పెంచుతున్నారు, అమ్ముతున్నారు. దీనికి సంబంధించి మున్సిపాలిటీలో కూడా ఒక యాక్టు ఉంది, ఇలాంటివి అన్ని కూడా పెంచడానికి వీలు లేదు. బ్యాన్ కూడా చేశాం. నేను కంప్లైట్ ఇచ్చినా కూడా ఉదయం తీసుకొని వెళ్లి, సాయంత్రానికి మరలా తీసుకొస్తున్నారు. దీనిద్వారా మస్కిటో బ్రీడింగ్ కావడం వలన ఈ వ్యాధి రావడం జరుగుతుంది కాబట్టి, ఒక కోఆర్డినేషన్‌గా ఏర్పడి మున్సిపల్ గాని, పంచాయితీరాజ్ గాని, మెడికల్ శాఖలుగాని ఒక కమిటీని ఏర్పాటు చేసి ఇవి అన్ని రాకుండా ఏమన్నా ప్రయత్నాలు చేస్తున్నారా అని అడుగుతున్నాను?

శ్రీ యస్. రామచంద్రరావు: అధ్యక్షా, గతంలో ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో, చండీపురా వైరస్ కొన్ని గ్రామాలలో చిన్న పిల్లల్లకు సోకిందని సమాచారం. ఇది చిన్న పిల్లలకి, ట్రైబల్స్‌లో ఉండేవారికి సోకితే మీరు వెళ్లడం జరిగింది. ఈ మధ్య హైదరాబాద్ నగరంలో, భారతదేశంలో కూడా ఈ జైకా వైరస్ భయం పట్టుకుంది. హెచ్1, యన్1, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ వ్యాధులు పెరుగుతున్నాయి. గ్రామాలలో, తండాలలో కూడా వ్యాధులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. వీటి నివారణ చర్యలను కూడా ప్రభుత్వం తీసుకుంటే బాగుంటుందని కోరుకుంటున్నాను. నేషనల్ వైజ్‌గా రీసర్చ్ సెంటర్ పూణెలో ఉంది అదే విధంగా తెలంగాణలో కూడా ఒక రీసర్చ్ సెంటర్ ఉంటే బాగుంటుందని నా సూచన.

శ్రీ పురాణం సతీష్ కుమార్ (స్థానిక సంస్థలు - ఆదిలాబాద్): అధ్యక్షా, విషజ్వరాలకు పుట్టినిల్లు ఆదిలాబాద్ జిల్లా. గత పాలకులు సమైఖ్య పాలనలో ఈ ఏజన్సీ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల మరణాలు ఎక్కువగా సంభవించాయి. కె. చంద్రశేఖరరావు గారి నాయకత్వంలో ఎప్పటికప్పుడు రెవ్యూలు పెట్టుకొని వైద్యశాఖ మంత్రితో చర్చించి విషజ్వరాల సంఖ్యను తగ్గించడం జరిగింది. గతంలో 266 మరణాలు విషజ్వరాల వల్ల సంభవించేవి. దానిని మొన్నటి కాలంలో 56 మరణాలకు తగ్గించడం జరిగింది. కాని అది జరగడం కూడా దురదృష్టం. ఏజన్సీ ప్రాంతంలో ఈ వైద్యశాఖ హాస్పిటల్స్‌ను, డయాగ్నస్టిక్ సెంటర్స్‌ను, మందులను అందుబాటులో ఉంచడం వల్ల ఈ ఏజన్సీ ప్రాంతంలో మరణాలను తగ్గించవచ్చు.

గిరిజన, ఆదివాసి ప్రాంతాలలో ఉన్నటువంటి హాస్పిటల్స్‌ను కొద్దిగా వృద్ధి చేయాలని, వాటిలోపల మందులను సరఫరా చేయాలని, మరణాలను తగ్గించుకుంటే మనం కలలు కన్న బంగారు తెలంగాణను సాధించుకోగలుగుతాము. బంగారు తెలంగాణలో గిరిజనులు, ఆదివాసులు, లంబాడాలు పాలు పంచుకున్నట్లు అవుతుంది.

డా. సి. లక్ష్మారెడ్డి: అధ్యక్షా, ఈ వైరల్ ఫీవర్స్‌ని తగ్గించడానికి పి.ఆర్. శాఖాతో కో- ఆర్డినేట్ చేసుకొని, రాష్ట్రం అంతటా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో మురికి నీరు ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. ఇంకుడు గుంతల ద్వారా నీటిని భూమిలోకి ఇంకే విధంగా కార్యక్రమాలు చేస్తున్నాం. రాష్ట్రంలో 1055 గ్రామాలను హైలీ ఎఫెక్టెడ్ గ్రామాలుగా గుర్తించి, చక్కటి నివారణా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. జైకా వైరస్ అనేది తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా నమోదు కాలేదు.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, హెలికాప్టర్‌లో డాక్టర్స్‌ను తీసుకొనిపోయి ఏజన్సీ ప్రాంతంలో మందులు ఇప్పించాయని అంటున్నారు దీని గురించి వివరించగలరు. గత పాలకులు చేయలేదని అంటున్నారు మీరు చెయ్యండి.

రెండు సంవత్సరాలు అవుతున్న మీ పరిపాలనలో మీరు ఆరోగ్యం, విద్య, మంచినీరు అందించే ఏర్పాట్ల గురించి మరచిపోవద్దు.

శ్రీ యం.యస్. ప్రభాకర్ రావు: మంచినీరు త్రాగడం వలన రోగాలు వస్తున్నాయని మొన్నటి పేపర్‌లో వచ్చింది. ఉస్మానియా హాస్పిటల్, మెటర్నిటీ హాస్పిటల్, డెంటల్ హాస్పిటల్, నీలోఫర్ హాస్పిటల్లో నా నిధుల నుండి నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటుచేసి గత రెండు సంవత్సరాల నుండి త్రాగునీటిని సరఫరా కోసం రూ.10 లక్షలు కేటాయించి, ఉస్మానియా హాస్పిటల్‌లో నీటిశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసాము. కాని దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ హాస్పిటల్స్ ప్రక్కన ఉండే వాళ్ల ఇన్ఫ్లుయన్స్‌తో వాటిని పని చేయకుండా చేస్తున్నారు. గతంలో మంత్రిగారికి చెప్పాము, దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు ఆ నీటిశుద్ధియంత్రాలు వృధాగా పడి ఉన్నాయి. ఆ యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి, ఆ సూపరింటెండెంట్ మీద చర్య తీసుకోవాలని కోరుతున్నాను. ఈ అన్ని హాస్పిటల్స్‌లో నిరుపయోగంగా ఉన్నవాటిని ఉపయోగించుకుంటే బాగుంటుందని నా మనవి.

డా. సి.లక్ష్మారెడ్డి: అధ్యక్షా, యమ్.యస్. ప్రభాకర్‌రావుగారు చెప్పినట్టు వారు నిధులను కేటాయించినందుకు ధన్యవాదాలు. వారు చెప్పినట్టు ఆ నీటిశుద్ధి యంత్రాలను తొందరగానే ఉపయోగంలోకి తెస్తామని మనవి చేస్తున్నాను. గత ప్రభుత్వకాలంలో వైరల్‌ఫీవర్స్ వచ్చిన తరువాత చర్య తీసుకునేవారు, కాని ఇప్పుడు రాకముందే హెలికాప్టర్‌లో వెళ్లి ముందుగానే మందులు పంపిణీ అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నాము.

మిస్టర్ ఛైర్మన్: సమయాభావం వల్ల మిగతా ప్రశ్నలు వాయిదా వేయడం జరిగింది.

(అంతరాయం)

శ్రీ కె. తారక రామారావు: అధ్యక్షా, గౌరవ సభ్యుల ఆవేదనను అర్థం చేసుకొని వారికి, మరియూ మీకు ఒక విజ్ఞప్తి చేయదలుచుకున్నాను అధ్యక్షా, మేము అందరము ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇవ్వడానికి రెడీగా ఉన్నాం. వారిని ప్రశ్నలు వేయనీయడం లేదని వారి ఆవేదన, మీరు మొదటి ప్రశ్నను అడిగింది గంగాధర్ గౌడ్ గారిని, దానిమీద దాదాపు సప్లమెంటరీలకు 15 మందికి అవకాశం ఇచ్చారు. సభలోని అందరూ మాట్లాడితే ప్రశ్నోత్తరాల సమయంలో ఉన్న అన్ని ప్రశ్నలు పూర్తి కావడం సాధ్యం కాదు దీనిని మీ ద్వారా తెలియజేసుకుంటున్నాను. మీరు అన్నట్టుగా ప్రశ్నలు క్లుప్తంగా, మేము ఇచ్చే సమాధానాలు కూడా క్లుప్తంగా తెలియజేస్తాము.

(అంతరాయం)

శ్రీ కడియం శ్రీహరి: అధ్యక్షా, ఈ సభను ఎలా నిర్వహించాలి అనేది అధ్యక్షుల వారి నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. వాస్తవానికి కొన్ని సూచనలు, అభ్యర్థనలు మాత్రమే మీ దృష్టికి తీసుకొస్తాం. సమయం మించిపోతున్నది, కాబట్టి బడ్జెట్‌పైన చర్చలు కొనసాగించాలని కోరుతూ, సభ్యులందరూ సహకరించాలని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: మరొకసారి నేను చెప్పేది ఏమిటంటే సభ్యులు సభా, సంప్రదాయాలు పాటించాలి. పాత సాంప్రదాయాలను కూడా గౌరవించాలి. ప్రశ్న హౌజ్ ప్రాపర్టీ అంటారు. ఆ ఉద్దేశ్యంతో అందరికి అవకాశం ఇచ్చాం. ఒక ప్రశ్నను చాలాసేపు అడిగితే మంత్రి ఏం సమాధానం చెబుతారు. మంత్రి కూడా మూడు పేజీల సమాధానాలు చెప్పకుండా క్లుప్తంగా చెబితే అందరికి అవకాశం వస్తుంది. ఈ రోజు కార్యక్రమాలను కొనసాగిద్దాం. ఒక్క ప్రశ్న కూడా వదలకుండా పూర్తి చేయాలనే ఆతృతతో నేను ఉన్నాను. ప్రశ్నలు అన్నీ అడిగితేనే ప్రభుత్వ పని తీరు మనకు తెలుస్తుంది.

(అంతరాయం)

**ఎండిపోయిన సింగూరు, మంజీరా జలాశయాలు**

ప్రశ్న నెం.1236 (24)

శ్రీ వి.భూపాల్‌రెడ్డి, ఎం.ఎల్.సి. :- గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) మెదక్ జిల్లాలో అత్యల్ప వర్షపాతం వల్ల సింగూరు, మంజీరా జలాశయాలు ఈ సంవత్సరం ఎండిపోయిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, సమస్యను పరిష్కరించడానికి, మెదక్ జిల్లా ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేయడానికి తీసుకుంటున్న తక్షణ చర్యలు ఏమిటి;

ఇ) సమస్యను ఎదుర్కొనడానికి తీసుకుంటున్న శాశ్వత చర్యలేమిటి?

గౌరవ పంచాయతీరాజ్ మరియు సమాచార సాంకేతిక శాఖ మంత్రి (శ్రీ కె. తారకరామారావు) :- అ) అవునండీ.

ఆ) ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ముఖ్యంగా ప్రస్తుతమున్న సిపిడబ్ల్యుఎస్ పథకాల నుండి త్రాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నది. ఈ సరఫరాను నదీ గర్భంలో ఉపరితలం అడుగు భాగంలో ఉన్న నీటిని రాబట్టడం ద్వారాను, మంజీరా నదిలో ప్రస్తుతమున్న నీటిని తీసుకునే బావుల చుట్టుపక్కల గల నీటిని తోడుకొను బావుల కాలువలలో పూడికను తీసివేసే లోతు చేయడం ద్వారాను, సింగూరుడ్యామ్‌లోని కనీస నీటివట్టం నుండి నీటిని తోడడం ద్వారాను పునరుద్ధరిస్తున్నవి.

ఇ) ప్రధానమైన "మిషన్ భగీరథ" ప్రాజెక్టు క్రింద శాశ్వత చర్యలను చేపట్టడమయింది.

శ్రీ వి. భూపాల్‌రెడ్డి: సింగూరు, మంజీరా జలాలు ఎండిపోయిన విషయం అందరికీ తెలుసు. వాటిలో ఉన్న నీటిని వినియోగించాం. ఆ ప్రాంతంలో 4 రోజులకు ఒకసారి నీళ్లు రావడం జరుగుతోంది. హైదరాబాద్‌కు గోదావరి నీళ్లువి విధంగా వస్తాయో, మా మెదక్ జిల్లాకు కూడా మంజీరాను, సింగూరుకు మళ్లించినట్లైతే మంచినీటి సరఫరా బాగుంటుంది. పంచాయితీరాజ్ వ్యవస్థలలో కార్యదర్శులు ఎక్కువ అవడం వల్ల, గ్రామ పంచాయితీలలో నీటి ఎద్దడిని గమనించి ఆర్.ఓ.ప్లాంట్‌లు పెట్టి నీటిని అమ్ముకోవడం జరుగుతోంది. గ్రామపంచాయితీ ద్వారా 50% నీటిని గ్రామ ప్రజలకు ఇచ్చిన తరువాతనే మిగతావి మీరు అమ్ముకోవాలి అనేది ఒక నిబంధన, రెండవది ఆర్.ఓ. ప్లాంట్‌లు క్లీన్ చేసేటప్పుడు 50% నీళ్లు వృధా అవుతాయి. వీటిని ఇంకుడు గుంతలలోకి మరలించి ఉపయోగపడే విధంగా చూడాలి. వీటిఅన్నింటిని చూడాలంటే గ్రామ కార్యదర్శి, లేదా గ్రామ సర్పంచ్ బాధ్యతలు చేపట్టాలి. ఆర్.ఓ. ప్లాంట్‌ల ద్వారా వచ్చే నీటిని గ్రామస్తులకు రూ.5లకు లీటర్ ప్రకారం అమ్మి, మిగతావారికి రూ.25 లకు అమ్మేవిధంగా చూడాలని కోరుతున్నాను. నీటిసరఫరాకు ఇంకా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుందని నా మనవి.

11.20 ఉ. శ్రీ కె. తారక రామారావు: గౌరవ సభ్యులు భూపాల్‌రెడ్డిగారు చెప్పిన విషయానికి సంబంధించి చాలా వరకు నియంత్రణ చేస్తున్నాం. అయినప్పటికీ ఇంకా ఎక్కడైనా స్పష్టమైన సమాచారం మాకు ఇవ్వగలిగితే చర్యలు తీసుకోవడానికి ఆదిశలో ప్రయత్నం చేస్తాం. మెదక్ జిల్లాలో 468 ప్రైవేటు బోర్లను హైర్ చేయడం జరిగింది. దీంతోబాటు గోదావరి జలాల విషయంలో మెదక్ జిల్లాలో మిషన్ భగీరథ ఫేజు-1లో దాదాపు పది నియోజకవర్గాలుంటే అందులో 30శాతం కవర్ అయ్యేలా గజ్వేల్, దుబ్బాక, సిద్ధిపేట, మెదక్ ప్రాంతాలకు నీళ్లు ఇస్తాం. జిల్లాలోని మిగతా ప్రాంతాలకు సిఆర్‌యఫ్, నాన్-సిఆర్‌యఫ్ నిధుల ద్వారా ఇప్పుడున్న నీటి ఎద్దడిని తీర్చడానికి ప్రయత్నం చేస్తాం. సభ్యులు విలువైన సూచనలు చేశారు. రివర్స్ ఆస్మోసిస్ ప్లాంట్లు చాలా పెద్ద మొత్తంలో పెడుతున్నారని, నీళ్లు వృధా చేస్తున్నారని, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆదిశగా దృష్టిసారించాలని చెప్పారు. తప్పకుండా వారి సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం. నిర్దిష్టమైన సమాచారం ఏదైనా ఇస్తే వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

### పరిశ్రమలకు భూ కేటాయింపు

ప్రశ్న నెం.1077(25)

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన పరిశ్రమల శాఖా మంత్రిగారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) గడచిన ఒకటిన్నర సంవత్సరంలో రాష్ట్రంలోని అనేక పరిశ్రమలకు ప్రభుత్వం భూమిని కేటాయించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, కేటాయించిన భూమి, ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన పరిశ్రమల వివరాలు ఏమిటి;

ఇ) ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇంకా పరిశ్రమలను స్థాపించని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలపై తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవ పరిశ్రమలు, చక్కెర, చేనేత, జౌళి పరిశ్రమ శాఖామంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు):- అ) అవునండీ.

ఆ) 2014, జూన్ నుండి2016, ఫిబ్రవరి వరకు 265 పరిశ్రమలకు 269.16 ఎకరాల విస్తీర్ణం గల భూమిని కేటాయించడమయింది. లిస్టు కూడా సిద్ధంగా ఉంది, చదువమంటే చదువుతాను. ఆవశ్యకత, ఆమోదాల ఆధారంగా ప్రక్రియ కొనసాగుతున్నది.

ఇ) ఈ కేటాయింపులన్నీ వివిధ అమలు దశలలో ఉన్నాయి. టిఎస్-ఐపాస్ చట్టం ప్రకారం ఆర్థిక ముగింపు ఒక సంవత్సరంలో, వాస్తవ కార్యకలాపాలు నిర్దిష్టంగా తెలియపరిస్తే తప్ప ఆమోదించిన తేదీ నుండి రెండు సంవత్సరాల లోపల సాఫల్యమవుతాయి.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత టిఎస్-ఐపాస్ అనే నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకరావడం జరిగింది. మేము ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటాం. ఒక మంచి కార్యక్రమం జరిగినప్పుడు బరాబర్‌గా సపోర్టు చేస్తాం, మొదటి రోజు కూడా స్వాగతించాం. దాదాపు 1.65లక్షల ఎకరాలను పరిశ్రమల ఏర్పాటుకి సిద్ధంగా పెట్టామని చెప్పారు. టిఎస్-ఐపాస్ ద్వారా సింగిల్‌విండో పద్ధతిలో, ఈవెన్ సియం ఆఫీసులో మానిటరింగ్ సెల్ పెట్టి చాలా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇచ్చి వాళ్లను ఆకర్షించడంలో భాగంగా చేశారు. పరిశ్రమలు స్థాపించని వారి భూములను వెనక్కి తీసుకుంటామని చెప్పారు. ఇంత వరకు ఎంతమంది నుంచి భూములు వెనక్కి తీసుకున్నారు?

రెండు వందలకు పైగా పరిశ్రమలకి అనుమతులు ఇచ్చామని చెప్పారు, మంచిదే. కానీ ఆ పరిశ్రమలలో స్థానికులకు ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు? టిఎస్-ఐపాస్ మీద చర్చ జరిగినప్పుడు కూడా మేము ఈ విషయం చెప్పాం. మన ఉద్యమ ట్యాగ్‌లైన్ – మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు. దీని మీద మీ దృష్టిఏమిటి? విదేశీ కంపెనీలు వచ్చినా, ఇక్కడి కంపెనీలు వచ్చినా, ఎవరొచ్చినా స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ఏమి చర్యలు తీసుకున్నారు? అందరికీ మనం భూమి ఇస్తున్నాం, మినహాయింపులు ఇస్తున్నాం, ప్రోత్సాహకాలు ఇస్తున్నాం, సబ్సిడీలు ఇస్తున్నాం, రీయింబర్స్‌మెంటు ఇస్తున్నాం, మరి ఆ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాల మాటేమిటి? దీని మీద స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరుతున్నాను. వర్తక మండలి, కొన్ని అసోసియేషన్స్ రెప్రజెంటేషన్స్ ఇచ్చిన నేపథ్యం ఉంది, నిజమైన వాళ్లు కాకుండా వేరే వాళ్లు కూడా భూవయులు తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఇండస్ట్రియల్ఏరియాలో లేని వాళ్లు కూడా ఈ ప్రోత్సాహకాలను పొందాలనే ఉద్దేశ్యంతో దీంట్లో దూరారని అంటున్నారు. అలా జరగకుండా నిజమైన కేటగిరీకి లబ్ధి చేకూరేలా చూడండి. స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చే విషయం చూడండి. భూమిని వెనక్కి తీసుకునే కార్యక్రమం ఎంత వరకు వచ్చింది? ఎన్ని తీసుకున్నారు? పరిశ్రమలు పెట్టని వాళ్ల నుండి తీసుకున్న భూమి ఎంత? మాఖమ్మం జిల్లా, పాల్వంచలో కొంత ఉంది, పరిశ్రమలు పెడతామని భూములు ఆక్యుపై చేసుకొని పెట్టలేదు. ఇప్పుడు ఆ భూముల విలువ పెరిగింది. మీ గైడ్‌లైన్స్‌ని డీవియేట్ చేసిన వాళ్ల మీద చర్యలు తీసుకున్నారా? ఏదైనా టాస్క్‌ఫోర్స్ పెట్టారా? టిఎస్-ఐపాస్ క్రింద పెట్టిన మానిటరింగ్ సెల్ ద్వారా అంతా సవ్యంగా జరుగుతోందా లేదా అని చూస్తున్నారా? రెక్టిఫై చేయడానికి ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని కోరుతున్నాను.

వైబ్రెంట్ గుజరాత్ స్టైల్‌లో వైబ్రెంట్ తెలంగాణ సమ్మిట్ పెడితే స్థానిక పారిశ్రామికవేత్తలకు కూడా మేలు జరుగుతుందనే సూచన చేస్తున్నాను. ప్రభుత్వం ద్వారా అన్ని రకాల మినహాయింపులు పొంది ఏర్పాటైన పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాల కల్పనపై స్పెసిఫిక్‌గా సమాధానం చెప్పాలి. అలాగే ఎన్ని ఎకరాల భూమిని ఇప్పటి వరకు వెనక్కి తీసుకున్నారు? ఇండస్ట్రియల్ కారిడార్‌లో మూతపడిన పరిశ్రమల పరిస్థితి ఏమిటి? వాటిని బలోపేతం చేయాలని చెబుతూ, నేను అడిగిన అన్ని అంశాలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ వి. భూపాల్‌రెడ్డి: అధ్యక్షా, రెండు సంవత్సరాల క్రింద పిఏసి కమిటీ ద్వారా ఎంక్వైరీ వేయించి ఆరు పరిశ్రమలను విజిట్‌చేశాం. ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదు. వంద ఎకరాల భూమి ఒక వ్యక్తి దగ్గర ఉంది. నేను పదేపదే చెబుతున్నాను ఈసభలో. ఇప్పటికే పదిసార్లు చెప్పాను. ఎకరా రూ.13వేల చొప్పున కేటాయించబడిన భూమి నేడు ఎకరా రూ.4కోట్లకు వచ్చింది. ఆయన కోర్టులో కేసు వేసి కూర్చున్నాడు. అధికారులను ఎప్పుడు అడిగినా మేము ఏమి చేయాలి, విషయం కోర్టులో ఉందని చెబుతున్నారు. 30 ఏళ్ల క్రితం కేటాయించిన ల్యాండ్ అది. ఇన్ని సంవత్సరాలైనా ఇంకా కోర్టులో పెండింగులో ఉందని చెబుతున్నారు. ఆ భూమిని వెనక్కి తీసుకోరా? ఒక్క పరిశ్రమ లేదు, అటువంటివి ఆరున్నాయి. వాటిని పిఏసి ద్వారా ఇన్‌స్పెక్షన్ చేయించాం. ఆ రిపోర్టు ఏమైంది? ఏమి చర్యలు తీసుకున్నారో దయచేసి చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జూపల్లి కృష్ణారావు: అధ్యక్షా, పెట్టుబడులు ఆకర్షించి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచి, యువతకి ఉద్యోగావకాశాలు కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో ఈ నూతన పారిశ్రామిక విధానం తీసుకరావడం జరిగింది. ప్రపంచం మెచ్చే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. అందులో భాగంగా 80శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలని, except highly technical and skilled manpower అవసరమైతే తప్ప , మిగతా 80శాతం ఉద్యోగాలు స్థానికులకు రావాలని ప్రతి సందర్భంలో స్పష్టంగా నిర్దేశిస్తున్నాం. గైడ్‌లైన్స్‌లో కూడా స్పష్టంగా చెప్పడం జరిగింది. Unskilled గానీ, semi-skilled గానీ రాష్ట్రంలో లభ్యంగా లేని వాళ్లను మాత్రమే బయట నుంచి తెచ్చుకోవాలని గౌరవ ముఖ్యమంత్రిగారు, మేము పదేపదే స్పష్టంగా ప్రతి సందర్భంలో, పారిశ్రామికవేత్తలకు సర్టిఫికేట్లు ఇచ్చే సందర్భంలో ఇన్‌సిస్ట్ చేస్తున్నాం. టెక్నికల్‌గా పైస్థాయిలో మ్యాన్ పవర్ అవసరమైతే తప్ప, మిగతా అన్నింటిలో 80శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని స్పెసిఫై చేయడం జరిగింది. దీన్ని ఖచ్చితంగా అమలుచేస్తూ ముందుకు తీసుకెళతాం.

ఏ లక్ష్యంతో భూములు ఇచ్చారో, ఆ లక్ష్యం నుంచి డీవియేట్ అయిన ఎంత మంది పారిశ్రామికవేత్తల నుంచి ఇచ్చిన భూములను వెనక్కి తీసుకున్నారని గౌరవ సభ్యులు అడిగారు. ఈ ప్రభుత్వం జూన్ 2, 2014న ఏర్పడింది. ఇంకా రెండు సంవత్సరాలు కాలేదు. ఎవరికైతే భూములు కేటాయించామో వాళ్లు నిబంధనల ప్రకారం ఒక సంవత్సరంలో Financial Closure చేయాలి, Financial Closure చేసిన రెండు సంవత్సరాల లోపల ప్రొడక్షన్ రావాలి. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేటాయించిన భూములు వాపసు తీసుకునే పరిస్థితి ఇంకా రాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపిఐఐసి ఉన్నపుడు, since inception of the APIIC, మొత్తం 1.30లక్షల ఎకరాలు కేటాయించారు. ఇందులో తెలంగాణ ప్రాంతంలో 28వేల ఎకరాలు కేటాయించగా, ఆంధ్రప్రదేశ్‌లో 1.02లక్షల ఎకరాలు కేటాయించడం జరిగింది. మొత్తం డబ్బు కూడా సమైక్య రాష్ట్రానికే సంబంధించింది. ఈ ల్యాండ్స్ రికవరీ విషయంలో ఇప్పటికే 474ఎకరాలకు సంబంధించి 204 షోకాజు నోటీసులు ఇవ్వడం జరిగింది. Total number of cancellations are 95, ఈవిధంగా రద్దు చేసి 448.64ఎకరాలు తిరిగి వాపసు తీసుకోవడం జరిగింది. ఇంకా చాలా కేసులు వివిధ దశలలో ఉన్నాయి. నోటీసులు ఇవ్వడం, కోర్టు కేసులున్న వాటికి అవసరమైన అప్పీల్స్ ఫైల్ చేయడం, even cancellation of Stay Orders, cancellation of Status Quo కావచ్చు, ఇవన్నీ ప్రాసెస్‌లో ఉన్నాయి. లక్ష్యాన్ని విస్మరించిన వాళ్ల నుంచి, ఏ ఉద్దేశ్యం కోసమైతే భూములు ఇవ్వడం జరిగిందో, ఆ ఉద్దేశ్యం నెరవేర్చని వాళ్లనుంచి భూములు వాపసు తీసుకునే ఏర్పాటు చేస్తున్నాం.

1994 నుంచి 2004 వరకు 1643 యూనిట్లకు 2111ఎకరాలు ఇవ్వడం జరిగింది. అందులో non-implementation అయినవి 156 ఉన్నాయి. గడిచిన 14సంవత్సరాలలో వాటికి సంబంధించిన 323ఎకరాలలో ఒక్క దాని నుంచీ కూడా వాపసు తీసుకోలేదు. అది కూడా ప్రాసెస్ చేస్తున్నాం. 2004 నుంచి 2014 వరకు ఆనాడున్న ప్రభుత్వాల కాలంలో 2333 యూనిట్లకు 4223 ఎకరాలు ఇవ్వడం జరిగింది. ఇందులో 3563 ఎకరాలకు సంబంధించి 660 యూనిట్లు నిబంధనలను implement చేయలేదు. ఆ పది సంవత్సరాల కాలంలో ఏఒక్క పరిశ్రమ నుంచీ ఒక ఎకరం

కూడా ఆ ప్రభుత్వాలు వాపసు తీసుకోలేదు. అయితే ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలో టియస్ఐఐసి కావచ్చు, సంబంధిత అధికారులు కావచ్చు, వాళ్లంతా active role play చేసి తక్కువ కాలంలో 440ఎకరాలను ఇప్పటికే వాపసు తీసుకోవడం జరిగింది. కొన్ని కొన్ని పెద్ద పెద్దవి కూడా ఉన్నాయి. వాటికి సంబంధించిన ప్రాసెస్ కూడా స్పీడప్ చేస్తున్నాం. సెమ్ ఇండియా అనే కంపెనీకి వంద ఎకరాలు సంవత్సరానికి వెయ్యి రూపాయల లీజు చొప్పున 66 సంవత్సరాలు లీజుకు ఇవ్వడం జరిగింది. అందులో కేవలం 22ఎకరాలు మాత్రమే వినియోగించుకున్నారు, ఇంకా మిగిలిన 78ఎకరాలను వినియోగించుకోలేదు. దానికి సంబంధించిన విషయాన్ని కూడా కోర్టులో స్పీడప్ చేస్తున్నాం. ప్రత్యేకంగా ఇవన్నీ సమీక్షించి నూటికి నూరు శాతం చర్యలు తీసుకుంటాం. గత సుదీర్ఘ కాలంగా ప్రభుత్వాలను నడిపిన నాయకులు కావచ్చు, పార్టీలు కావచ్చు, ముఖ్యమంత్రులు కావచ్చు, వాళ్లంతా ఇష్టారాజ్యంగా వ్యవహరించి అవసరానికి మించి భూముల కేటాయింపు చేయడం జరిగింది. కేటాయించిన భూములను ఇష్టారాజ్యంగా వాడుకుంటూ, ఇచ్చిన లక్ష్యాలను విస్మరిస్తూ వేరే ఉద్దేశ్యాలకు కూడా ఈభూములను వినియోగించుకున్నారు. చట్టంలో ఉన్న అధికారాలను ఉపయోగించుకొని, న్యాయపరంగా, సంబంధిత అధికారులు, అడ్వకేట్ జనరల్ అభిప్రాయాలను తీసుకొని ప్రాసెస్ చేసి వీలైనంత త్వరగా నూటికి నూరు శాతం ఈరాష్ట్రానికి సంబంధించినటువంటి విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా, ప్రజలకు, రాష్ట్రానికి దక్కే విధంగా చర్యలు తీసుకుంటామని గౌరవ సభ్యులకు మీద్వారా తెలియజేస్తున్నాను.

## ఉపాధ్యాయులకు సేవా నిబంధనలు

ప్రశ్న నెం.1038(26)

శ్రీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి(విద్య) గారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) సర్వీసు నియమావళి, పర్యవేక్షణ లోపం వల్ల విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, సదరు ప్రమాణాలను మెరుగుపర్చడానికి, ఉపాధ్యాయులకు సర్వీసు నియమావళిని రూపొందించడానికి తీసుకోవలసిన చర్యలేమిటి;

ఇ) ఎంఇఓ, డెప్యూటీ డిఇఓ, డైట్ లెక్చరర్స్ పదవులను భర్తీ చేసే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఈ) 4 జిల్లాలలో ఉపాధ్యాయ పదవులు ఖాళీగా ఉన్నాయన్న విషయం కూడా వాస్తవమేనా? అయితే, డియస్సీ ద్వారా పదవులను ఎప్పటిలోగా భర్తీ చేయడమవుతుంది?

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి(విద్య) (శ్రీ కడియం శ్రీహరి):- అ) మరియు ఆ) లేదండీ.

విద్యాపరమైన పర్యవేక్షణ నిర్వహణకు తనిఖీ అధికారుల ఖాళీ పదవుల కోసం పూర్తి అదనపు బాధ్యత ఏర్పాట్లను చేయడమయింది.

ఇ) 30.9.15 తేదీగల 2009లోని సి.ఎ.నెం .4878-4885, 2011 లోని యస్‌యల్‌పి(సి) నెం. 35880లో గౌరవ భారత సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ అంశం పరిశీలనలో ఉన్నది.

ఈ) 2015, జూలై/ఆగస్టు జరిగిన నమోదు, బదిలీలపై ఆధారపడి ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ తరువాత ఖాళీ పదవులలో విద్యా వాలంటరీర్లను నియమించడానికి చర్యలు చేపట్టడమయింది.

శ్రీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి: అధ్యక్షా, యూనిఫైడ్ సర్వీసు రూల్స్‌కి సంబంధించి సుదీర్ఘంగా పెండింగులో ఉన్న సుప్రీంకోర్టు కేసుపై 30.9.2015 నాడు తీర్పు వచ్చింది. పంచాయతీరాజ్‌వ్యవస్థలో పనిచేసే ఉపాధ్యాయులను కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణిస్తూ వాళ్లసర్వీసును లోకల్ కేడర్‌గా ఆర్గనైజ్‌చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆ తీర్పులో సూచించడం జరిగింది. మీద్వారా గౌరవ డెప్యూటీ సి.యం. గారిని అడుగుతున్నాను, ఈ యూనిఫైడ్ సర్వీసు రూల్స్ ప్రపోజల్స్ ఎప్పటిలోగా కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారో తెలియజేయాలని కోరుతున్నాను.

యంఇఓ, డెప్యూటీ డిఇఓ వ్యవస్థలు 90శాతం యఫ్ఏసిలతో నడుస్తున్నాయి. యంఇఓ (యఫ్ఏసి)గా

వ్యవహరిస్తున్నందున, తాను పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పూర్తి బాధ్యత వహించలేకపోతున్నారు కావున ఏదైతే యంఇఓగా యఫ్ఏసి ఇచ్చారో, ఆ హెడ్‌మాస్టర్ స్థానంలో ఆ పాఠశాలకి సంబంధించిన సీనియర్ స్కూల్ అసిస్టెంట్‌కి యఫ్ఏసి హెడ్‌మాస్టర్‌గా నియామకం చేస్తే ఇటు న్యాయం, అటు న్యాయం జరుగుతుందని నా భావన. అలాంటి ఆలోచన ప్రభుత్వానికి ఏమైనా ఉందా?

రెండు - డెప్యూటీ డిఇఓ పోస్టులు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు శాంక్షన్ అయిన సంఖ్య. అప్పుడు ఒక డెప్యూటీ డిఇఓ పరిధిలో 40 నుంచి 50 వరకు ఉన్నత పాఠశాలలుండేవి. కానీ ఇప్పుడు ఒక్కొక్క డెప్యూటీ డిఇఓ పరిధిలో దాదాపు 150 నుంచి 200 ఉన్నత పాఠశాలలున్నాయి. దాని వల్ల ప్రతి అకాడమిక్ ఇయర్‌లో వాళ్లు అకాడమిక్ ఇన్‌స్పెక్షన్ పర్‌ఫెక్టుగా చేయలేకపోతున్నారు. ఆవిధంగా చేయలేకపోవడం వల్ల కొంతమేరవిద్యా ప్రమాణాలు దెబ్బతింటున్న మాట వాస్తవం. డెప్యూటీ డిఇఓల సంఖ్యను పెంచే అవకాశం ఉన్నదా? పెంచి పర్యవేక్షణ పటిష్టం చేస్తే విద్యాప్రమాణాలు మెరుగవుతాయి. కాబట్టి పెంచే ఆలోచన చేయాలని కోరుతున్నాను.

టీచర్స్‌కి సంబంధించి రేషనలైజేషన్ చేయడం మూలంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాదు జిల్లాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఆ నాలుగు జిల్లాలలో ఖాళీలు ఎంతవరకున్నాయి, ఆ అవసరం మేరకు ఎప్పటిలోగా డియస్సీ కండక్ట్ చేస్తారు? గౌరవ ముఖ్యమంత్రిగారు మొన్న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకి సమాధానం ఇచ్చిన సందర్భంలో చెప్పారు, డియస్సీని అతి తొందర్లో కండక్ట్ చేస్తామని చెప్పారు, చాలా సంతోషం, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆ నాలుగు జిల్లాలో ఎంత మేరకు టీచర్ల అవసరం ఉంది, ఆ మేరకు ఎప్పటిలోగా డియస్సీ కండక్ట్ చేసే అవకాశం ఉందో చెప్పాలని డెప్యూటీ సియం గారిని కోరుతున్నాను.

ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఎడ్యుకేషన్ యాక్టు ప్రకారం ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ స్థాయికన్నా తక్కువ స్థాయి పోస్టులో పని చేయడానికి వీలులేదు. కాబట్టి మన రాష్ట్రంలోని పది జిల్లాలలో ఆ అవసరం మేరకు ఎంతమంది భాషా పండితులను, ఎంత మంది వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేయాలో, అది ఎప్పటిలోగా చేస్తారో నిర్దిష్టంగా తెలియజేయాలని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్: అధ్యక్షా, ప్రభుత్వ విద్యా రంగానికి సర్వీసు రూల్స్ అన్నవి చాలా ముఖ్యం. మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మన విద్యా రంగానికి సంబంధించిన సర్వీసు రూల్స్‌ని ఫ్రేమ్ చేసుకుందామని గౌరవ ముఖ్యమంత్రిగారు స్వయంగా చాలా ఇంట్రెస్ట్‌తో చెప్పారు. మన సియం గారు కానీ, డెప్యూటీ సియం గారు కానీ ఈ విద్యారంగం మీద స్పష్టమైన దృష్టి పెట్టారు. విద్యాశాఖ ఒక్కటే అయినప్పటికీ ఇందులో రెసిడెన్షియల్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, ఎయిడెడ్, పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాలలు ఇలా ఎన్నో విభాగాలుగా విడిపోయి పని చేస్తున్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు క్రింద తీసుకొచ్చి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినందుకు అభినందనలు తెలియజేస్తున్నాను. సెప్టెంబర్ 30, 2015 న సుప్రీంకోర్టు జడ్జిమెంటు వచ్చింది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని యూనిఫైడ్ సర్వీసు రూల్స్ ఫ్రేమ్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించవలసిన అవసరం ఉంది.

**11.40 ఉ.** అక్కడికి వెళ్లిన తరువాత రాష్ట్రపతి అనుమతితో అప్పుడు ఈ పంచాయతీరాజ్ ప్రభుత్వ విద్యా రంగానికి రూల్స్ ఫ్రేమ్ అవుతాయి. దయచేసి దీని మీద ఒక ప్రత్యేకమైనటువంటి దృష్టి పెట్టి సాధ్యమైనంత తొందరలో ఏకీకృత సర్వీస్ అంశాన్ని కేంద్రానికి పంపించాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ నారదాసు లక్ష్మణ్ రావు : అధ్యక్షా, తెలంగాణలోని చాలా పాఠశాలల్లో స్వీపర్లు గానీ, అటెండర్లు గానీ లేరు. ఇదివరకు ఉన్నటువంటి అటెండర్లు చాలామంది పదవీ విరమణ పొందారు. దాంతో ప్రస్తుతం ఆ పోస్టులన్నీ ఖాళీలుగా ఉన్నాయి. అంతేకాకుండా స్వీపర్లకు చాలా స్వల్ప వేతనాలు ఇస్తున్నారు. దాదాపు వెయ్యి లోపలే ఉన్నాయి. ఒక్కొక్కరు

దాదాపు 20, 30 ఏండ్లనుండి పని చేస్తున్నవారు ఉన్నారు. పాఠశాలల్లో స్వీపర్లు, అటెండర్లు లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు అక్కడున్నటువంటి విద్యార్థులతో గంట కొట్టించడం, పరిశుభ్రత కార్యక్రమాలు చేయించడం జరుగుతోంది. ఇది చాలా విచారించదగిన విషయం. అందుకొరకే అరకొర జీతాలతో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేసే అంశం మరియు ఖాళీలుగా ఉన్నటువంటి Office Subordinate పోస్టులను కూడా భర్తీ చేసేటువంటి ఆలోచనలో ప్రభుత్వం ఏమైనా ఉన్నాదా? తెలియజేయాలని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, రాష్ట్రంలో ఎం.ఈ.ఓ, డిప్యూటీ డి.ఈ.ఓ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయి. ఇవి ప్రమోషన్ ఛానెల్ ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులు కాబట్టి, ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ ఫైనల్ కాకపోవడం వలన వీటిని భర్తీ చేయలేకపోతున్నాము. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌కి సంబంధించి ఉపాధ్యాయ సంఘాల మధ్యనే కొన్ని విభేదాలు ఉండడం వలన ఇప్పటి వరకు దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనలేకపోవడం జరిగింది. వాస్తవంగా 1998లోనే జిఓఎంఎస్ నెం.505, 538 ద్వారా ఈ ఏకీకృత సర్వీసు రూల్స్‌ని ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, దీనికి వ్యతిరేకంగా కొన్ని ఉపాధ్యాయ సంఘాలు హైకోర్టుకు వెళ్లడం. హైకోర్టు 2003లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను struck down చేయడం జరిగింది. దానిపైన తిరిగి కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, రాష్ట్రప్రభుత్వం కూడా సుప్రీం కోర్టు వరకు వెళ్లారు. సుప్రీంకోర్టు సెప్టెంబర్ 30, 2015లో ఫైనల్ జడ్జిమెంట్‌ని ఇవ్వడం జరిగింది. ఒకవైపు హైకోర్టు ఇచ్చిన తీర్పుని upheld చేస్తూనే మరొకవైపు ఆయా రాష్ట్రాలకు కొంత స్వేచ్ఛనిస్తూ మీ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులనుబట్టి మీరు ఏకీకృత సర్వీసు రూల్స్‌ని చేయాలనుకుంటే మీరు కేంద్ర ప్రభుత్వానికి పంపించి రాష్ట్రపతి గారి ఆమోదంతో మీరు ఈ సర్వీసు రూల్స్‌ని ఫైనలైజ్ చేసుకోవచ్చని దానిలో వెసులుబాటు కల్పించారు. ఆ వెసులుబాటును ఆధారంగా చేసుకునే మొన్నీమధ్యనే ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడడం జరిగింది. అందులో మెజారిటీ ఉపాధ్యాయ సంఘాలు ఏకీకృత సర్వీసు రూల్స్ చేయాలనే కోరుతున్నాయి. వారియొక్క డిమాండ్స్‌ని దృష్టిలో పెట్టుకొని గౌరవ ముఖ్యమంత్రి గారి ఆమోదంతో త్వరలోనే రాష్ట్రప్రభుత్వం తరుపున ఉపాధ్యాయ ఏకీకృత సర్వీసు రూల్స్‌ని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించబోతున్నాము. బహుశా ఈ మాసంలోనే ఏకీకృత సర్వీసు రూల్స్‌కి సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పి మీద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను. ఈ ఏకీకృత సర్వీసులకి ఆమోదం లభించకుండా ఈ ప్రమోషన్స్ ఇవ్వడం గానీ, ఖాళీలను భర్తీ చేయడం సాధ్యం కాదనే విషయం గౌరవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలందరికీ కూడా తెలుసు. త్వరలోనే దీని ఆమోదం పొంది, వీలైతే రేపు అకడమిక్ ఇయర్‌లోనే కేంద్ర ప్రభుత్వం నుండి మనకు ఆమోదం లభిస్తే తప్పకుండా ఈ ఖాళీలన్ని భర్తీ చేస్తామని చెప్పి గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి, డిఎస్సి నోటిఫికేషన్ విషయంలో కూడా గౌరవ సభ్యులు అడగడం జరిగింది. మొన్నీమధ్యనే, ఈ మాసంలోనే 13వ తేదీన Teacher Eligibility Test(TET)కు సంబంధించిన షెడ్యూల్‌ని నోటిఫై చేయడం జరిగింది. ఈరోజు నుండి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కూడా రిసీవ్ చేసుకుంటున్నాము. 1st May, 2016న TET exam conduct చేసి, 10th May, 2016న రిజల్ట్సు ఇచ్చేవిధంగా షెడ్యూల్డ్ విడుదల చేయడం జరిగింది. Teacher Eligibility Test(TET) పూర్తయిన తరువాత DSC Notificationకి వెళ్లాలని అనుకుంటున్నాము. గౌరవ ముఖ్యమంత్రి గారు శాసనసభలో గవర్నరు గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడుతూ చాలా స్పష్టంగా వారు ఒక ప్రకటన చేయడం జరిగింది. త్వరలోనే ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించిన DSC Notification కూడా ఇస్తామని చెప్పి గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రకటించి ఉన్నారు. అయితే ఇక్కడ దీనికి సంబంధించి ఒక fresh assessment కూడా చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

గౌరవ ముఖ్యమంత్రి గారు విద్యా రంగాన్ని కొంత ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వాలు విద్యా రంగాన్ని కొంత నిర్లక్ష్యం చేశాయి. వారి నిర్వాహకం వల్ల మన విద్యావ్యవస్థ కొంత దెబ్బతిన్నది. దీనిని మనం గాడిలో

పెట్టాల్సిన అవసరముందనే విషయాన్ని కూడా వారు తరచూ చెబుతున్నారు. కాబట్టి, వారి ఆదేశాల మేరకు సభ్యులందరి ఆలోచనల మేరకు విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తూనే ఈ ఖాళీలన్నీ కూడా భర్తీ చేస్తూ ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము.

అదేవిధంగా గౌరవ సభ్యులు శ్రీ నారదాసు లక్ష్మణ్ రావు గారు పాఠశాలల్లోని శానిటేషన్‌కి సంబంధించి మరియు అక్కడ పని చేస్తున్న స్వీపర్లు, అటెండర్ల గురించి మాట్లాడారు. మొన్న గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక పాలసీ నిర్ణయం కూడ తీసుకోవడం జరిగింది. ఏవైతే ప్రభుత్వ పాఠశాలలున్నాయో, అవి జిల్లా పరిషత్ పాఠశాలలు కావచ్చు, ప్రభుత్వ పాఠశాలలు కావచ్చు లేదా మున్సిపాలిటీ పాఠశాలలు కావచ్చు, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి Sanitation and Drinking Water facility ఈ రెండు కూడా గ్రామ పంచాయతీలే ఏర్పాటు చేసే విధంగా త్వరలోనే ఒక చట్టం తీసుకువస్తామని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు కూడా ఇవ్వడం కూడా జరిగింది. కాబట్టి, త్వరలోనే చట్టం చేయడం జరుగుతుంది. ఆ చట్టం గనుక అమలులోకి వస్తే పంచాయతీరాజ్ శాఖ ద్వారా, ఆ గ్రామ పంచాయతీలలోని సిబ్బంది ద్వారానే ఆ పాఠశాలల యొక్క శానిటేషన్‌ని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. మంచినీటి సౌకర్యం కూడా కల్పించే అవకాశం ఉంటుందని చెప్పి తమరి ద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

جناب سید الطاف حیدر رضوی (Janab Syed Altaf Hyder Razvi): اردو میڈیم کے جو پوسٹس ہیں، اس میں جو پہلے بھی معمول تھا، جو knowing Urdu لوگ نہیں ملے because اس میں reservation کا clause ہے، اس کو ہٹا کر ہم پہلے appointments کرتے تھے۔ اردو میڈیم اسکولس کا بہت برا حال ہے ریاست میں، کئی اردو میڈیم اسکولس میں Headmaster اردو جاننے والا نہیں ہے۔ جس کو اردو نہیں آتا ہے تو پڑھنا آتا۔ صاحب، یہ ساری چیزیں چل رہی ہیں۔ اردو کے تعلق سے اسکول کے تعلق سے جو backlog ہے، جو de-notify کرکے حکومت ہر بار عوام کو وہاں پر appointments کرتی تھی، یہ کتنی جلدی ہوسکتا ہے، میں ہمارے ڈپٹی سی ایم صاحب سے پوچھنا چاہ رہا ہوں۔

శ్రీ కడియం శ్రీహరి : తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఉర్దూ మీడియం పాఠశాలల్లో, ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల పోస్టులు దాదాపుగా 1,225 ఖాళీలుగా ఉన్నాయి. ఇవన్నీ కూడ రేపు టెట్ అయిన తరువాత DSC Notify చేసే సమయంలో ఈ ఖాళీలను కూడా ఇన్‌క్లూడ్ చేసి ఈ పోస్టులన్నీ భర్తీ చేయాలని ప్రభుత్వం స్పష్టంగా నిర్ణయం తీసుకుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి : MEO పోస్టులు గానీ, Deputy DEO పోస్టులు గానీ ప్రమోషన్ల ద్వారా నింపడానికి వీలు లేదనేది వాస్తవం. ఏవిధంగానైతే FAC, MEOలను ఇస్తున్నామో, అదే విధంగా Head Master స్థానంలో Senior School Assistantsని FAC, Head Master లుగా నియామకం చేసినట్లయితే అటు MEOగా అక్కడ ఆయన సక్రమంగా బాధ్యతలు నిర్వహించగలుగుతాడు. ఇక్కడ Senior School Assistants, FAC, Head Mastersగా సక్రమంగా బాధ్యతలు నిర్వహించగలుగుతారు గనుక దాని విషయం ఆలోచన చేయాలని మీద్వారా కోరుతున్నాను.

DSC Notification కన్నా ముందు Pandit PET పోస్టుల Upgradation, DSC Notificationతో ముడిపడి ఉంది. దయచేసి ఏ పోస్టులైతే అప్‌గ్రేడేషన్ అవుతాయో వాటిని మళ్లీ తరువాత అప్‌గ్రేడేషన్ చేసే అవకాశం ఉంది గనుక ఆ DSC Notification కన్నముందే Pandit PET పోస్టులను Upgradation చేసే విధంగా చర్యలు చేపట్టాలని మీద్వారా గౌరవ ఉప–మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి : సభ్యులు లేవనెత్తిన రెండు అంశాలను కూడా శాఖాపరంగా పరిశీలిస్తామని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

## రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల స్థాయికి పెంచుట

ప్రశ్న నెం. 1064(27)

శ్రీ సభావత్ రాములు నాయక్ ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల పొడవు ఎంత, మరియు వాటి నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఎన్ని;

ఆ) రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల స్థాయికి పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వానికి ఏవేని ప్రతిపాదనలు పంపిందా;

ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి (శ్రీ తుమ్మల నాగేశ్వర రావు):- అ) తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల మొత్తం పొడవు 2573 కిలోమీటర్లు. 2015-16 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం కొత్త ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రోడ్లు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రూ.640.98కోట్ల మొత్తాన్ని కేటాయించింది.

ఆ) అవునండీ.

ఇ) తెలంగాణ ప్రభుత్వం 4207 కిలోమీటర్ల రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా స్థాయిని పెంచాలని కొత్త ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రోడ్లు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఇదివరకే కోరింది. రోడ్ల జాబితాను అనుబంధం-ఎ రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

దరిమిలా, సమారు 1400 కిలోమీటర్ల రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా స్థాయిని పెంచుతామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకోసం, ప్రకటనను ఇంకా జారీ చేయాల్సి ఉంది. వివరాలను, అనుబంధం-బి రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

అంతేకాక, గౌరవనీయులైన కేంద్ర రోడ్లు, రవాణా, రహదారులు & నౌకాశ్రయ శాఖ మంత్రిగారు, 04-01-2016 తేదీన వరంగల్ సమీపంలోని మడికొండ వద్ద ఎన్‌హెచ్ 163 యొక్క యాదగిరి-వరంగల్ విభాగపు నాలుగు లైన్లకు శంకుస్థాపన చేయడం కోసం జరిగిన బహిరంగ సమావేశంలో, తెలంగాణ రాష్ట్రంలోని 12 రాష్ట్ర రోడ్లను కొత్త జాతీయ రహదారులుగా స్థాయిని పెంచుతామని ప్రకటించారు. రాష్ట్రరోడ్లను జాతీయ రహదారులుగా స్థాయిని పెంచే గెజిట్ ప్రకటనను కేంద్ర ప్రభుత్వం నుండి ఇంకా అందవలసి ఉంది. వివరాలను అనుబంధం-సి రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

అనుబంధం - ఏ

| వరుస సంఖ్య | జాతీయ రహదారులుగా స్థాయిని పెంచడానికి ప్రతిపాదించిన రోడ్ల | పొడవు కి.మీ.లలో |
|---|---|---|
| 1. | ఆదిలాబాదు-ఉట్నూరు-ఖానాపూర్-కోరుట్ల-వేములవాడ-సిద్ధిపేట్-జనగాం-సూర్యాపేట-మిర్యాలగూడ-పిడుగురాళ్ళ-నర్సారావుపేట-ఒడరేవు | 495 |
| 2. | కాకినాడ-ద్వారపూడి-రాజమండ్రి-కొవ్వూరు-జంగారెడ్డిగూడెం-అశ్వారావుపేట-ఖమ్మం-సూర్యాపేట | 160 |
| 3. | నిర్మల్-ఖానాపూర్-లక్సెట్టిపేట (ఎన్‌హెచ్ 222 విస్తరణ) | 108 |
| 4. | రాజమండ్రి, గోకవరం, రంపచోడవరం, మారేడిమిల్లి, చింటూరు భద్రాచలం, చర్ల, వెంకటాపురం | 125 |
| 5. | గోల్‌గాం - ఆసిఫాబాదు - మంచిర్యాల - పెద్దపల్లి - కరీంనగర్ | 160 |
| 6. | కోదాడ - మిర్యాలగూడ - దేవరకొండ - కల్వకుర్తి - జడ్చెర్ల | 309 |
| 7. | సంగారెడ్డి - నర్సాపూర్ - భువనగిరి - చిట్యాల - షాద్‌నగర్ - చేవెళ్ళ- సంగారెడ్డి | 367 |
| 8. | హైదరాబాదు - మెదక్ - యెల్లారెడ్డి - బాన్సువాడ - భోదన్ - నిజామాబాదు | 190 |
| 9. | హైదరాబాదు - బీజాపూర్ రోడ్డు (మొయినాబాదు, చేవెళ్ళ, మన్నెగూడ, కొడంగల్ మీదుగా) | 133 |
| 10. | జగిత్యాల - కరీంనగర్ - వరంగల్ - ఖమ్మం - కోదాడ | 284 |
| 11. | ఆదిలాబాదు - జైనాథ్ - బేల - కెరిమేరి - ఆసిఫాబాదు - తిర్యాని - ఖాసిపేట్ - బెల్లంపల్లి | 140 |
| 12. | కరీంనగర్ - సిరిసిల్ల - యెల్లారెడ్డి - కామారెడ్డి - తాడ్వాయి - లింగంపేట్ - యెల్లారెడ్డి - నార్వా - పిట్లం - నారాయణఖేడ్ - బీదర్ | 172 |
| 13. | కరీంనగర్ - సిద్ధిపేట్ - వర్గల్ - హైదరాబాదు | 144 |
| 14. | జహీరాబాదు - నయాల్కల్ - అల్లాహదర్గ్ - టెక్మల్ - మెదక్ - రామాయంపేట్ - సిద్ధిపేట్ - హుసనబాద్ - హుజూరాబాదు - వీణవంక - ముత్తారం - తాడిచెర్ల - మంథని - చెన్నూరు. | 325 |
| 15. | నార్కెట్‌పల్లి - మోత్కూర్ - ఆత్మకూర్ - రాయిగిర్ - యాదగిరిగుట్ట - రాజపేట - మర్‌దొడ్డి - దుబ్బాక - గంభీరావ్‌పేట - యెల్లారెడ్డి - భీమ్‌గల్ - మోర్తాడ్ | 236 |
| 16. | మహదేవ్‌పూర్ - ముత్తారం - తాడ్వాయి - గోవిందరావుపేట గుండాల - ఇల్లందు - ఖమ్మం | 185 |
| 17. | బయ్యారం - పినపాక - గుండాల - మర్రిగూడెం - నర్సంపేట | 116 |
| 18. | రాయచూర్ - గద్వాల్ - కొత్తకోట - వనపర్తి - నాగర్‌కర్నూల్ - కల్వకుర్తి | 143 |
| 19. | జహీరాబాదు - తాండూర్ - కొడంగల్ - మహబూబ్‌నగర్ - నాగర్‌కర్నూల్ - కొల్లాపూర్ - నందికొట్కూరు - నంద్యాల | 255 |
| 20. | హైదరాబాదు - ఇబ్రహీంపట్నం - యాచారం - పెద్దవూరా - నాగార్జునసాగర్ రోడ్డు | 160 |
| | మొత్తం పొడవు (కి.మీ) | 4207 |

<u>అనుబంధం - బి</u>

స్థాయిని పెంచడానికి ప్రతిపాదించిన జాతీయ రహదారుల జాబితా

| వరుస సంఖ్య | ఎంఓఆర్‌టి & హెచ్ ద్వారా సూత్రప్రాయంగా పరిగణించిన ఎన్‌హెచ్ విభాగం | పొడవు కి.మీ. లలో | తెలంగాణ రాష్ట్రం ద్వారా చివరగా ప్రతిపాదించిన ఎన్‌హెచ్ విభాగం | పొడవు కి.మీ. లలో | రిమార్కులు |
|---|---|---|---|---|---|
| 1. | జాతీయ రహదారి 61కి (పాత జాతీయ రహదారి 221) అనుసంధానిస్తూ భోదన్ - బాసర - భైంసా | 55 | జాతీయ రహదారి 61 (పాత ఎన్‌హెచ్ 221)కి అనుసంధానిస్తూ హైదరాబాద్-సర్వాపూర్-మెదక్-ఎల్లారెడ్డి-బాన్సువాడ - భోదన్-బాసర-భైంసా | 230 | రాష్ట్ర రాజధానికి అనుసంధానిస్తున్నందున మొత్తం పొడవు ఆమోదం కోసం విన్నపం |
| 2. | మొయినాబాదు - చేవెళ్ళ - మన్నెగూడ - కొడంగల్ మీదుగా హైదరాబాదు - బీజాపూర్ రోడ్డు కర్ణాటక సరిహద్దు వరకు | 133 | మొయినాబాదు - చేవెళ్ళ - మన్నెగూడ - కొడంగల్ మీదుగా హైదరాబాదు - బీజాపూర్ రోడ్డు కర్ణాటక సరిహద్దు వరకు | 133 | మార్పులేదు |
| 3. | కోదాడ - మిర్యాలగూడ - దేవరకొండ - కల్వకుర్తి - జడ్చర్ల | 220 | కోదాడ - మిర్యాలగూడ - దేవరకొండ - కల్వకుర్తి - జడ్చర్ల | 220 | మార్పులేదు |
| 4. | ఎన్‌హెచ్ 61 (పాత ఎన్‌హెచ్ 222), ఎన్‌హెచ్ 63 (పాత ఎన్‌హెచ్ 16)కి అనుసంధానిస్తూ ఖానాపూర్, మల్లాపూర్ రాయ్‌కల్ మీదుగా నిర్మల్ - | 87 | ఎన్‌హెచ్ 61 (పాత ఎన్‌హెచ్ 222), ఎన్‌హెచ్ 63 (పాత ఎన్‌హెచ్ 16)కి అనుసంధానిస్తూ ఖానాపూర్ - మల్లాపూర్ మీదుగా నిర్మల్ - జగిత్యాల | 87 | ఆమోదం కోసం కోరడమయింది. |
| 5 | సూర్యాపేట్ - ఖమ్మం | 60 | సూర్యాపేట్ - ఖమ్మం - అశ్వారావుపేట - రాజమండ్రి | 177 | ఉత్తర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా మధ్య ముఖ్యమైన అనుసంధానం |
| 6. | కరీంనగర్ - సిరిసిల్ల - కామారెడ్డి - ఎల్లారెడ్డి - పిట్లం | 149 | కరీంనగర్ - సిరిసిల్ల - కామారెడ్డి - ఎల్లారెడ్డి - పిట్లం | 149 | మార్పులేదు |
| 7. | సిరిసిల్ల - సిద్ధిపేట - దుద్దెడ - జనగాం - సూర్యాపేట | 192 | సిరిసిల్ల - సిద్ధిపేట - దుద్దెడ - జనగాం - సూర్యాపేట | 192 | మార్పులేదు |
| 8. | మంచిర్యాల - రెబ్బెన - ఆసిఫాబాదు - కెరామేరి - ఇంద్రవెల్లు - గుడిహత్నూర్ | 185 | మంచిర్యాల - రెబ్బెన - ఆసిఫాబాదు - చంద్రాపూర్ | 90 | ఆసిఫాబాదు - గుడిహత్నూర్ రిజర్వు అడవిలో ఉన్నందున మెరుగుపరచడం సాధ్యం కాదు. మహారాష్ట్రకి అనుసంధానాన్ని మెరుగుపరచాలని ప్రతిపాదించడమైంది. |
| 9. | వరంగల్ నుండి ఖమ్మం వరకు ఎన్‌హెచ్ 563 విస్తరణ | 120 | వరంగల్ నుండి ఖమ్మం వరకు ఎన్‌హెచ్ 563 విస్తరణ | 120 | మార్పులేదు |
| 10. | మద్నూర్ - కోటగిరి - రుద్రూర్ - బోధన్ - నిజామాబాదు | 75 | మద్నూర్ - కోటగిరి - రుద్రూర్ - బోధన్ - నిజామాబాదు | 75 | మార్పులేదు |
| 11 | భద్రాచలం - వెంకటాపూర్ | 115 | -- | | పోలవరం ప్రాజెక్టులో పాక్షికంగా ముంపు క్రింద వస్తున్నందున తొలగింపుకు ప్రతిపాదించడమయింది |
| | మొత్తం | 1391 | | 1473 | |
| | జగిత్యాల - మంచిర్యాల తొలగింపు | | | 73 | |
| | నికర పొడవు | 1391 | | 1400 | |

<u>అనుబంధం - సి</u>

| వరుస సంఖ్య | జాతీయ రహదారులుగా స్థాయిని పెంచడానికి ప్రతిపాదించిన రోడ్లు | పొడవు కి.మీ.లలో |
|---|---|---|
| 1. | హైదరాబాదు - సర్వాపూర్ - మెదక్ - ఎల్లారెడ్డి - బాన్సువాడ - బోధన్ - బాసర - భైంసా (ఎన్‌హెచ్ 61 వద్ద జంక్షన్) | 230 |
| 2. | నిజాంపేట్ - నారాయణఖేడ్ - బీదర్ సమీపాన ఎన్‌హెచ్ 161 జంక్షన్ (కర్ణాటకలో ఎన్‌హెచ్ 50 వద్ద జంక్షన్) | 50 |
| 3. | సూర్యాపేట్ - ఖమ్మం - అశ్వారావుపేట | 177 |
| 4. | ఖానాపూర్, మల్లాపూర్ రాయ్‌ఖల్ మీదుగా నిర్మల్ (ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 61 జంక్షన్) నుండి జగిత్యాల (ఎన్‌హెచ్ 63 వద్ద జంక్షన్) వరకు | 87 |
| 5. | మద్నూర్ (ఎన్‌హెచ్ 161 వద్ద జంక్షన్) - బోధన్ - నిజామాబాదు (ఎన్‌హెచ్ 63 వద్ద జంక్షన్) | 75 |
| 6. | హైదరాబాదు - మొయినాబాదు - చేవెళ్ళ - మన్నెగూడ - కొడంగల్ - కర్ణాటక సరిహద్దు (ఎన్‌హెచ్ 150 జంక్షన్ వరకు) | 133 |
| 7. | కోదాడ (ఎన్‌హెచ్ 65 వద్ద జంక్షన్) - మిర్యాలగూడ - దేవరకొండ - కల్వకుర్తి - జడ్చర్ల (ఎన్‌హెచ్ 44 వద్ద జంక్షన్) | 220 |
| 8. | కరీంనగర్ (ఎన్‌హెచ్ 563 వద్ద జంక్షన్) - సిరిసిల్ల - కామారెడ్డి - ఎల్లారెడ్డి - పిట్లం (ఎన్‌హెచ్ 161 వద్ద జంక్షన్) | 149 |
| 9. | మంచిర్యాల (ఎన్‌హెచ్ 63 వద్ద జంక్షన్) నుండి ఆసిఫాబాద్, రెబ్బెన మీదుగా మహారాష్ట్రలోని చంద్రాపూర్ వరకు | 90 |
| 10. | సిరిసిల్ల - సిద్దిపేట్ - జనగాం - సూర్యాపేట్ (ఎన్‌హెచ్ 65 జంక్షన్ వరకు) | 192 |
| 11 | వరంగల్ నుండి ఖమ్మం వరకు ఎన్‌హెచ్ 563 విస్తరణ (ఎన్‌హెచ్ 365 ఎ వద్ద జంక్షన్) | 120 |
| 12. | సారపాక (ఎన్‌హెచ్ 30 జంక్షన్) - ఏటూరునాగారం - తుపాకులగూడ - కాళేశ్వరం - చెన్నూర్ - కోటాల - సిరూన్చ | 330 |
| | మొత్తం | 1853 |

శ్రీ సబావత్ రాములు నాయక్ : తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల మొత్తం పొడవు 2573 కిలోమీటర్లని, వాటి అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని అలాగే State Highways 1400కిలోమీటర్లు అన్నారు. వీటిని ఎప్పటివరకు పూర్తి చేయగలుగుతారనే విషయాన్ని తెలియజేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

అలాగే ఇంతవరకు రోడ్లు లేనటువంటి మారుమూల ప్రాంతాలు కొన్ని ఉన్నాయి. కరీంనగర్, సిరిసిల్లా, ఎల్లారెడ్డి, తాడ్వాయి, నారాయణఖేడ్, బీదర్ తదితర ప్రాంతాల్లో చాలా చోట్ల రోడ్లు లేనటువంటి ప్రాంతాలున్నాయి. బీదర్–నారాయణఖేడ్‌కి ఇప్పటికీ రోడ్లు లేకవాహనాలు నడిచే

పరిస్థితిలో లేవు. ఇటువంటివి మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరుతున్నాను. అదేవిధంగా ఆదిలాబాద్, జైనా, బేలా, ఖెరామేరీ, ఆసిఫాబాద్, తిర్యాని, కాజీపేట్ మరియు బెల్లంపల్లి ఇవన్నీ ట్రైబల్ ప్రాంతాలు. మనకు స్వాతంత్ర్యం వచ్చి 60ఏళ్లు అయినప్పటికీ, వీటి పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. ఈ ప్రాంతాల్లో రోడ్లు బాగా లేక ఎమెర్జెన్సీగా ఆసుపత్రులకు వెళ్లేవారు మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఆదిలాబాద్, ఉట్నూర్, ఖానాపూర్, సూర్యాపేట లాంటి ప్రాంతాలలో రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. అదేవిధంగా కోదాడ, మిర్యాలగూడ, దేవరకొండ రోడ్లు మొత్తంగా చూసుకుంటే 4207కిలోమీటర్లు ఉంటాయి. జహీరాబాద్, తాండూర్, కొడంగల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, కొల్లాపూర్ రోడ్లను చూసుకుంటే 255కిలోమీటర్లు ఉంటుంది.

ఈ రోడ్లన్నీ దాదాపుగా అటు కర్ణాటక, ఇటు మహారాష్ట్ర బోర్డర్‌లో ఉంటాయి. ఇటువంటి రోడ్లను అప్పటి సమైక్య రాష్ట్రంలో పట్టించుకోలేదు. ఇప్పుడేమో మనది కొత్త రాష్ట్రం, 29వ రాష్ట్రం అని చెప్పుకుంటున్నాము. వీటిపై మంత్రివర్యులు శ్రద్ధ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జహీరాబాద్ లాంటి రోడ్లను మొదటి ప్రాధాన్యత క్రమంలో తీసుకొని బాగుచేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు : అధ్యక్షా, ఏవైతే ప్రతిపాదించామో ఆ లిస్టు సభ్యులకు ఇచ్చాము. ఏవైతే అప్రూవ్ చేశారో ఆ లిస్టు కూడా సభ్యులకు అందించడం జరిగింది. మనం ఏవైతే 4207కిలోమీటర్లకు ప్రతిపాదించామో, అందులో 1850కిలోమీటర్లకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అంగీకరించిన దానిమీద మనకి కేంద్ర ప్రభుత్వం నుండి లేఖ వచ్చింది. కానీ, ఇంకా గెజిట్ పబ్లికేషన్ చేయాల్సి ఉంది. 1850కిలోమీటర్లకు వరంగల్‌లోని సభకు గడ్కరీ గారు హాజరైనప్పుడు గౌరవ ముఖ్యమంత్రి గారి సమక్షంలోనే వారు అంగీకరించడం జరిగింది. సభ్యులు శ్రీ సబావత్ రాములు నాయక్ గారు అడిగినటువంటి బీదర్–నారాయణ ఖేడ్ రోడ్డుని మొన్నీమధ్యనే రూ.5కోట్లతో పూర్తి చేయడం జరిగింది. మిగతా దానికి కూడ డిపిఆర్ తయారు చేసి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువస్తాము. తెలంగాణలో జాతీయ సగటుకంటే తక్కువ ఉంది. అత్యల్పంగా ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రాన్ని ఈ సంవత్సరంన్నర కాలంలోనే జాతీయ సగటుకంటే పైకి తీసుకువెళ్లాం. 1850కిలోమీటర్లకు ఒకేసారి ఇవ్వడమనేది గతంలో ఎప్పుడూ జరగలేదు. గత పది సంవత్సరాల్లో 700కిలోమీటర్లు జాతీయ రహదారుల వస్తే, సంవత్సరంన్నర కాలంలోనే 1850కిలోమీటర్లకు కేంద్రం నుండి అనుమతి సాధించుకున్నామని గౌరవ సభ్యులకి మనవి చేస్తున్నాను.

మిగతా మిగిలిపోయినటువంటి ప్రధాన రహదారులు అంశాన్ని ఏవైతే సభ్యులు చెప్పారో వాటిమీద కూడా కేంద్ర ప్రభుత్వం వద్ద ఒత్తిడి తీసుకువచ్చి తప్పకుండా 4207కిలోమీటర్లు జాతీయ రహదారులుగా ప్రకటింపజేస్తామని గౌరవ సభ్యులకి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ నారదాసు లక్ష్మణ్ రావు : అధ్యక్షా, హైదరాబాద్ నుండి కరీంనగర్ వరకు ఉన్నదొక్కటే రహదారి. రాజీవ్ రహదారి హైదరాబాద్ నుండి కరీంనగర్‌కి రైలు సౌకర్యం కూడా లేదు. రాజీవ్ రహదారి 389మలుపులతోటి అనేక deep curvesతో ఉన్నది. రాజీవ్ రహదారి మీద చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రాజీవ్ రహదారిని ఆధునీకరించడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉన్నదా? ఈ మలుపులను ఆధునీకరించి straightగా చేయడానికి ప్రభుత్వం వద్ద ఏమైనా ఆలోచన ఉన్నదా? అని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కె.యాదవ రెడ్డి (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఈ రాజీవ్ రహదారిపైన ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు పెద్ద allegationsతో సభ దద్దరిల్లిన తరువాత ఒక హౌజ్ కమిటీని వేయడం జరిగింది. ఆ కమిటీకి గౌరవ సభ్యులు శ్రీ టి.భానుప్రసాద్ గారు ఛైర్మన్‌గా ఉండేవారు. తరువాత ఆ కమిటీ ఏమైంది? ఆ రహదారి వెంబడి ఎన్నిసార్లు పర్యటించి inspection చేశారు? దాని నివేదికను ప్రభుత్వానికి అందజేశారా? ఆ నివేదికపైన ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకున్నారా? ఇంతవరకు సభ్యులకి వివరించలేదు. మీద్వారా గౌరవ మంత్రివర్యులను వివరణ ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు : అధ్యక్షా, ఈ రహదారి మీద గతంలో సాక్షాత్తు శాసనసభలో కూడా చర్చకు వచ్చింది. దాని గురించి అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి శ్రీ కె. రోశయ్య గారికి అప్పుడు ఉద్యమ నాయకుడిగా ఉన్నటువంటి ప్రస్తుత గౌరవ ముఖ్యమంత్రి గారు శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు లేఖ వ్రాయడం జరిగింది. అయినా సరే వారు నిర్మాణం పూర్తి చేశారు. అవకతవకలున్న మాట వాస్తవం, ఇబ్బందులు జరుగుతున్న మాట వాస్తవం. దానిమీద గౌరవ సభ్యులు శ్రీ భానుప్రసాద్ గారి నేతృత్వంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరిగింది. తప్పకుండా దానిని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు డిపిఆర్ తయారు చేస్తున్నాము. ఆ కమిటీ ఏదైతే సూచనలు చేసిందో, ఆ సూచనలకు అనుగుణంగా ఆ రహదారిని సుమారు రూ.800కోట్లతో మళ్లీ బైపాస్‌లు గానీ, ఫ్లైఓవర్లు గానీ, ఎక్కడైతే ఇబ్బందులున్నాయో ఆ ఇబ్బందులన్నింటిని సరిచేయడానికి ప్రభుత్వం పరిశీలిస్తుందని గౌరవ సభ్యులకి మనవి చేస్తున్నాను.

మిస్టర్‌చైర్మన్ : ప్రశ్న నెం.1247(28) సభ్యుడి కోరిక మేరకు వాయిదా వేయడం అయింది.

### ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల నియామకం

ప్రశ్న నెం. 1303(29)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి(విద్య) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మంజూరైన ఫిజికల్ డైరెక్టర్ పదవులెన్ని ; వాటిలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ల సంఖ్య ఎంత;

ఆ) ఖాళీ పదవులలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న వ్యక్తుల సంఖ్య ఎంత;

ఇ) ఫిజికల్ డైరెక్టరు ఖాళీ పదవులను భర్తీ చేయడానికి తీసుకుంటున్న చర్యల వివరాలేమిటి?

గౌరవనీయులైన విద్యా శాఖ ఉప ముఖ్యమంత్రి (శ్రీ కడియం శ్రీహరి):- అ) రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 254 ఫిజికల్ డైరెక్టరు (పిడిలు) పదవులను మంజూరు చేయడమైంది. వాటిలో 27 మంది ఫిజికల్‌డైరెక్టర్లు (పిడిలు) పని చేస్తున్నారు.

ఆ) ఎవరూ లేరండీ.

ఇ) 227 ఖాళీలలో 30 శాతాన్ని నేరుగా నియామకానికి ఉద్దేశించడమైంది. వీటిలో 68 పదవులను పబ్లిక్ సర్వీసు కమీషన్ ద్వారా నియమించవలసి ఉంటుంది. మిగిలిన 70శాతం ఖాళీలను పదోన్నతులకు ఉద్దేశించినవి. సర్వీసు నియమావళికి సవరణలు అవసరమైనందున ఈ ఖాళీలను భర్తీ చేయలేదు. ఇది పురోగతిలో ఉంది.

12.00 మ. శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ప్రశ్నకు సంబంధించిన సమాచారమంతా నిర్దిష్టంగా సేకరించాను. నాకు ఆ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన సమాచారం ప్రకారంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లావారీగా 230 పోస్టులు మంజూరైనాయి. అందులో ఆదిలాబాద్‌లో 34 పోస్టులు, కరీంనగర్‌లో 27 పోస్టులు, ఖమ్మంలో 29 పోస్టులు, మహబూబ్‌నగర్‌లో 42 పోస్టులు, మెదక్‌లో 21 పోస్టులు, నల్గొండలో 22 పోస్టులు, నిజామబాద్‌లో 19 పోస్టులు, రంగారెడ్డిలో 8 పోస్టులు, వరంగల్‌లో 28 పోస్టులు మొత్తంగా 230 పోస్టులు మంజూరు కావడం జరిగింది. అంత మందికి గానూ, 22 మంది ఫిజికల్ డైరెక్టర్లు పని చేస్తున్నారు.

గతంలో ఉన్నటువంటి పాలకులందరు కూడా తెలంగాణ ప్రాంతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదనేటువంటి దృక్పథంతో ఏ కళాశాలల్లో కూడా ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు లేకుండా చేసినటువంటి పరిస్థితి ఉంది. అంతేకాకుండా, హైదరాబాద్‌లోని దోమలగూడలో 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నటువంటి ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఎంపిడి, బిపిడి, యుజిడి కోర్సులు నిర్వహించబడుతుండేది. ఈ రోజు ఆ కళాశాలలో ఒక్క పోస్టు కూడా లేనటువంటి ఉదంతం ఉన్నది. అసలు ఈ ప్రభుత్వ విధానంలో ఫిజికల్ డైరెక్టర్‌లనెవ్వరిని నియామకం చేయవద్దని ఏమైనా ఉన్నదా? లేదా? ఈ ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉంటే సరైన సమాధానం ఇవ్వాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్ : అధ్యక్షా, ఇప్పుడున్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చాలా పోస్టులకు క్యాండిడేట్స్ లేక ఖాళీగా ఉన్నాయి. గతంలో జి.ఓ.యం.యస్ నెం.302 ఉండేది. 40 శాతం కోటాలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను జూనియర్ లెక్చరర్స్‌గా పదోన్నతి కల్పించేది. గత ప్రభుత్వ హయంలో దొంగ జి.ఓ.యం.యస్ నెం.223 తీసుకొచ్చి 40 శాతం కోటాను ఆపడం జరిగింది. ఆ జి.ఓ.ను ఎక్కడ కూడా ఆన్‌లైన్‌లో పెట్టలేదు. ఇంతవరకు దానిని పునరుద్ధరించలేదు. మేము చాలా సార్లు రిప్రజెంట్ చేయడం జరిగింది. అందులో భాగంగానే ఇప్పుడు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇందులో 22 మంది ఫిజికల్ డైరెక్టర్లు పని చేస్తూ, 208 పోస్టులు ఖాళీగా ఉండడమనేది ఇబ్బందికరమైనది. దయచేసి ఫిజికల్ డైరెక్టర్లతో పాటు, అన్ని సబ్జెక్టులకు కూడా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఇచ్చి, జూనియర్ లెక్చరర్స్‌గా భర్తీ చేస్తే బాగుంటుంది. అలాగే మనం ఫిజికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థను బాగుచేసుకోవాలి. మనం 50 యేళ్లు దాటిన తరువాత వాకింగ్ మీద దృష్టి పెడుతున్నాము. కానీ చదువుకునే సమయంలో మాత్రం పిల్లలకు వ్యాయామ ఉపాధ్యాయులను అపాయింట్ చేసే విషయంలో ఒక నిర్దిష్టమైన ఆలోచన చేయాలని తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి, ఉప ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, పూల రవీందర్ గారు అడిగిన ప్రశ్నకు సమాధానం ఏంటంటే, గతంలో జి.ఓ.యం.యస్ నెం.302 ఉండేది. దాని ప్రకారం ఫిజికల్ డైరెక్టర్లు, జూనియర్ లెక్చరర్స్‌ల నియామకాలకు నేరుగా రిక్రూట్‌మెంట్ ద్వారా 50 శాతం, స్కూల్ అసిస్టెంట్స్, పిఇటిలకు 40 శాతం, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి 10 శాతంతో ప్రమోషన్స్ ఇచ్చే వారు. అయితే ఇది ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు భిన్నంగా ఉందనే ఉద్దేశ్యంతో కొంత మంది సుప్రీం కోర్టుకు వెళ్లడం జరిగింది. అప్పుడు సుప్రీం కోర్టు, ఇది ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు అనుకూలంగా లేదని జి.ఓ.ను కొట్టివేస్తున్నామని, ఆర్డర్ ఇచ్చిన తరువాత జి.ఓ.యం.యస్. నెం.223ని విడుదల చేయడం జరిగింది. దీని ప్రకారం ఇవ్వాళ జూనియర్ లెక్చరర్స్‌కు గానీ, ఫిజికల్ డైరెక్టర్స్‌కు గానీ నేరుగా రిక్రూట్‌మెంట్ ద్వారా 90 శాతం, లోకల్ క్యాడర్ ద్వారా 10 శాతం ప్రమోషన్స్ ఇవ్వడానికి మాత్రమే జి.ఓ నిర్దేశించబడినది.

గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు చెప్పినట్లుగా, ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను నిర్లక్ష్యం చేయాలన్న ఆలోచన ఏ మాత్రం కూడా ప్రభుత్వానికి లేదు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన బిడ్డలు అనేక మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ ఆటలలో ప్రతిభ, పాటవాలను కనబరుస్తున్న వారందరిని గౌరవ ముఖ్యమంత్రి గారే స్వయంగా పిలిచి, సన్మానం చేసి, ప్రభుత్వపరంగా క్యాష్ అవార్డ్స్ ఇస్తున్న సంగతి ఈ సందర్భంగా వారి దృష్టికి తీసుకొస్తున్నాను. కాకపోతే అన్ని ప్రభుత్వ కళాశాలల్లో, జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్స్‌ని, పిఇటిలను నియామకం చేసుకోవాల్సిన అవసరముంది.

వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఉన్నది. అందువల్ల ఉన్నటువంటి ఖాళీలను భర్తీ చేయవల్సిన అవసరముందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అదేవిధంగా రేపు ప్రకటించబోయే డిఎస్‌సిలో నోటిఫికేషన్ పిఇటికి, సంబంధించి ఖాళీలు ఏవైతే ఉన్నాయో, వాటన్నింటికి కూడా భర్తీ చేసుకోబోతున్నాము. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీ కోసం ఆర్థిక శాఖ యొక్క అనుమతి కొరకు లేఖ రాయడం జరిగింది. ఆ అనుమతి రాగానే పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేస్తామని, తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, సుమారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 208 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 30 సంవత్సరాల నుండి ఖాళీగా ఉన్నాయి. మొదటి నుండి ఈ ఖాళీలను పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఎందుకు భర్తీ చేయలేకపోతున్నాం. నేను నేరుగా రిక్రూట్‌మెంట్ గురించే అడుగుతున్నాను. నాకున్న సమాచారం ప్రకారం, నేను ఈ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా ఉన్నప్పుడు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీ కొరకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది.

ఈ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న అలసత్వం ఏమిటంటే, ఒక దానిని చూసి అన్వయించుకొని, దీనిని కూడా భర్తీ చేయకుండా ఉండే పరిస్థితి వచ్చింది. మా ఉద్దేశ్యం ఏమిటంటే, గత ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఇక్కడున్నటువంటి కళాశాలలను నిర్వీర్యం చేస్తూ వచ్చారనేదే మా ఆరోపణ. ఇప్పుడున్న ప్రభుత్వం ఆ విధంగా లేదు. కాబట్టి ఖాళీలను భర్తీ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు చాలా అధ్యయనం చేసి మాట్లాడారు. దీంట్లో ప్రభుత్వం దాచుకోవాల్సిన అంశాలు ఏమి లేవు. ప్రభుత్వ పాఠశాలలో గానీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గానీ వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు ఏవైతే ఉన్నాయో, వాటిని భర్తీ చేస్తామని చెబుతున్నాను. డిఎస్‌సి ద్వారా పిఇటి పోస్టులు, ఫిజికల్ డైరెక్టర్స్ పోస్టులను నేరుగా పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నియామకం చేయవల్సిన అవసరమున్నది. గత ప్రభుత్వాలు ఏమేమి చేశాయనే వివరాలలోకి వెళ్లకుండా, వ్యాయామ ఉపాధ్యాయుల విషయంలో ఆర్థిక శాఖ యొక్క అప్రూవల్ తీసుకొని మన ప్రభుత్వం తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న పిఇడి పోస్టులను భర్తీ చేస్తామని, ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : ప్రశ్న నెం.1237 సభ్యుడి కోరిక మేరకు వాయిదా వేయడమైనది.

## 2. సభా కార్యక్రమం

### అ. ప్రత్యేక ప్రస్థావన

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, మీ ద్వారా ప్రభుత్వానికి, మంత్రివర్యుల దృష్టికి తీసుకొచ్చేది ఏమిటంటే, ఈ టెర్రరిస్ట్ దాడుల వలన ముఖ్యంగా గోకుల్‌చాట్ బాంబు బ్లాస్ట్ గానీ, దిల్‌సుఖ్‌నగర్ బాంబు బ్లాస్ట్ విషయంలో నష్టపోయిన వారి కుటుంబాలు చాలా సంవత్సరాలుగా అనేక అర్జీలు పెట్టుకుంటున్నారు. యస్.కె. రహీమ్ అనే వ్యక్తి గోకుల్‌చాట్ బాంబు బ్లాస్ట్ బాధితుడు. అతనికి ఒక కన్ను పోయింది. దాదాపు 20-30 లక్షలు ఖర్చయింది. వాళ్లు చాలా బాధల్లో ఉన్నారు. అనేక విజ్ఞప్తులు చేశారు. ఇంకొకరు చందర్ నాయక్ అనే అతను లంబాడి తండా బాగ్‌లింగంపల్లికి చెందినవాడు. అతను కూడా ఒక కన్ను పోగొట్టుకున్నాడు. 25 లక్షలకు పైగా ఖర్చయింది.

ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి, హోంమంత్రిగారి దృష్టికి, పోలీస్ అధికారుల దృష్టికి కూడా తీసుకురావడం జరిగింది. వారు ఏదో సబ్‌కమిటీ రిపోర్ట్ అంతా వచ్చిన తర్వాత చేస్తామన్నారు. ఇప్పటికే కాలాతీతమైంది. ఎందుకంటే విధి వైపరీత్యమో ఏమో, చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. కాబట్టి వారిని ఆదుకోవాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వానికి ఉంది. అందుకని, ఆ కుటుంబాలకు ఒక ఉద్యోగం, కొంత ఆర్థిక సహాయం చేయాలని మీ ద్వారా స్పెషల్ మెన్షన్ రూపంలో మెన్షన్ చేస్తూ, ఈ ఇద్దరే కాకుండా, ఇంకా కొంతమంది దిల్‌సుఖ్‌నగర్, గోకుల్‌చాట్ బాంబు బ్లాస్ట్ బాధితులు ఉన్నారు. ఇటీవల చాలా మంది ఈ బాంబు బ్లాస్ట్‌లో జరిగిన సంఘటన గురించి ధర్నా చేయడం జరిగింది. ఈ రెండు బాంబు బ్లాస్ట్‌ల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆశిస్తూ, మీ ద్వారా న్యాయం జరగాలని కోరుకుంటున్నాను.

(ప్రత్యేక ప్రస్థావనను అధ్యక్షుల వారికి అందజేయడం జరిగింది)

### (ఆ) వాయిదా తీర్మాన తిరస్కరణ

మిస్టర్ ఛైర్మన్ : యన్. రామచంద్ర రావు గారి వాయిదా ప్రతి పాదన. విద్యా సంస్థలచే నిర్వహింపబడుతున్న వాహనాల భద్రత లోపాలు. ముఖ్యంగా డ్రైవర్‌లు మద్యం మత్తులో వాహనాలు నడపడం. అదేవిధంగా విజయవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మెడికోల దుర్మరణం పట్ల వెంటనే చర్చించాలంటూ, ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

(టీ విరామం కొరకు సభను 10 నిమిషాలు వాయిదా వేయడమైనది.)

12.20 మ. ('టీ' విరామం అనంతరం సభ మధ్యాహ్నం 12.32 ని. కి ప్రారంభమయింది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

# ITEM NO.III

## 2016-17 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై సాధారణచర్చ.

మిస్టర్ ఛైర్మన్: బడ్జెట్‌పై సాధారణ చర్చను ప్రారంభించవలసిందిగా ప్రతిపక్షనాయకులు శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్ గారిని కోరుచున్నాను.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్: అధ్యక్షా, 2016-17వ సంవత్సరపు బడ్జెట్‌పై చర్చలో మాట్లాడటానికి నాకు అవకాశం కల్పించినందుకు మొదటగా మీకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మొన్న సోమవారం నాడు శాసన సభలో ఆర్థిక శాఖా మంత్రి శ్రీ ఈటల రాజేందర్‌గారు ప్రవేశపెట్టిన 2016-17 బడ్జెట్‌ను రూ.1,30,000 కోట్లతో రూపొందించడం జరిగింది. భారతదేశంలో మొట్టమొదటిసారిగా ప్రణాళికా వ్యయం మొత్తం బడ్జెట్‌లో 51%గా అంచనా వేసారు. గతంలో ఎప్పుడైనా దేశంలో ఏ రాష్ట్రంలోనైనా Plan Expenditure బడ్జెట్‌లో 35-40% వరకే చూపడం జరుగుతూ ఉంటుంది. కానీ ఇక్కడ రూ.67,630 కోట్లు ప్లాన్ బడ్జెట్ ఉంటే, నాన్-ప్లాన్‌లో రూ.62,785 కోట్లు చూపించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూడా 2004-2009 మధ్య కాలంలో ఇంత భారీ స్థాయిలో ప్లాన్ బడ్జెట్ కేటాయించలేదు. ఎప్పుడూ కూడా Plan Expenditure 35-40%కి మించలేదు. కాని ఈ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్లాన్ వ్యయాన్ని ఇంత భారీ మొత్తంగా, అంటే 51%గా అంచనా వేయడం అనేది చాలా సాహసోపేతంగా ఉందని నేను భావిస్తున్నాను. ఇందుకు మిమ్మల్ని అభినందించాలో, లేక మీ పట్ల జాలి పడాలో నాకు అర్థం కావడం లేదు.

ఎందుకంటే ఒకసారి గతాన్ని గుర్తుచేసుకుంటే 2014-15వ సంవత్సరానికి సంబంధించి, పది నెలల కొరకు లక్షకోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. అందులో Grant-in-Aid క్రింద రూ.21,721 కోట్లు వస్తాయని అంచనా వేసారు. అప్పుడు మేము చెప్పాము 2012-13వ సంవత్సరానికి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కేవలం రూ.7,500 కోట్లు మాత్రమే వచ్చింది. 2013-14లో రూ.8,990 కోట్లు మాత్రమే Grant-in-Aidగా వచ్చింది. మరి ప్రస్తుతం రూ.21,000 కోట్లు పెట్టారు. ఇది కరెక్టు కాదు అని మేము చెబితే, ఇది కొత్త రాష్ట్రం, మాకు అవకాశం ఉన్నదని మీరు చెప్పినారు. అయితే ఇప్పుడు మేము చెప్పిందే జరిగింది. మీరు రూ.21,721 కోట్లు అంచనా వేసారు కాని, వాస్తవంగా మనకు వచ్చింది రూ.8,000 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే దాదాపు రూ.14,000 కోట్ల వరకు మనకు రాలేదు.

ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి బడ్జెట్ సమావేశంలోనే మేము చాలా క్లియర్‌గా ఈ గ్రాంట్ మీకు రాదు అని చెప్పడం జరిగింది. ఆ నాడు మేము చెప్పిందే ఇప్పుడు వాస్తవంగా జరిగింది. చివరికి మీ అంచనాలు తప్పాయి. అదే విధంగా Non-Tax Revenue Accountలో భూములను అమ్మడం ద్వారా రూ. 13,240 కోట్ల ఆదాయం సమకూరుతుందని మీరు అంచనా వేసారు. ఆఖరికి ఇది కూడా వాస్తవం కాకుండా పోయింది. నిజానికి భూములు అమ్మగా మనకు వచ్చింది రూ. 6,446 కోట్లు మాత్రమే. ఇక్కడ కూడా మీ అంచనాలు నిజం కాలేదు. మీరు అంచనా వేసిన ఆదాయంలో దాదాపు రూ.7,000 కోట్లు తగ్గిపోయింది.

అదే విధంగా 2014-15వ సంవత్సరానికి వస్తే మీరు రూ.35,000కోట్లు అంచనా వేస్తే, వాస్తవంగా వచ్చింది మాత్రం రూ.29,000 కోట్లు. మొత్తం మీద మీరు వేసిన రూ.80,000 కోట్ల అంచనాలకుగాను రూ.51,000 కోట్లు మాత్రమే వచ్చింది. దాదాపు రూ.30,000 కోట్లు మీరు అంచనా వేసిన దానికంటే తక్కువగా వచ్చింది. రూ.10,000 కోట్లకు మించి అప్పులు తేవడం సాధ్యం కాదని ఆనాడే చెప్పాము. వాస్తవానికి మీరు అప్పులు సేకరించింది రూ.9,410 కోట్లు మాత్రమే. మొత్తం కలిపి చూసినట్లయితే 2014-15వ సంవత్సరానికి రూ.1,00,000 కోట్లకి బదులు, రూ.62,000 కోట్లు మాత్రమే మీరు ఖర్చు పెట్టగలిగినారు. మేము చెబుతున్నా మీరు వినకుండా బడ్జెట్‌ను పెద్దపెద్ద అంచనాలతో

రూపొందించినారు. వాస్తవంగా సాధ్యపడని భారీ అంచనాలు వేసి మీరు ప్రజలను మభ్యపెడుతున్నారు.

2015-16వ సంవత్సరంలో కూడా రూ.1,16,000 కోట్లతో మీరు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది. అప్పుడు కూడా మేము ఇదే హౌజ్‌లో ఎక్కువలో ఎక్కువ రూ.90,000 కోట్లకు మించి మీరు సాధించగలిగేది ఏమీ ఉండదని చెప్పాము, కాని మీరు విన లేదు.

12.40 మ. మాది ధనిక రాష్ట్రం, మాది పెద్ద బడ్జెట్ అంటే నష్టం తప్ప లాభం లేదు. కేంద్రం నుండి డబ్బు రావడం లేదు, దీనివల్ల నష్టం అవుతుంది. అందుకని మేము చెప్పింది నిజమైనది కాబట్టే ఈ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో 14 శాతం వరకు బడ్జెట్ అంచనాలు తగ్గించగలిగారు. ఈ 14 శాతం తగ్గించడంలో విచిత్రం ఏమిటంటే రూ.1.15 లక్షల కోట్లు. ఇది చాలా ఆలోచించవలసిన విషయం. మనకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న70-80 శాతం యస్సీ, యస్టీ, బీసి, మైనారిటీ వాళ్లు ఎక్కువగా ఉన్నారు. అలాంటి సంక్షేమ కార్యక్రమాలలో ,రూ. 15,000 కోట్ల నుండి రూ. 6,800 కోట్లు సంక్షేమరంగంలో తగ్గించారు. వేరే దానిలో తగ్గించినా సరే చుద్దాంలే అనేవాడిని కాని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో కేటాయించిన డబ్బులో యస్సీ, యస్టీ సబ్ ప్లాన్, బీసిలు, ఉమెన్, మైనారిటీ వెల్ఫేర్, సంక్షేమ పథకాలు వంటి వాటి నుండి రూ.6,800 కోట్లు తగ్గించారు. దానివల్ల ఈ రాష్ట్ర ప్రజలకు తీవ్రంగా నష్టం జరిగింది.

హౌజింగ్ : 2016 – 17లో రూ. 1.30 లక్ష కోట్లు బడ్జెట్‌లో పెట్టడం జరిగింది. మరి ఈ బడ్జెట్‌లో కూడా ఈ ప్రభుత్వం ప్రణాళికా వ్యయానికి సంబంధించి రూ.68,000 కోట్లు అంచనా వేసారు. దీనిమీద వచ్చే సంవత్సరం లోతుగా చర్చించవచ్చు. ఇప్పుడు 68శాతానికి పోలేము. ప్లాన్‌లో అంత డబ్బు రాదు. రూ.1.15 లక్ష కోట్ల కంటే ఎక్కువ పోలేము ఆన్ రికార్డు ద్వారా తెలియజేసుకుంటున్నాను. ప్రభుత్వ అంచనా తప్పు అవుతుంది. దీనిలో కూడా మనం 1.05 శాతం కంటే ఎక్కువ పోలేము.

మరొక ముఖ్యమైన విషయం జి.యస్.డి.పిలో 11.77శాతం గ్రోత్‌రేటుగా చూపించారు. దీని గురించి గొప్పలుగా చెప్పారు ఇది ఎంత వరకు వాస్తవం. ఎందుకంటే ఫైనల్ అసెస్‌మెంటు వచ్చిన తరువాత దాని గురించి రెండు సంవత్సరాల తరువాత మాట్లాడుకుందాం. కాని కేంద్రప్రభుత్వానిది నేషనల్ యావరేజ్ 7.6 శాతంగా ఉంది. ఇది 2015-16 నాటికి 7.5 శాతం ప్రకటించారు. కాని మనం మాత్రం 11.77శాతం పెట్టుకున్నాము. ఇది కూడా వాస్తవాలకు భిన్నంగా ఉంది. 5.6 శాతం కంటే కూడా ఈ జి.యస్.డి.పి ఎక్కువ రాదని మా అంచనా ప్రకారం తెలియజేస్తున్నాము. మా అనుభవం ద్వారా చెబుతున్నాము ఇది కరెక్ట్ కాదు.

ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్: దీనికి రూ.25,000 కోట్లు కేటాయించారు. దీనిని ఎలా ఖర్చు పెడతారు? గత సంవత్సరం రూ.6,000 కోట్లు ఖర్చు పెట్టారు. ఇప్పుడు రూ. 25,000 కోట్ల కేటాయింపులో చాలా అనుమానాలు ఉన్నాయి. దీనిని హెడ్స్‌లో పెట్టి గత సంవత్సరం దానిలో తగ్గించుకుంటారా? అలాగే ప్రాణహిత-చేవెళ్ల విషయానికి వస్తే మహారాష్ట్రతో ఎలాంటి ఒప్పందాలు లేవని ముఖ్యమంత్రిగారు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వేరే రాష్ట్రం అయ్యింది, మనది కొత్త రాష్ట్రం కాబట్టి మహారాష్ట్రతో ఒప్పందం చాలా అవసరం. దీనిని అగ్రిమెంట్ చేస్తున్నారు. దీనికి నేను కూడా సంతోషిస్తున్నాను. గతంలో చెప్పారు అగ్రిమెంటు అయ్యిందని తుమ్మిడిహట్టీ, గాని మేడిగడ్డ గాని వీటి మీద చర్చిస్తామన్నారు కాబట్టి వీటి గురించి ఎక్కువ మాట్లాడను. ప్రాణహిత చేవెళ్ల, రంగారెడ్డి జిల్లాలో3లక్షల ఎకరాలకు కొత్త ప్లాన్‌లో లేదని, తుమ్మిడిహట్టీలో148-150 అడుగుల ఎత్తు వరకు అవి ఏవి ప్లాన్‌లో లేవని , ముఖ్యమంత్రిగారు చర్చకు పెట్టారు. దానిని పరిష్కరిస్తున్నామని గతంలో చర్చలు చేపడతామన్నారు, చేపట్టడం లేదు. చివరలో హౌజ్ అడ్జర్న్ అవుతుంది. ఈసారి 29వ తారీఖున చేపట్టాలని కోరుకుంటున్నాను.

మిషన్ భగీరథ: త్రాగునీరు విషయంలో రాష్ట్రప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో పెట్టలేదు. కాని

రూ.40,000 కోట్లు నాబార్డ్, హడ్కో, ఏ బ్యాంక్ నుండి ఐనా తీసుకొస్తామని చెప్పారు. ఎఫ్.ఆర్.బి.యమ్ ప్రకారం మనకు రూ.3,000 కోట్ల వరకే వస్తాయి. మనంరూ.24,000 కోట్లు లోన్ తీసుకొస్తున్నాం అన్నారు మరి వీటిని ఏవిధంగా తీర్చగలుగుతారు? ఎందుకంటే వాటర్‌గ్రిడ్‌లో రెవెన్యూ నామినల్‌గా ఉంటుంది. మనం పెట్టుబడి పెట్టాలి, జనాలకు వాటర్ సప్లై చెయ్యాలి, కాని పెట్టిన దానిలో నుండి దాదాపు 5 శాతం కూడా టాక్స్ రాదు ఇది అందరికి తెలిసినదే. మనం లోను మీద తీసుకొచ్చిన తరువాత దీనిని ఏ విధంగా తీర్చగలుగుతారు.

హౌజింగ్ః మార్చి నుండి మార్చి నాటికి ఒక లక్ష ఇండ్లు అర్బన్‌లో, మరొక ఒక లక్ష ఇండ్లు రూరల్‌లో కట్టిస్తామని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మరి వీటికిరూ.12,000 కోట్లు, మరియు రూ. 3,000 కోట్లు లైన్స్‌కు మొత్తం రూ. 15,000 కోట్లు. ఈ రూ.15,000 కోట్లు మరియు వాటర్‌గ్రిడ్‌కు రూ.35,000 కోట్లు మొత్తం రూ.55,000కోట్ల అప్పు తీసుకొస్తామంటున్నారు ఒక్క సంవత్సరంలో రీపేమెంట్ ఎట్లా? అప్పుల భారంలో ఈ రాష్ట్రం కూరుకుపోతే ఎట్లా? మనం అందరం బాధితులం అవుతాము. ఎందుకంటే హౌజింగ్ లో కూడా మీకు రెవెన్యూ వసూలు లేదు. మీరు వీటిని ఫ్రీగా ఇస్తున్నారు. ఫ్రీగా ఇస్తున్నప్పుడు రెండు సంత్సరాలు మారటోరియమ్ ఉంటుంది. రెండు సంవత్సరాలు మారటోరియమ్ పోయిన తరువాత మొత్తం7వేల కోట్ల రూపాయలు సంవత్సరానికి ఇంట్రస్ట్‌తో కట్టాలి. 2018 తరువాత ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎలా కడతారు? రెవెన్యూ లేదు, రీపేమెంట్ రాదు. మొత్తంగా బీదవాళ్లకు ఇచ్చే కార్యక్రమం ఉంది. ఇది మంచిదే కాని రూ.55,000 కోట్లు ఒక్క సంవత్సరానికి, వచ్చే సంవత్సరం రూ. 15 వేల కోట్ల ఎందుకంటే ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ లో ప్రతి సంవత్సరం 2 లక్షలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టాలంటున్నారు. ఇదేవిధంగా అప్పులు చేసుకుంటు పోతే గవర్న మెంట్ ఆఫ్ ఇండియా పర్మిషన్ లేకుండా స్టేట్ గవర్నమెంట్ గ్యారంటీతో డబ్బు తీసుకుంటున్నారు. మరి ఈ విషయంలో ఈటల రాజేంద్రగారు మంత్రిగారిని మీద్వారా అడుగుతున్నాను వీటిని ఎలా తీసుకుంటున్నారు? ఏబ్యాంక్‌లో ఎంత ఇంట్రెస్ట్‌తో తెస్తారు? దీనికి రీ పేమెంట్ ఎలా తీరుస్తారు? దీనిని ప్రజల మీద టాక్స్ వేసి వసూలు చేస్తారా? మరి ఎవరి మీద వేస్తారు,ఈ టాక్స్ గవర్న మెంట్ ఆఫ్ ఇండియా నుండి గ్రాంటుగా ఎక్కువ తీసుకొస్తారా?

12.50 మ. రెవెన్యూ రాదు, రీపేమెంటు ఉండదు. పేదవాళ్లకి సంబంధించి ఇదొక బ్రహ్మాండమైన కార్యక్రమం. ఇంత ధైర్యం చేసి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క సంవత్సరానికే రూ.55,000 కోట్ల అప్పు చేస్తోంది. మళ్లీ వచ్చే సంవత్సరం రూ.15,000 కోట్లు కావాలి. 2016-17లో రెండు లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కడతామంటున్నారు. ఈ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాముకి ప్రతి సంవత్సరమూ రూ.15,000 కోట్ల అప్పులు చేసుకుంటూ పోతున్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులు లేవు. ఇంత పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీతో ఇంత పెద్ద ఎత్తున మీరు అప్పులు తీసుకుంటున్నారు. నేను ఈసందర్భంగా ఫైనాన్స్ మినిస్టర్‌గారిని డిమాండ్ చేస్తున్నాను. ఈ అప్పులను ఎలా తీసుకొస్తున్నారు? ఏ, ఏ బ్యాంకులలో ఎంతెంత ఇంట్రెస్ట్‌కి తీసుకొస్తున్నారు? తిరిగి ఎలా రీపేమెంటు చేయబోతున్నారు? ప్రజల మీద ట్యాక్సులు వేసి వసూలు చేస్తారా? ప్రతి సంవత్సరమూ రూ.7,000 కోట్లు పేమెంటు చేయాలంటే ఎవరి మీద భారం వేస్తారు? గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఎక్కువ తీసుకుంటారా? అప్పుల భారం ఎవరి మీద వేస్తారు? ఈ బడ్జెటులో చర్చించవలసిన పాయింట్స్ ఎక్కువగా ఇవే ఉన్నాయి.

ఇకబోతే ఎనర్జీ గురించి అందరూ చెబుతున్నారు. గత ఒకటిన్నర సంవత్సరం నుండి ముఖ్యమంత్రిగారు అటు వ్యవసాయానికి , కమర్షియల్ పర్పస్‌కి, పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా చేశారని చెబుతున్నారు. యస్, చేశారు. దాన్ని ఎవ్వరూ కాదనలేరు, సూర్యుడిని సూర్యుడు కాదు అని చెప్పలేము . కానీ ఒకసారి హిస్టరీ ఆలోచన చేయాలి. యుపిఏ-1 మరియు 2 ప్రభుత్వ హయాములో దేశం మొత్తంలో పవర్ 30శాతం డెఫిసిట్ ఉండేది. యు.పి.లో 12గంటలు, ఢిల్లీలో 6గంటలు పవర్ కట్ ఉండేది. అలాంటిది యుపిఏ అధికారంలో ఉన్న 2014 నాటికి, ఎనిమిది

సంవత్సరాలలో 45వేల మెగావాట్లు అదనంగా కరెంటు భారతదేశంలో వచ్చింది. ఆరోజు మహారాష్ట్రలో మనకంటే ఎక్కువ పవర్ కట్ ఉండేది. ఈరోజు వాళ్లు మేము 24గంటలూ ఇస్తున్నామని అన్నారు. అదే విధంగా ఆనాడు మనకంటె ఎక్కువగా తమిళనాడులో పవర్ కట్ ఉండేది. ఇప్పుడు నూరు శాతం పవర్ ఇస్తున్నామని వాళ్లంటున్నారు. కర్నాటక, కేరళలో కూడా అలాగే అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ వాళ్లయితే – మాదగ్గర సర్‌ప్లస్ ఉంది, కొనే వాళ్లుంటే అమ్మడానికి సిద్ధంగా ఉన్నామంటున్నారు. యుపిఏ-1 మరియు 2 హయాములో తీసుకున్న నిర్ణయాల వల్ల ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయంటే, కాంగ్రెస్ ప్రభుత్వంలో నేను పవర్ మినిస్టర్‌గా ఉన్నపుడు 2007లో కొత్తగూడెంలో 500 మెగావాట్ల ప్రాజెక్టుకి ఫౌండేషన్ వేశాం . దాని నుంచి గత సంవత్సరం ఉత్పత్తి ప్రారంభమైంది. 2008లో భూపాల్‌పల్లిలో 600 మెగావాట్ల ప్రాజెక్టుకి ఫౌండేషన్ వేశాం, మూడు మాసాల క్రితం అది కమిషన్ అయింది. అలాగే 2009లో మన సింగరేణికాలరీస్‌లో 600 మెగావాట్ల కెపాసిటీ గల రెండు యూనిట్లకు(1200 మెగావాట్లు) మేము ఫౌండేషన్ వేశాం. అందులో ఒక యూనిట్ కమిషన్ అయిందనే శుభవార్తను పేపర్లలో చూశాం. మొత్తం 2200 మెగావాట్లకు మేము చర్యలు తీసుకున్నాం. ఇది సైకిల్ సార్, ఒక ప్రభుత్వం తర్వాత ఇంకొక ప్రభుత్వం వస్తుంది. మేము గతంలో తీసుకున్న నిర్ణయాల ఫలితాలు ఇప్పుడు వచ్చాయి. మీరన్నారు, రెండు సంవత్సరాలలో బిహెచ్ఇయల్ నుంచి రెడీగా ఉన్న ప్లాంటును తీసుకొస్తామన్నారు. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే – మన మీద చాలా భారం పడబోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి కొన్ని పద్ధతులు మార్చుకుంటే బాగుంటుంది, లేకపోతే రాబోయే కాలంలో తెలంగాణ ప్రజలకి నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

యాదాద్రిలో నాలుగువేల మెగావాట్లు తీసుకొస్తామన్నారు. దానికి రూ.91,000 కోట్లు బాండ్స్ లేకపోతే పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ లేదా రూరల్ ఎలక్ట్రికల్ కార్పోరేషన్ ద్వారా లోన్ తీసుకోవడానికి యం.ఓ.యు. చేసుకోవడం జరిగింది. ఇప్పటికే రూ.53,000 కోట్లు వాటర్‌గ్రిడ్‌కి అవుతోంది. మళ్లీ పవర్‌కి రూ.91,000 కోట్లు అప్పు తెచ్చుకోవడానికి యం.ఓ.యు. చేసుకున్నాం. యాదాద్రిలో రెండు టెక్నికల్ సమస్యలున్నాయి. ఒకటి – ఎనిమిది సంవత్సరాల క్రితం అంటే 2008లో మేము భూపాల్‌పల్లిలో 600 మెగావాట్ల టర్బయిన్‌కి వెళ్లాం. సోనియాగాంధీగారి నేతృత్వంలో కృష్ణపట్నంలో 800 మెగావాట్లతో రెండు యూనిట్లకు(1600 మెగావాట్లు) ఫౌండేషన్ వేశాం. అది ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కమిషన్ అయింది. 800 మెగావాట్ల టర్బయిన్‌కి పోవడం వల్ల ల్యాండ్, ఫీల్డ్ కాస్ట్, రికరింగ్ ఛార్జెస్ మిగులుతాయి.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి : అధ్యక్షా, యల్ఓపి గారు అప్పుల భారం గురించి చాలా చక్కగా చెప్పారు. సంసారం గాని, రాష్ట్ర ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ అప్పులు ఎవరికైనా భారమవుతాయి. కానీ ఒక విషయం గమనించవలసిన అవసరం ఉంది. బడ్జెట్ ప్రజెంటేషన్ చేసినపుడు ఈ అప్పుల భారాన్ని మనం ప్రైమరీ డెఫిసిట్‌లో చూస్తాం. ఏ ప్రభుత్వానికైనా కనీసం పది సంవత్సరాల తర్వాత వాళ్లు చేసిన అప్పుల భారం తెలుస్తుంది. అప్పటి వరకు మనం కట్టవలసిన అవసరం ఉండదు, కేవలం వడ్డీ చెల్లింపు ఉంటుంది. మన బడ్జెటులో రూపొందించిన లెక్కల ప్రకారం ఈసారి మన ప్రైమరీ డెఫిసిట్ రూ.15,700 కోట్లు . అంటే మన పాత అప్పుల భారం ఇంకా మన మీద ఉంది కాబట్టే ఇది పెరిగింది. మోబిలైజేషన్ గురించి యల్ఓపి గారు చెప్పిన విధంగా పధ్నాలుగవ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారంగా ఈ సంవత్సరం నుంచి 42 శాతం సెంట్రల్ షేర్స్ నుంచి మనకి వస్తాయి. దాదాపు రూ.20,000 కోట్ల నుంచి రూ.25,000 కోట్ల వరకు మనకి అదనంగా ఇన్‌కమ్ వస్తుంది.

రెండో విషయం – మన రాష్ట్రంలో సేల్స్ ట్యాక్స్ పెద్ద ఎత్తున 18 శాతం పెరిగింది. ముందు 58 శాతం ఉంటే ఇప్పుడు 75 శాతం వచ్చింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో కూడా పెరుగుతూ వచ్చింది. మేము చేసిన అప్పుల రీపేమెంటు ఇంకా మొదలు కాలేదు. మా అంచనాల ప్రకారం పెరిగిన ఆదాయంతో వాటన్నింటినీ వేసవు సమకూర్చుకోగలుగుతామో లేదో మీరు అసెస్ చేసి చెబితే బాగుంటుంది.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్: గౌరవ సీనియర్ సభ్యులు యాదవరెడ్డి గారు కొన్ని విషయాలు చెప్పారు. అధ్యక్షా, నేను చెప్పేది కాదు, మీ బడ్జెటులో రూ.15,000 కోట్లు ప్రభుత్వం తగ్గించుకుంది. మీరు వేసిన అంచనాలు తప్పని సవరించిన అంచనాల ద్వారా స్పష్టమవుతోంది.

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ శ్రీ నేతి విద్యాసాగర్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో ఎప్పుడైనా ఒక హెడ్‌కి తక్కువైతే ఇంకొక హెడ్‌కి పెరుగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, ఇతర రాష్ట్రాలలో గానీ బడ్జెటు వివరాలు చూడండి. సాధారణంగా రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో కేటాయింపు పెరుగుతుంది. ఎందుకంటే కొన్ని డిపార్టుమెంట్లలో మంచి పనులు జరిగినపుడు ముఖ్యమంత్రిగారు అదనంగా నిధులు కేటాయిస్తారు కాబట్టి పెరుగుతుంది. తగ్గించుకోవడం అన్నది very rare case. కాని తెలంగాణ నూతన ప్రభుత్వం తగ్గించుకుంది.

సేల్స్ ట్యాక్స్‌కి సంబంధించి 18శాతం పెరిగిందని యాదవరెడ్డిగారు చెప్పారు, 18 శాతం కాదు 29 శాతం పెరిగింది. కొత్త టెక్నాలజీ ప్రకారం 800 మెగావాట్ల టర్బయిన్ పెడితే 4,000 మెగావాట్లకు ఐదు టర్బయిన్లు పెట్టవచ్చు. కానీ పాత టెక్నాలజీ ప్రకారం 270 మెగావాట్ల టర్బయిన్ తీసుకొచ్చి అక్కడ పెట్టడం వల్ల మనకి 30 సంవత్సరాల వరకు లాస్ ఉంటుంది. రికరింగ్ ఛార్జెస్‌కి, మ్యాన్ పవర్‌కి ఎక్కువ ఖర్చు అవుతుంది. తొమ్మిది సంవత్సరాల క్రితం మేము 800 మెగావాట్ల టర్బయిన్లకి వెళ్లాం, ఇప్పుడు మీరు పది సంవత్సరాల తర్వాత back to pavilion అన్నట్లుగా 270 మెగావాట్ల టర్బయిన్లకి పోవడం వల్ల మనకి నష్టం జరుగుతుంది. కనీసం ఇప్పుడైనా ఆలోచన చేయండి.

రాష్ట్ర పునర్ విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం మనకి రెండే రెండు హామీలు ఇచ్చింది, మనకి పెద్దగా వాళ్లహామీలేమీ లేవు. ఆ రెండింటిలో ఒకటి – ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకి జాతీయ హోదా కల్పించడం, రెండు – రామగుండం యన్‌టిపిసి ద్వారా నాలుగువేల మెగావాట్ల విద్యుత్, అది పూర్తిగా నూటికి నూరు శాతం తెలంగాణాకే. కేంద్రప్రభుత్వం రూ.24,000 కోట్లు పెట్టి, మనకి నాలుగు వేల మెగావాట్ల విద్యుత్‌ని మనకి ఇవ్వాలి. యూనిట్ ధర రూ.2.50పైసల కంటె తక్కువగా వచ్చే అవకాశం ఉంది. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులో ఇంపోర్టెడ్ కోల్ వాడుతారు కాబట్టి యూనిట్ రూ.5.75పైసలకంటె తక్కువ రాదు. ఎంత తక్కువకి వచ్చినా యూనిట్ రూ.5 కన్నా తక్కువకి రాదు. అటువంటప్పుడు విద్యుత్ సెక్టారుకి రూ.91,000 కోట్లు ఎందుకు? జనరేషన్ కాస్ట్ యూనిట్‌కి రూ.5/- ఎందుకు? కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి ఈ యన్‌టిపిసి ని తొందరగా ప్రారంభిస్తే ఒక్క రూపాయి కూడా అవసరం లేదు. నాలుగువేల మెగావాట్ల కరెంటు వస్తుంది. అది కూడా తక్కువ రేటులో, యూనిట్ రెండు రూపాయలు లేదా మూడు రూపాయలలోపు మనకి వస్తుంది. దీన్ని మీరు ఆలోచించాలని కోరుతున్నాను.

కేంద్రంలో 50,000 మెగావాట్ల విద్యుత్ ప్రొడక్షన్ ఎందుకు వచ్చిందంటే దానికి రెండు కారణాలున్నాయి. Luckily కేంద్రంలో మోదీ గారికి గానీ, ఇటు మన ముఖ్యమంత్రి గారికి కానీ కలిగిన బెనిఫిట్ ఏమంటే, బొగ్గు ధర అంతర్జాతీయ మార్కెట్లో 40 శాతం పడిపోయింది. కాబట్టి ప్రతి ఒక్కరూ ఇంపోర్టెడ్ కోల్ తెచ్చుకుంటున్నారు. పవర్ జనరేషన్‌లో 30 శాతం, 40 శాతం ఉండే కంపెనీలు కూడా నేడు నూరు శాతం కెపాసిటీతో జనరేషన్ చేస్తున్నారు, ఎందుకంటే కోల్ రేటు తగ్గిపోయింది. అదే విధంగా క్రూడ్ ఆయిల్ రేటు కూడా అంతర్జాతీయ మార్కెట్లో బాగా పడిపోయింది. 2014లో యుపిఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రూడ్ ఆయిల్ బ్యారెల్ 138 డాలర్లు ఉండేది. కానీ నేడు బ్యారల్ ధర 27 డాలర్లకు పడిపోయింది. ఎంత తేడా ఉందో చూడండి. అయినా పెట్రోలు ధరలు దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ తగ్గలేదు. ట్యాక్సులు పెంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బాగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. బాగా డబ్బులు మిగులుతున్నాయి, దాంతో ట్యాక్స్ రెవెన్యూ బాగా ఉందని చెబుతున్నారు. తగ్గించడానికి బదులు పెట్రోలు మీద ట్యాక్సులు బాగా వేస్తున్నారు. క్రూడ్ ఆయిల్ బ్యారెల్ 138 డాలర్ల నుంచి 27 డాలర్లకి పడిపోయినా ఎక్కువ ట్యాక్సులు వసూలు చేసి వినియోగదారుల మీద భారం వేస్తున్నారు.

ఒకప్పుడు నాఫ్తా రేటు చాలా హెచ్చు స్థాయిలో ఉండేది. నేడు నాఫ్తా తక్కువ రేటుకు లభ్యం అవుతున్నందున గ్యాస్ బేస్డ్ పవర్ జనరేషన్ కంపెనీలన్నీ కూడా నాఫ్తాను వాడుతున్నాయి. క్రూడ్ ఆయిల్ బ్యారెల్ 27 డాలర్లకు పడిపోవడం వల్ల ఈరోజు నాఫ్తాతో 900 మెగావాట్ల వరకు వాళ్లు ప్రొడక్షన్ తీసుకొచ్చారు. గవర్నమెంటులో లేను కాబట్టి ఎగ్జాక్ట్ ఫిగర్ చెప్పలేను, ఒక వంద అటూ ఇటూగా ఉండవచ్చు. నాకున్న అంచనాల ప్రకారం ప్రతిరోజు 1500మెగావాట్ల వరకు రాష్ట్రప్రభుత్వం విద్యుత్‌ని కొనుగోలు చేస్తోంది. మేము అధికారంలో ఉన్నప్పుడు యూనిట్‌కు రూ.14 పెట్టి కొందామన్నా కరెంటు మార్కెట్లో లభ్యంగా లేదు. కానీ ఈరోజు విద్యుత్ మార్కెట్లో పుష్కలంగా లభ్యమవుతోంది. రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో ఇంకా చౌకగా కరెంటు దొరుకుతుంది. యూనిట్ రూ.3లు, రూ.4లకు ఇచ్చే వాళ్లు కూడా ఉంటారు. ఎందుకంటే తొందరగా విద్యుత్‌ని ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు వస్తున్నాయి. ఛత్తీస్‌ఘడ్‌లో, నార్త్ ఈస్ట్‌లో వేల సంఖ్యలో హైడల్ పవర్ జనరేషన్ ప్రాజెక్టులు వస్తున్నాయి. వాళ్లకి యూనిట్ యాభై పైసలు, అరవై పైసలకి తయారవుతుంది. నార్త్ ఈస్ట్ నుంచి పవర్ కారిడార్ తయారవుతోంది. అప్పుడు కరెంటు అధికంగా లభ్యమవుతుంది.

యాదాద్రిలో 270 మెగావాట్ల టర్బయిన్లు కాకుండా 800 మెగావాట్లకు పెంచే ప్రయత్నం చేయండి. యన్‌టిపిసి థర్మల్ ప్రాజెక్టుకు సంబంధించి మేము కూడా మీతోపాటు కేంద్ర ప్రభుత్వం దగ్గరికి వస్తాం, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి ఆ ప్రాజెక్టుని పూర్తి చేయడానికి మా సహకారం పూర్తిగా ఉంటుందని తెలియజేస్తున్నాం.

అధ్యక్షా, వ్యవసాయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఫిగర్స్ ఇచ్చింది. ఇది రాష్ట్రప్రభుత్వం ప్రింట్ చేసిన బుక్ (తన చేతిలో ఉన్న Socio Economic Outlook 2016-17 ని చూపిస్తూ). 2014-15లో ప్యాడీ 45లక్షల మెట్రిక్ టన్నుల ప్రొడక్షన్ ఉంటే ఈసంవత్సరం 29.79 లక్షల మెట్రిక్ టన్నులుంది, అంటే 34శాతం ప్రొడక్షన్ ప్యాడీలో తగ్గిపోయింది. అలాగే మెయిజ్ 2014-15లో 23లక్షల మెట్రిక్ టన్నులుంటే ఈసంవత్సరం16లక్షల మెట్రిక్ టన్నుల ప్రొడక్షన్ వచ్చింది, అంటే 30శాతం మైనస్ అయింది. అలాగే పల్సెస్‌లో 5శాతం, ఫుడ్‌గ్రెయిన్స్‌లో 32శాతం, గ్రౌండ్‌నట్‌లో 38శాతం, సోయాబీన్‌లో 3 శాతం, ఆయిల్‌సీడ్స్‌లో 34శాతం, షుగర్‌కేన్‌లో 16శాతం ప్రొడక్షన్ తగ్గిపోయింది. ఈ సమాచారం మీరు ప్రింట్ చేసిన Socio Economic Outlook 2016-17 బుక్‌లో ఉంది. గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి ప్యాడీలో 33శాతం ప్రొడక్షన్ పడిపోవడమున్నది not a joke. 70శాతం మంది ప్రజలు మన రాష్ట్రంలో వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులలో 90శాతం మంది రైతు కుటుంబాల నుంచి వచ్చిన వారే. మన పేరెంట్స్ అందరూ రైతులే. ఇంత పెద్ద ఎత్తున వ్యవసాయంలో దిగుబడి పడిపోవడం చాలా ప్రమాదకరంగా ఉంది. ఈరోజు మనకు ఫుడ్ షార్టేజీ వస్తుంది. ఈవిషయంపై ప్రభుత్వం ఒకసారి బాగా ఆలోచన చేయాలి. ఇరిగేషన్ విషయాలతో సహా పడిపోయిన వ్యవసాయ దిగుబడుల మీద అధ్యయనం చేసి, అదనంగా ప్రొడక్షన్ పెంచుకోవడానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారో ఈ బడ్జెటులో మాత్రం ఎక్కడా కూడా ఇండికేషన్ లేదు.

1.10 మ. రెండు సంవత్సరాల నుండి వ్యవసాయ శాఖని చాలా నిర్లక్ష్యం చేస్తున్నారు. పవర్ సెక్టార్‌లో ప్రభుత్వం టాక్స్‌లు వేయమని చెప్పింది. కానీ, 100 యూనిట్లపై ఉపయోగించుకునే వారిపై అదనంగా రూ.2000కోట్ల భారం వేశారు. ఇప్పుడు మళ్లీ fuel surcharge మాములుగా విద్యుత్తు బిల్లుల్లో వేస్తారు. దాని రూపంలో దాదాపు రూ.3000కోట్లు భారం వేస్తున్నట్లు తెలిసింది. ఎందుకంటే డిస్కాం వారికి revenue expenditureలో తేడా ఉంది. కాబట్టి డిస్కాంలు సరిగ్గా నడవాలంటే వారు fuel surcharge రూపంలో నిధుల భారం consumersపైనా అయినా వేయాలి, లేదంటే ఆ భారాన్ని ప్రభుత్వమైన మోయాలి. అందుకని ఈ భారం ఏవరిపై పడుతుందనే విషయంలో ప్రభుత్వం నుండి క్లారిటీ లేదు. ఈ వివరాలు తెలపాల్సిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదేవిధంగా వ్యవసాయదారులకు ఉచితంగా సరఫరా చేసేటువంటి ఏడు గంటల విద్యుత్తు ద్వారా ప్రభుత్వంపై

రూ.4,400కోట్ల భారం పడుతుందని అంటున్నారు. కానీ, ప్రభుత్వం ఇప్పుడు ఉచిత విద్యుత్తు సరఫరాని 7 నుండి 9 గంటలకు పెంచుతున్నామని చెబుతున్నారు. చాలా సంతోషం. అయితే ఈ 7 నుండి 9 గంటలకు పెరుగుతున్న విద్యుత్తు, అంటే 2 గంటల అదనపు విద్యుత్తు సరఫరాకి అయ్యే నిధులు ఎక్కడినుండి ఖర్చు పెడుతున్నామనేది బడ్జెట్‌లో ఎక్కడా చూపించలేదు. వాటిని ఎలా పూరిస్తారనేది వివరణ ఇవ్వాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ప్రతి సంవత్సరం రబీలో 10లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంట పండేది. కానీ ఈ సీజన్‌లో మాత్రం 5,32,000హెక్టార్లు మాత్రమే పంట పండింది. దాంతో దాదాపు 49శాతం పంట తగ్గిపోయింది. 231 మండలాల్లో కరవు ఉందని ప్రభుత్వం వెల్లడించింది. దాని రూపంలో రూ.2,515కోట్ల నిధులు కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరితే, మన రాష్ట్రానికి మంజూరు చేసిన నిధులు మాత్రం రూ.791కోట్లు మాత్రమే. దాంతో దాదాపుగా రూ.1,724కోట్లు వస్తున్న తేడాని రాష్ట్రప్రభుత్వ నిధుల నుండి ఇస్తరా? రాష్ట్రం ఎక్కడినుండైనా లోన్ తీసుకువస్తుందా అనేది బడ్జెట్‌లో ఎక్కడా చూపించలేదు. ఎందుకంటే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో రైతుల పిల్లలంతా గల్ఫ్ దేశాలకు, తదితర విదేశాలకు వలసలు వెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి 70శాతం ఉన్నటువంటి వ్యవసాయదారులను ఈ కరవు నుండి ఎలా కాపాడుతారో తెలియజేయాల్సిందిగా ఆర్థికమంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (మైకు లేకుండా) : అధ్యక్షా, కరవు వచ్చినప్పుడు కరవు సహాయం మాత్రమే చేయబడుతుంది. గానీ, నష్టపరిహారం ఇస్తామని చెప్పలేదు. నష్టమనేది.......

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారి సమాధానం కూడా ఈయనే ఇస్తే ఎట్లా?

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : సుధాకర్ రెడ్డి గారు మీరు కూర్చోండి.. కూర్చోండి..... వారిని మాట్లాడనివ్వండి. తరువాత మీరు మాట్లాడండి.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : అధ్యక్షా, నేను చెబుతున్న ఫిగర్ నేను మేసింది కాదు. ప్రభుత్వం ఇచ్చిందే చెబుతున్నాను. కేంద్ర ప్రభుత్వం నుండి డ్రాట్ కమిటీ వచ్చినప్పుడు వారికి రాష్ట్రప్రభుత్వం సమర్పించినటువంటి నివేదికలోని ఫిగర్సే ఇవి. నావి కావు. ...............

میں شکایت نہیں کر رہا ہوں، حکومت سے کہہ رہا ہوں کہ سات گھنٹے، اور پھر extra نو گھنٹے دیتے بول رہے ہیں، اس کے پیسے کہاں سے دیں گے اور کب دیں گے؟ اسی لئے آپ اس کو positive میں لو، negative میں مت لو۔ میں نے آپ کو مبارکبادی دی، میں آپ کو welcome کر رہا ہوں ۔میں نے کچھ نہیں کہا۔ میں نو گھنٹے کو welcome کر رہا ہوں۔ میں یہ بول رہا ہوں کہ اس میں دو گھنٹے کے پیسے بھی ملا دینا تھا جیسے 4,000 کروڑ ہم جیسے subsidy دے رہے ہیں، اس میں نو گھنٹے کا ملا کر دینے کے لئے بول رہا ہوں۔ مت دو نہیں بول رہا ہوں، میں نے پہلی ہی welcome کر دیا۔ غریب لوگوں کو آپ گھر بنا کر دے رہے ہیں، ہم welcome کر رہے ہیں۔

అందుకని వ్యవసాయం మీద ఇంకా శ్రద్ధ పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, కరీంనగర్, నిజామాబాద్ మరియు మెదక్ జిల్లాలకు సంబంధించిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని అమ్ముతారా? రివైవ్ చేసి నడిపిస్తారా? అనే విషయాలు ప్రస్తుత బడ్జెట్‌లోను, గత బడ్జెట్‌లోనూ ఎక్కడా ప్రస్తావించలేదు. ప్రతిపక్షాల సభ్యులు, మిత్ర పక్షాల సభ్యులు రైతు సంఘాల వారు అందరూ నిజాం షుగర్ ఫ్యాక్టరీ గురించి పోరాడిన వారే.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు నిజాం షుగర్ ఫ్యాక్టరీని మొదటి ఎజెండాగా తీసుకున్నాము. నిజాం షుగర్ ఫ్యాక్టరీని మూసివేస్తే మూడు జిల్లాల్లోని రైతులను ఎవరు ఆదుకుంటారు. తెలంగాణలో ఉన్న నిజాం నిర్మించినటువంటి నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతపడి పోతూఉంటే ఏమి చేస్తున్నారని ఆంధ్ర పాలకుల మీద రోజు దుమ్మెత్తి పోస్తుండే వారిమి. ఇప్పుడు ఈ ఇరవై ఒక్క నెలల నుండి మన ప్రభుత్వం ఏమి చేస్తుందనేది ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరుతున్నాను. అలాగే మన రాష్ట్రంలో మూతపడుతున్నటువంటి మిగతా పరిశ్రమల గురించి కూడా ఆలోచించాలని కోరుతున్నాను.

NRI ISSUES :

ప్రవాస భారతీయులు ముఖ్యంగా రెండు రకాలుగా ఉన్నారు. యూరప్ దేశాల్లో ఉన్నటువంటి ఎన్ఆర్ఐలకు

సమస్యలు కొద్దిగా తక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా మన రాష్ట్రం నుండి నైపుణ్యత గల కార్మికులు కాకుండా ఎవరంటే వారు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ప్రతి రోజు దాదాపు 500 నుండి 1000 మంది వరకు యువకులు విదేశాలకు వలస వెళ్తున్నారు. ఇప్పుడే వెళ్తున్నారని చెప్పడం లేదు. గతంలో కూడా ఇలానే వెళ్లేవారు. అక్కడ ఎవరెవరు అక్రమంగా ఉన్నారో వారు రెండు నెలల్లో తిరిగి తమ, తమ దేశాలకు వెళ్లాలని, క్రిమినల్ కేసులు ఏమీ పెట్టమని 2006లో యుఏఈ ప్రభుత్వం amnesty డిక్లేర్ చేసింది. అప్పుడు నేను ఎన్ఆర్ఐ మంత్రిగా ఉన్నాను. దాదాపు 1258 మందికి టికెట్ డబ్బులు ప్రభుత్వం ద్వారా చెల్లించి, వారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీ సర్టిఫికెట్స్ ఇచ్చి వారిని స్వయంగా ఫ్లైట్లో తీసుకురావడం జరిగింది.

టిఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో కూడా ఎన్ఆర్ఐల గురించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని చెప్పారు. కానీ, గత సంవత్సర బడ్జెట్‌లో చూసినా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో చూసినా దానికి భిన్నంగా ఉంది. ఎన్ఆర్ఐలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు, విదేశాల్లో ఎవరైనా చనిపోతే వారి శవాలను తీసుకురావడానికి, ఏదైనా లీగల్ అసిస్టెన్స్ గురించి 2013-14లో రూ.3కోట్ల బడ్జెట్ పెట్టాము. ఇప్పుడు బడ్జెట్ గురించి ప్రస్తావనే లేదు.

NAC Centres:

National Academy of Construction (NAC) ద్వారా మన రాష్ట్రం నుండి విదేశాలకు వెళ్లే కార్మికులకి రెండు నెలల ముందే Electrician, Glass cutter, Steel molder, మేసన్లకి న్యాక్ ద్వారా శిక్షణను ఇప్పించేవారిమి. ఇప్పుడు న్యాక్ సెంటర్లని పూర్తిగా మూసివేయడం జరిగింది. ఏ పనిలోనైనా half per cent income న్యాక్ సెంటర్లకి పంపించేవారు. కంట్రాక్టర్లు ఏమన్నారంటే, మా ఎస్టిమేట్స్‌లో పెట్టకుండా half per cent కలెక్ట్ చేస్తున్నారని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం కొత్త ఎస్టిమేట్‌లో అదే half per cent న్యాక్‌కి వెళ్లే విధంగా గానీ, లేదంటే ప్రభుత్వం వద్ద దీనికంటే ఇంకేమైనా మంచి పద్ధతి ఉంటే దానిని చేస్తే బాగుంటుందని కోరుతున్నాను. నిజామాబాద్‌లో మూడు సెంటర్లు ఉన్నాయి, అంకాపల్లి, కామారెడ్డిలో ఒక్కొక్క సెంటరు ఉంది. వాటిద్వారా ప్రతి నెలలో దాదాపుగా రెండువేల మంది శిక్షణను తీసుకొని విదేశాలకు వెళ్లేవారు. కొన్ని సెంటర్లు కరీంనగర్‌లో, జగిత్యాలలో ఉన్నాయి. అలాంటి న్యాక్ సెంటర్లు అన్నీ మూతపడిపోయాయి. ఎందుకంటే నిధులు లేవు. దానివల్ల విదేశాల్లోకి వెళ్లేటువంటి యువకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఎన్.ఆర్.ఐ.ల కొరకు బడ్జెట్‌లో తక్షణమే నిధులు కేటాయించి వారిని ఆదుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**సంక్షేమం :**

సంక్షేమ రంగానికి కేటాయిస్తున్న బడ్జెట్‌లో గత రెండు సంవత్సరాల నుండి యాభై శాతం ఖర్చు చేసింది ఎప్పుడూ దాటలేదు. ఎస్సీ/ఎస్టీ సబ్ ప్లాన్, వారి సంక్షేమం, బిసి సంక్షేమం, మైనారిటీ సంక్షేమంలో ఖర్చు చేసింది ఎప్పుడూ కూడా యాభై శాతం దాటలేదు. సంక్షేమానికి రూ.15,000కోట్లకు రివైజ్ చేసినప్పటికీ అందులోనుంచి దాదాపు రూ.6,000కోట్లు కట్ చేశారు. కాబట్టి సంక్షేమం నుండి నిధుల కోతలు కోయకుండా సంక్షేమ రంగానికే వెచ్చించాలని కోరుతున్నాను.

మైనారిటీల సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ.1,030కోట్లు కేటాయించారు. ఖర్చు మాత్రం రూ.449కోట్లు ఖర్చు చేశారు. కానీ, మిగతా దాదాపు రూ.600కోట్లు ఖర్చు కాలేదని, వాటిని వచ్చే బడ్జెట్‌కి carry forward చేస్తామని గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ మహమూద్ అలీ గారు హామీ ఇచ్చారు. అలాగే మాదగ్గర స్టాఫ్ లేని విషయం వాస్తవం, ఆ పథకాలు అమలుకాని విషయం వాస్తవమని కూడా అన్నారు. ఆ నిధులు క్యారీ ఫార్వర్డ్ అవుతాయా అనే విషయాన్ని ఆలోచన చేసి చెప్పండని అడిగితే, అవును క్యారీ ఫార్వర్డ్ చేస్తామని చెబుతున్నారు. అంటే ఈ హౌజ్ మీద రోజురోజుకి భయం, భక్తి పోతుంది. నేను 1989లో మంత్రిగా ఉన్నప్పుడు హౌజ్‌లోకి పోయి తెలియకుండా ఏదైనా హామీ ఇస్తానని లోనికి వెళ్లేముందు రెండు, మూడు సార్లు అల్లాను గుర్తు చేసుకొని లోనికి వెళ్లేది. ఎందుకంటే మళ్లీ హామీల కమిటీ ఎక్కడ పట్టుకుంటుందో అనే భయం ఉండేది. ఇప్పుడేమో మాటకు చెప్పేస్తున్నారు. 1,07,000ఉద్యోగాలన్నారు. అది ఇప్పుడొచ్చి

56వేలకు అయింది. సభలో హామీ ఇచ్చేటప్పుడు అధికారులతో సంప్రదించండి. ఇప్పుడు ఎవరైతే రూ.600కోట్లు క్యారీ ఫార్వర్డ్ చేయవచ్చని ఏ అధికారి మీకు సలహా ఇచ్చారో వారిని సస్పెండ్ చేయండి, వారిమీద చర్యలు తీసుకోండి.

హౌజ్‌లకి ఒక గౌరవం ఉంటుంది. శాసనసభకు, శాసనపరిషత్తుకు, పార్లమెంటు వ్యవస్థలకు కూడా గౌరవం పడిపోతే ఎలా అధ్యకా. దీనివల్ల డెమోక్రసీకి ప్రమాదం ఉంటుంది. మైనారిటీలకు గత బడ్జెట్ కంటే అదనంగా రూ.74కోట్లు కేటాయించారు. 70 Minority English Medium Residential Schools ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆ నిర్ణయాన్ని హర్షిస్తున్నాము. దానికి స్వాగతం చెబుతున్నాను. కొత్తగా తెస్తున్న 70 Minority English Medium Residential Schoolsకి రూ.350కోట్లు అన్నారు. వాటికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించలేదు. గతంలో కేటాయించిన రూ.1130కోట్లకు అదనంగా ఇప్పుడు రూ.74కోట్లను కేటాయించి మైనారిటీలకు ఏర్పాటు చేస్తున్న 70 Minority English Medium Residential Schoolsకి రూ.350కోట్లు ఇందులోంచే కేటాయిస్తున్నామని అంటున్నారు.

మాకు సవాళ్లలో ఏమిచ్చారంటే, మేము ఇది అడిషనల్‌గా 350 Crores for the seventy new residential School establish కొరకు ఇస్తున్నామని అంటున్నారు.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (మైకు లేకుండా) : గతంలో ఖర్చు చేయనటువంటి బడ్జెట్‌ను ఈ బడ్జెట్‌కి క్యారీ ఫార్వర్డ్ చేస్తారా? చెప్పండి, చెప్పండి అని అడిగినా కూడా తాను(శ్రీ మహమూద్ అలీ) ఆరోజు చెప్పలేదు.

మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్ : సుధాకర్ రెడ్డి గారు కూర్చోండి.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : 2014లో నేను డిప్యూటీ లీడర్‌గా ఉన్నప్పుడు ప్రశ్నిస్తే, ఇదే సభలో, అదే చెయిర్ మీద ఉప ముఖ్యమంత్రి గారు జవాబు తెలియజేస్తూ, Yes, అవసరమనుకుంటే ఎస్సీ/ఎస్టీ సబ్ ప్లాన్ లేనటువంటి బిసి మరియు మైనారిటీలది క్యారీ ఫార్వర్డ్ చేస్తామని ఆన్ రికార్డు చెప్పినారు. ఒకవేళ చెప్పలేదని రికార్డులో లేదంటే ఈరోజు ఏ శిక్షకైనా నేను రెడీ. శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి గారూ మీరు దానికి ఒప్పుకుంటారా? గౌరవ ముఖ్యమంత్రి గారు 2014-15లో ....

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (మైకు లేకుండా) : అధ్యక్షా, నేను అనేది అదే అవసరమైతే ఎన్ని నిధులు కావాలంటే అన్ని నిధులు ఇస్తమన్నారని. మీరే చెప్పారు...

మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్ : సుధాకర్ రెడ్డి గారు కూర్చోండి.

శ్రీ మహమ్మద్ ఆలి షబ్బీర్ : అధ్యక్షా, నేను ప్రభుత్వానికి మంచి సలహాలు ఇచ్చుకుంటూ పోతున్నాను. మంత్రులేమో మంచిగా వినుకుంటూ కూర్చున్నారు. ముస్లీంలకు 12శాతం రిజర్వేషన్ అని అన్నారు. 12శాతం రిజర్వేషన్ మీద గౌరవ ముఖ్యమంత్రి గారు కొద్దిగా క్లారిటీగా ఇచ్చారు. పి.సుధీర్ కమిటీ వచ్చిన తరువాత మొదటిసారి సభలో క్లారిటీ వచ్చింది. ముందుగా ఎలా ఇవ్వగలుగుతారని మేము అడిగాము. ఎలా ఇవ్వగలుగుతారనే దానిమీద మీరు ముందుగా రోడ్‌మ్యాప్ తయారు చేయండని చెప్పాము. ఏ రిజర్వేషన్ అయినా 50శాతానికి మించరాదని అర్చనా రెడ్డి కేసులో 11 మందితో కూడిన జీవన్ రెడ్డి గారి బెంచ్, సుప్రీంకోర్టులో తీర్పును వెలువరించింది. ఆ తీర్పు తరువాత ఏ రాష్ట్రంలో కూడా 50శాతానికి మించి రిజర్వేషన్ రాలేదు. జాట్స్ అడిగారు, కానీ అదీ పోయింది. హర్యానా వాళ్లు వేశారు, దాన్ని కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాబట్టి దీనికి ప్రమాదం ఉందని చెప్పాము. కానీ, నేను చేస్తానని, అవసరముంటే డెలిగేషన్‌ని ఢిల్లీకి తీసుకుపోతామని గౌరవ ముఖ్యమంత్రి గారు అన్నారు. Ok. It is left to you.

కానీ, ఇప్పుడు 4శాతం రిజర్వేషన్ మీద సుప్రీంకోర్టులో చర్చించడానికై five judges constitutional bench is constituted by the Chief Justice of India. అందులో భాగంగా 4శాతం రిజర్వేషన్ మీద సుప్రీంకోర్టులో చర్చించడానికై 29, ఫిబ్రవరి రోజున తెలంగాణ ప్రభుత్వం తరపున ఎవరూ రాలేదు. అడ్వకేట్ జనరల్ లేరు, అడిషనల్ అడ్వకేట్ జనరల్ లేరు. ప్రకాష్ త్రివేది అన్నారు, అతను లేరు. నేను ఇప్పుడు 12శాతం రిజర్వేషన్ మీద అడగడం లేదు. నాలుగు శాతం రిజర్వేషన్ మీద మాట్లాడుతున్నాను.

1.30 మ. శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి :-

آپ چیف منسٹر کے سامنے شکریہ ادا کرے کہ ہمارا admit کیا ہے۔ آپ کو clarity دیا۔ آپ کی satisfy ہوگئے۔ پھر بعد میں آپ اس بات کو repeat کیوں کر رہے ہیں؟ سی ایم صاحب کا شکریہ ادا کرو۔

جناب محمد علی شبیر (Janab Md.Ali Shabbir): میں اس بات پر نہیں بول رہا ہوں۔ 12% reservations پر بول رہے ہیں۔ میں ایسا کروں گا۔ لیکن اس کا assurance آپ ہی نے دیا۔ اس کی جواب داری نہیں کریں گے آپ ہی ذمہ دار ہوں گے۔

ఇకపోతే హెల్త్ విషయంలో increase in Budget for the Health Sector is not satisfactory. ప్రభుత్వం రూ.5,967/- కోట్లు propose చేసింది. పోయిన సంవత్సరం నుండి చూస్తే రూ.4,900/-కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.1000/- కోట్లు ఈ బడ్జెట్‌లో పెంచారు కానీ, మనందరికి తెలుసు, ఇవ్వాళ ఆరోగ్య రంగం నిర్లక్ష్యానికి గురవుతోంది. కామారెడ్డి, నిజామబాద్ దవఖానలలో డాక్టర్లు పూర్తిగా లేరు. ఎక్కడ X-Ray Machines సరిగా లేవు. Blood Testing Machines పని చేయడం లేదు. స్కానింగ్ ఉన్న చోట ఆపరేటర్ ఉంటే, మెషిన్ పాడైపోయింది అంటున్నారు. మెషిన్ మంచిగా ఉంటే వేరే కారణాలు చెప్పుకొస్తున్నారు. కార్పోరేట్ హాస్పిటల్ స్థాయిలో కాకపోయినా కొద్దిగా తక్కువైనా చేస్తామంటున్నారు. ఈ హాస్పిటల్‌కు సంబంధించి పోయినసారి బడ్జెట్‌లో కేవలం 11 శాతం వరకే ఖర్చైయింది. ఒకసారి ఈ బడ్జెట్‌లో కేటాయించిన amountను హాస్పిటల్స్ మీద చాలా interest తీసుకొని, పెద్ద ఎత్తున దీనిపై బాధ్యత వహించాలని కోరుతున్నాను. ఇంకొక విషయమేమిటంటే ఉస్మానియా హాస్పిటల్ ఉన్నట్లా? లేనట్లా? ఎందుకంటే, రకరకాల statement లు వస్తున్నాయి. ఉస్మానియా జనరల్ హాస్పిటల్, heritage building కూలగొడటానికి వీలులేదని, ఒక వైపేమో దీనిని ఇక్కడి నుండి shift చేసి బ్రహ్మాండంగా కడతామంటున్నారు. ప్రభుత్వం ఒకసారి హాస్పిటల్ కడుతున్నామని, కట్టడం లేదని clarityగా చెప్పడం లేదు. దయచేసి ఈ ఉస్మానియా హాస్పిటల్‌కు మరమ్మత్తులు చేసి, ఎన్ని పడకల హాస్పిటల్స్ కట్టబోతున్నారు? ఎన్ని వేల కోట్లు దీనిమీద ఖర్చుపెడుతున్నారు. దాని గురించి clarity గా సమాధానం కావాలి. అలాగే చెస్ట్ హాస్పిటల్ ఉందా? లేదా? చెస్ట్ హాస్పిటల్‌లో కొత్త సచివాలయం, కొత్త అసెంబ్లీ కడుతున్నారని వార్త వచ్చింది. పేపర్‌లో చదివాం. కానీ మీరే పేపర్‌లో వచ్చే వార్తలన్ని నిజం కావని అంటారు. అందువల్ల హౌస్‌లో మీరే clarity ఇచ్చి, ఈ చెస్ట్ హాస్పిటల్ ఉన్నదా? లేదా? లేకుంటే, రెండు ప్రమాదాలుంటాయి. దాంట్లో 13 PG సీట్లున్నాయి. Medical Council of India (MCI) norms ప్రకారం ఏమైందంటే, 7 నుండి 8 కిలోమీటర్ల దూరంలో టీచింగ్ హాస్పిటల్ ఉండాలి. మన రోగులకు టీచింగ్ హాస్పిటల్ 7,8 కిలోమీటర్ల దూరం ఉంటే, 13 PG సీట్లకు ప్రమాదముంటుంది. అది కూడా దృష్టిలో పెట్టుకొని ఈ రెండు విషయాల గురించి, ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో clarity ఇచ్చి, అసలు ఉన్నాయా? లేవా? ఉంటే ఎలా develop చేయబోతున్నారు? ఎలా improvement చేస్తున్నారు. ఆ విషయాలు తెలుపగలరు. normsలో రూ.1,694/- కోట్లు పెట్టారు. Non- Planలో రూ.9,034/- కోట్లు ఉంది. నేను అనేది KG to PG విద్య విషయంలో ఎంత amount అనేది ప్రస్తావన లేదు. అలాగే యూనివర్సిటీస్ విషయానికి వస్తే, 11 యూనివర్సిటీలు ఖాళీగా ఉన్నాయి. 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రమైంది కానీ, దేశం కాలేదు. ఇవ్వాల మీరు, హైకోర్టులో Chief Justice of High Court of Judicature for the State of Telangana and the State of Andhra Pradesh crystal clear గా ఒక remark పాస్ చేశారు. the bench comprising of Acting Chief Justice. Justice Dilip P. Bhosale and Justice P. Naveen Rao recently ఏమన్నారంటే, మీరు Law change చేయకుండా, G.Oల ద్వారా యూనివర్సిటీ యాక్ట్‌ను మార్చేస్తామంటే, కుదరదు. Either మీరు అసెంబ్లీలో or Parliament యూనియన్ గవర్నమెంట్‌లో ఉన్న యూనివర్సిటీస్‌లా గానీ లేకుంటే మన రాష్ట్రంలో కొత్త చట్టాలు తీసుకురండీ గానీ, G.Oల ద్వారా 10 సంవత్సరాలకు, 5 సంవత్సరాలుగా చేసి Vice Chancellors ఇస్తామంటే, అది సుప్రీంకోర్టు, హైకోర్టు చాలా తప్పు పడుతుంది.

శ్రీ కడియం శ్రీహరి :- అధ్యక్షా, హైకోర్టులో విశ్వవిద్యాలయాలకు సంబంధించి, చట్ట సవరణకు సంబంధించిన కేస్ పెండింగ్‌లో ఉంది. దానిమీద చర్చలు

జరుగుతున్నాయి. The Hon'ble High Court has not given the final Judgment. Observations will be there. You cannot read out those observations in the House. That is not the Judgment. దయచేసి మీరు సీనియర్ లీడర్. You should know these things. If you have Judgment, we will honour it, but observations of the Court are not the Judgments.

శ్రీ మహమ్మద్ అలి షబ్బీర్ :- అధ్యక్షా, ఈ కేసు విషయానికి సంబంధించి మొత్తం ఇంటర్‌నెట్‌లో, పేపర్లో కూడా వచ్చింది. ఎవరో చెప్పింది కాదు.

شبیر علی صاحب! ایک بات تو سنئے، آپ تو senior leader ہیں۔

You should differentiate the Court observations and Court Judgments. Court Judgment is entirely different from the observations. How can you read out these observations in the House?

جناب محمد علی شبیر (Janab Md.Ali Shabbir): 11 Universities تلنگانہ میں ہیں۔ 11 کے 11 خالی ہیں۔ ہماری حکومت بن کے 21 مہینے ہو گئے تو ہم یہ چاہتے ہیں کہ ان یونیورسٹیز کو کتنی نقصان ہے اس کا مر نکال کر دکھا دیجئے۔ Vice Chancellor اس کا سر ہے۔ اگر سر نہ ہو تو یہ body کس کام کی ہے؟ تو ان یونیورسٹیز میں Vice Chancellors نہیں ہیں۔ Vice Chancellor کے بغیر کوئی Registrar نہیں ہے۔ کوئی بھی dashing, dynamic steps لینے کے لئے کوئی competent authority نہیں ہے اس لئے ہم یہ نہیں بول رہے ہیں کہ آپ پانچ سال دس سال جو چاہے کرو لیکن Vice Chancellors کا تقرر کیجئے۔ کورٹ کا observation کورٹ کا کام ہے۔ اس لئے میں بتا رہا ہوں یہ State ہے یا Country نہیں ہے۔ اس لئے آپ کے کئی جی اوز کو نیا نمبر شروع ہوا first سے new numbers کے بارے میں FAST scheme کے بارے میں آپ کے ایسے Parliament کے Secretary کے بارے میں ہائی کورٹ کے دن Judgements کو اس کا پیپر ہے پاس print ہے آپ کے ایسے جی اوز کو challenge کیا گیا اور ہائی کورٹ میں step down کیا تو یہ تمام پیپر ہیں میں آپ کو اس لئے بتا رہا ہوں کہ ہم تھوڑا study کر کے جائیں۔

ఇప్పుడు చాలా సమయం అయిపోయిందని ఛైర్మన్ గారు చెబుతున్నారు. కాబట్టి, మేము మాట్లాడిన విషయాలకు స్పష్టత ఇవ్వండి. ముఖ్యంగా డబుల్ బెడ్రూం పథకం, వాటర్ గ్రిడ్ పథకం మీద 53 వేల కోట్ల రూపాయలు మీరు ఎలా తీసుకొస్తున్నారు. ఎలా Re-improvement చేస్తున్నారు, ఎలా tax వేయకుండా చేయబోతున్నారు. అవన్నీ ప్రజల దృష్టికి తీసుకొచ్చి, దీనిని ఎక్కువ barrow చేసి, richest State ని bankrupt State గా చేయకుండా చూడాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. మన బడ్జెట్ 1 లక్ష 5 వేల కోట్ల కంటే ఎక్కువ రాదని 2014 లో చెప్పాం, 2015లో చెప్పాం, ఇప్పుడు 2016లో కూడా చెబుతున్నాం కానీ మీరు 1 లక్ష 30 వేల కోట్లు ప్రతిపాదించారు. చెప్పడానికి బాగుంది. కానీ, మనం మరీ ఎక్కువగా చెప్పుకొని, కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాకుండా, ఉండేటట్లు చేయెద్దని చెబుతూ, ఈ బడ్జెట్ 1లక్ష 5 వేల కోట్ల కంటే ఎక్కువగా రాదు. ఇది కేవలం ప్రజలకు ఇంత బడ్జెట్ చూపించడానికే బాగుంది తప్ప, ఇది వాస్తవానికి భిన్నంగా ఉందని చెబుతూ, కాంగ్రెస్ పార్టీ తరపున ఈ బడ్జెట్ వాస్తవానికి చాలా భిన్నంగా ఉందని తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను.

మిస్టర్ డిప్యూటి ఛైర్మన్ : 17.03.2016 గురువారం ఉదయం 10.00 గంటలకు సమావేశం కావడం కొరకు సభను వాయిదా వేయడమైనది.

(The House then adjourned at 1.37 p.m to meet again on 18.3.2016 at 10.00 a.m)

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana  Legislative Council and Printed at  the Assembly Press, Public Gardens, Hyderabad.”**